# జాతీయ స్ఫూర్తి

పక్షపత్రిక

RNI Regn No. 52879/93

2021, జూన్ 1-30


## మార్క్సిజం నిలుస్తుంది, గెలుస్తుంది

## కారా కథలు ఎందువల్ల నిలుస్తాయి?

## అగ్నిహోత్రుడు అదృష్టదీపక్

## కొత్త దారుల వెతుకులాట

## లాక్ డౌన్ - పేద శ్రామిక ప్రజలు

## సంపద పంపిణీతోనే అందరికీ జీవన భద్రత

## ఆంధ్రప్రదేశ్‌కు అస్తిత్వ స్పృహ ఉందా ?

## కార్యకారణ సంబంధం వల్లే సృష్టి ఏర్పడింది

## అమ్మకపు వస్తువుగా ఆధ్యాత్మికత

## బాలల శ్రమతో బతకాలా?

## కవిత్వం ఎప్పుడు ఎలా ఎందుకు ?

## మానవ విజ్ఞాన ఖని “కమ్యూనిస్టు ప్రణాళిక”


17-18

జాతీయ స్ఫూర్తి పక్షపత్రిక
2021 జూన్ 1-30
సంపుటి : 29
సంచిక : 17,18

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు
సంపాదక వర్గం
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
కొప్పర్తి వెంకట రమణమూర్తి
డి. సోమసుందర్
మందలపర్తి కిషోర్

ఈ సంచికలో...

3 మార్క్సిజం నిలుస్తుంది, గెలుస్తుంది
వకుళాభరణం రామకృష్ణ

6 కారా కథలు ఎందువల్ల నిలుస్తాయి?
ఎన్ వేణుగోపాల్

9 అగ్నిహోత్రుడు అదృష్టదీపక్
కొప్పర్తి వెంకట రమణమూర్తి

11 కొత్త దారుల వెతుకులాట
యోగేంద్ర యాదవ్

13 లాక్ డౌన్ – పేద శ్రామిక ప్రజలు
ప్రభాత్ పట్నాయక్

16 సంపద పంపిణీతోనే అందరికీ జీవన భద్రత
డి వి వి ఎస్ వర్మ

18 ఆంధ్రప్రదేశ్‌కు అస్తిత్వ స్పృహ ఉందా?
కొప్పర్తి వెంకట రమణమూర్తి

21 కార్యకారణ సంబంధం వల్లే సృష్టి ఏర్పడింది
డాక్టర్ దేవరాజు మహారాజు

23 అమ్మకపు వస్తువుగా ఆధ్యాత్మికత
జావేద్ అక్తర్

27 బాలల శ్రమతో బతకాలా?
కె. శాంతారావు

29 కవిత్వం ఎప్పుడు ఎలా ఎందుకు ?
హెచ్చార్కె

31 మానవ విజ్ఞాన ఖని "కమ్యూనిస్టు ప్రణాళిక"
రేకా చంద్ర శేఖర రావు

సంపాదకీయం

# లక్షద్వీప్‌లో బిజెపి హిందూత్వం

లక్షద్వీప్ దేశంలోనే అతి చిన్న కేంద్రపాలితప్రాంతం. 2021 అంచనా ప్రకారం 74000 జనాభా. లక్షద్వీప్‌కు శాసనసభ లేదు. కేంద్రం నియమించే పాలనాధికారి సర్వాధికారిగా వుంటారు. హోంశాఖ పరిధిలో వ్యవహరిస్తారు.

ప్రస్తుత పాలనాధికారి ప్రఫుల్ పటేల్ మోదీకి సన్నిహితుడు. 2005లో అప్పటి గుజరాత్ హోంమంత్రిగా వున్న అమిత్‌షా ఒక నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో అరెస్టయ్యారు. ఆయన స్థానంలో ప్రఫుల్ పటేల్ హోంమంత్రి అయ్యారు. ప్రస్తుతం పటేల్ సారధ్యంలో అభివృద్ధి పేరుతో ఒక ద్విముఖ వ్యూహం రూపుదిద్దుకుంది.


మొదటిది లక్షద్వీప్ డెవలప్‌మెంట్ అధారిటీ పేరుతో భూముల వినియోగంపై హక్కును పాలనాధికారి స్వంతం చేసుకున్నారు. నిజానికి లక్షద్వీప్ అభివృద్ధిలో వెనకబడి లేదు. అక్షరాస్యతలో 91.00 శాతంతో కేరళ తర్వాత రెండో స్థానంలో వుంది. రాష్ట్రాల మానవాభివృద్ధి సూచికలో అంటే విద్య ఆరోగ్యం, తలసరి ఆదాయాల సమ్మిళిత సూచికలో దేశంలో అగ్రభాగాన 4వ స్థానంలో వుంది. బిజెపి పాలనలో ఉన్న ఉత్తరప్రదేశ్, బీహారు రాష్ట్రాలు మానవాభివృద్ధిలో దేశంలో చివరి రెండు స్థానాలలో వున్నాయి. వాటి అభివృద్ధిని పక్కనపెట్టి మానవాభివృద్ధిలో అగ్రస్థానంలో వున్న లక్షద్వీప్‌ను ఎంచుకుంది. దానిని ఒక పెద్ద పర్యాటక కేంద్రంగా మార్చడానికి, అక్కడ హోటళ్లు, రిసార్ట్‌ల నిర్మాణాలకు కార్పొరేట్ శక్తులకు ద్వారాలు తెరిచింది. ఇప్పటి వరకు ఈ దీవిలో అడుగు పెట్టడానికి స్వంత ఆస్తులు పెంచుకోడానికి వీలులేదు. ఈ డెవలప్‌మెంట్ అధారిటీకి విశేష అధికారాలు ఇచ్చారు. రోడ్లు వెడల్పు చెయ్యడానికి, హోటళ్లు రిసార్ట్‌ల నిర్మాణానికి ఇతర ఏ అభివృద్ధి కార్యకలాపాలకైనా ప్రస్తుతం వున్న ఇళ్లు కూలగొట్టినా, భూములు తీసుకున్నా ఎలాంటి పరిహారం ఇవ్వనక్కరలేదు. కార్పొరేట్ల కోసం ఈ విధ్వంసాన్ని ప్రారంభించింది. మరొకటి ప్రశాంతంగా వున్న లక్షద్వీప్‌లో గూండా వ్యతిరేక చట్టాన్ని ఈ పాలనాధికారి తెచ్చారు. నిజానికి అక్కడ నేరాలు దాదాపుగా లేవు. జైళ్లు ఖాళీగా వున్నాయి. పాలనాధికారి చేపట్టే ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించినా, ఆందోళన చేస్తారన్న అనుమానం వున్నా వారిని విచారణ లేకుండా జైలుపాలు చేసే క్రూరచట్టం తెచ్చారు. ఇక్కడ 98 శాతం ప్రజలు ముస్లింలు. వారు మళయాళం మాట్లాడే ముస్లింలు. వారి సంప్రదాయ ఆహారం మీద ఇతర అంశాల మీద దాడి చేసే చట్టాలు తెచ్చారు.

బిజెపి పాలించే గోవాలో, ఈశాన్య రాష్ట్రాలలో పశుమాంసం మీద ఆంక్షలు లేవు. కాని లక్షద్వీప్‌లో పశుమాంసం అమ్మకం, కొనుగోళ్లు నిషేధించారు. పిల్లల మధ్యాహ్న భోజనంలో మాంసాహారాన్ని తొలగించారు. మద్యపానాన్ని వ్యతిరేకించే ముస్లిం సాంప్రదాయానికి అనుగుణంగా వున్న మద్యనిషేధాన్ని తొలగించారు. నిజానికి లక్షద్వీప్‌లో జనాభా పెరుగుదల తక్కువగా వుంది. ఉత్తరప్రదేశ్‌లో దశాబ్దానికి 19 శాతం పెరుగుతుంటే అక్కడ 13 శాతం పెరుగుదలే వుంది. ముస్లింలు ఎక్కువ మంది పిల్లల్ని కంటారనే ప్రచారం కోసం అక్కడ ఇద్దరు పిల్లలకు మించి వుంటే పంచాయితీ ఎన్నికలలో పోటీకి, ఇతర ప్రభుత్వ సహాయాన్ని నిరాకరించే చట్టం తెచ్చారు.

బిజెపి లక్ష్యం లక్షద్వీప్‌కు హిందూత్వం రుద్దడం, కార్పొరేట్లకు లక్షద్వీప్‌ను ధారాదత్తం చెయ్యడం మాత్రమే. ❑

# మార్క్సిజం నిలుస్తుంది, గెలుస్తుంది


**వకుళాభరణం రామకృష్ణ**
విశ్రాంత చరిత్ర ఆచార్యులు
హైదరాబాద్ విశ్వవిద్యాలయం

**(మే 04, 2021న జాతీయస్ఫూర్తి కారల్‌మార్క్స్ 204వ జయంతి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ జూమ్ సభలో ఆవిష్కర్త శ్రీ వకుళాభరణం రామకృష్ణ గారు చేసిన కీలకోపన్యాస పాఠం)**

ముందుగా వర్మ గారికి, ఆవిష్కరణలో పాల్గొంటున్న కామ్రేడ్స్‌కు, ఈ ప్రత్యేక సంచికలోని రచయితలకు నమస్కారం. వినయం అటుంచి, ఈ విశిష్ట ప్రత్యేక సంచికను విడుదల చేయమని వర్మ గారు, వారి సంపాదక మిత్రులు నన్ను ఎందుకు అడిగారో తెలియదు. వర్మ గారి మాట కాదనలేక యీ పనికి ఒప్పుకొన్నాను, నా పరిమితులను పక్కనబెట్టి. కారల్‌మార్క్స్‌పై, మార్క్సిజంపై ప్రపంచ సాహిత్యంలో ఎనలేని రచనలు, మరే యితర అంశంపై లేనంతగా ప్రశంసిస్తూ, ఖండిస్తూ, విశ్లేషిస్తూ వస్తూనే వున్నాయి. అది మార్క్సిజం ఘనత. ప్రపంచాన్ని కుదిపిన సిద్ధాంతం మార్క్సిజం. ఆర్థికంగా, రాజకీయంగా తలకిందులుగా వున్న మానవ సమాజాన్ని సరిగ్గా, నిటారుగా నిలబెట్టే ప్రయత్నమే మార్క్సిజం. దాని ఉత్థాన పతనాలు, వాటి వివరాలను చర్చించాల్సి వున్నా, దానికిది సరైన అదను కాదు. ఒక్కటే మనం గుర్తుంచుకోవాల్సింది, మార్క్సిజానికి కాలం చెల్లకపోగా రోజు రోజుకూ దాని ప్రాసంగికత ప్రపంచ వ్యాప్తంగా, అందులో భాగంగా మన దేశంలోనూ పెరుగుతూ వస్తున్నది. హైస్కూల్లో వున్నప్పుడు మార్క్సిజం గూర్చి విన్నాను. అంతకంటే అప్పుడు కమ్యూనిస్టు పార్టీయే మాకు ప్రధానం. దాన్ని గురించే వినేవాళ్ళం. ఈ ధోరణి కళాశాల దాటి విశ్వవిద్యాలయం దాకా కొనసాగింది. మధ్యలో రాజకీయ పాఠశాలలు, సైద్ధాంతిక ఉపన్యాసాలు; మార్క్సిజాన్ని, చరిత్ర అధ్యయనానికి, చరిత్రను బోధించడానికి సహాయకారిగా గ్రహించాను.

మార్క్సిజానికి సంబంధించి దాదాపు అన్ని కోణాల నుండి ఈ ప్రత్యేక సంచికలో ప్రముఖుల వ్యాసాలున్నాయి. దాన్ని గూర్చి అదనంగా రెండు మాటలు చెప్పే ముందు ఆంధ్రదేశంలో మార్క్సిజం ప్రభావం, బొల్షివిక్ విప్లవం గూర్చి సంగ్రహంగానూ, వివరంగానూ, అనేక రచనలు వచ్చాయి. తెలుగు సాహిత్యాన్ని, ఒకానొక చారిత్రక దశ నుండి నేటి దాకా, మార్క్సిజం, అది ఏ రూపంలో వున్నా ప్రభావితం చేస్తూనే వుంది. శ్రీశ్రీ కంటే ముందు నుండి, శ్రీశ్రీతో సహా సామ్యవాద భావజాలాన్ని తమ గళాల నుండి / కలాల నుండి రచయితలు వినిపిస్తూనే వున్నారు.

1921లో ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలో 'సోవియట్టులు' అనే శీర్షిక కింద ఎనిమిది పేజీల వ్యాసం వెలువడింది. బొల్షివిక్ విప్లవాన్ని గూర్చి మార్క్సిజాన్ని గూర్చి అతిశయోక్తులను, అవాస్తవ అభాండాలను పక్కనపెట్టి వాస్తవిక విషయాలను తెలియచేసిందీ వ్యాసం. ఈ వ్యాసరచయిత ప్రముఖ కాంగ్రెస్‌వాది భోగరాజు పట్టాభి సీతారామయ్య. ఈ వ్యాసంలో యంత్ర నాగరికత కొని తెచ్చిన లోపాలను, అంతకు ముందే 'కాపిటల్' గ్రంథంలో కారల్‌మార్క్స్ విశ్లేషించిన లోపాలను రచయిత పేర్కొన్నాడు. రష్యాలో విప్లవం జయప్రదమైన తర్వాత అక్కడ నెలకొన్న సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను గూర్చి వివరంగా తెలియచేసిందీ వ్యాసం. ఆయన రష్యాలో జరిగే ప్రభుత్వ ఎన్నిక విధానాలని హర్షించాడు. బోల్షివిక్ విప్లవంపై సామ్రాజ్యవాదులు, వారి ప్రచారకులు చేసిన అపనిందలను పూర్వపక్షం చేశాడు. ఇంకా యిలా అన్నాడు – "విప్లవమనునది ఒక చర్య కాదు. రాజకీయ జీవనమందు ఒక కృత్యము కాదు. అది ఒక అవస్థ. ఒక దశ. ఒక మార్పు. ఒక పరివర్తనము" అంటూ కారల్‌మార్క్స్ ఆశించిన సోషలిస్టు విప్లవాన్ని కొనియాడాడు.

రష్యాలోని సకల జాతుల ప్రజలకు స్వయం నిర్ణయాధిపత్య మిచ్చేందుకు స్వరూప చట్టాలు చేశారని చెబుతూ, ఈ క్రమంలో కొన్ని అతిశయోక్తులు కూడా రచయిత చేసినా, ఆ వ్యాసం మార్క్సిజం ప్రభావంతో విజయవంతమైన రష్యా విప్లవాన్ని తెలుగు ప్రజలకు పరిచయం చేసింది.

ఇదే క్రమంలో, మార్క్సిజం ప్రభావాన్ని, రష్యాలో ఏర్పడ్డ తొలి బోల్షివిక్ విప్లవానంతర సమాజాన్ని గూర్చి ప్రశంసా పూర్వకంగా వెల్లడించిన నవల 'మాలపల్లి'. రచయిత ప్రఖ్యాత కాంగ్రెస్‌వాది ఉన్నవ లక్ష్మీనారాయణ. ఆయన ఐర్లండ్‌లో బార్‌ఎట్‌లా పాసయి, మార్క్సిజం ప్రభావంతో జయప్రదమైన రష్యా విప్లవాన్ని గూర్చి తన నవలలో అనేక విషయాలు పొందుపరిచాడు.

మాలపల్లి నవల్లో తండ్రీ కొడుకులు, సంగదాసు, వెంకట దాసుల మధ్య జరిగిన సంభాషణల్లో మార్క్స్ ప్రవచించిన వర్గ

పోరాట సిద్ధాంతం కన్పిస్తుంది. సామాజిక న్యాయం కొరకు ధర్మ కన్నాలను సమర్థించాడు. ధర్మకన్నాల ఉద్యమంలో భాగంగా తక్కెళ్ళ జగ్గని ధర్మ బోధల్లో, ఆది నుంచి నేటి దాకా జరిగిన మానవ సమాజ పరిణామం చెపుతూ ప్రాచీన యుగంలో వర్గ విభజన, వర్గ దోపిడీలు లేవని, ప్రజలు సమానంగా జీవించారని చెపుతాడు.

భాగ్యవంతుల దోపిడిని అరికట్టాలని, దాని కోసం శ్రామికులు ఐకమత్యంతో పోరాడాలని, 'Workers of the world unite' - 'ప్రపంచ కార్మికులారా ఏకం కండు' అనే కారల్‌మార్క్స్ నినాదానికనుగుణంగా "పనివారందరూ ఏకమైతిరా ప్రపంచమే మీది" అనడం గమనించదగ్గ విషయం.

దిగవల్లి వెంకటశివరావు గారు, 'సామ్యవాదము' అనే శీర్షికతో రాసిన వ్యాసంలో కారల్‌మార్క్స్ ప్రతిపాదించిన అదనపు విలువ సిద్ధాంతంతో సహా శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతాన్ని వివరించారు. దిగవల్లి ఏ కోణం నుండి చూసినా మార్క్సిస్టు సానుభూతిపరుడు గాదు. వీరేశలింగం మీద రెండు నిందాపూర్వక వ్యాసాలు రాశారు కూడా. వారిని కోట్ చేస్తాను – "కూలివానికిచ్చు కూలి డబ్బుల విలువ కన్న ఎక్కువ విలువ గల పనిని వాని చేత చేయించుట కొరకే యజమాని వానికి కూలి నిచ్చుచున్నాడు. కూలివాడు పుచ్చుకొను కూలి యొక్క విలువకును, వాడుత్పత్తి చేయు వస్తువు యొక్క విలువకును గల తారతమ్యపు విలువకు అర్థశాస్త్రజ్ఞులు 'మిగులు విలువ' (Surplus Value) లేక అదనపు విలువ అని పేరు పెట్టి యున్నారు. కాయకష్టములు చేయు వారిని సేవకులనుడు, కూలివాండ్రనుడు, పాలికాపులనుడు, బానిసలనుడు – మొత్తము మీద వారి చేత పని చేయించుటకు పురిగొల్పునది, యీ అదనపు విలువే".

దిగవల్లి శివరావు ఇంకా యిలా రాస్తున్నారు "నాగరిక జీవనమెల్ల పెట్టుబడిదారుల వశమైనది. ధనము గల తరగతులు కొన్ని అధికార పదవి నధిష్టించి సంపద యార్జించు మార్గములను, దాని నుత్పత్తి చేయు సాధనములును, మహాయంత్రములను, సంపదలను.. ద్రవ్యమును తమకు హక్కు గల వానిగా జేసికొనినారు. పోలీసు వాని లాఠీ, సైనికుని తుపాకి, మర ఫిరంగి, యుద్ధనౌక మున్నగు సాధనములెల్ల యీ తరగతి అధికారమును నిలబెట్టుచుండుట గానవచ్చుచున్నది. చట్టనిర్మాణ సభలను, పరిపాలక సంస్థలను, న్యాయస్థానములను గూడ యీ తరగతులే అంటే యీ వర్గాలే అంటే పెట్టుబడిదారీవర్గాలే వశపరచుకొన్నవి". మీరు, ఇప్పుడు నేను, ఉటంకించిన అంశాన్ని జాగ్రత్తగా గమనించినట్లయితే–

అదనపు విలువను (Surplus Value) గురించి, రాజ్యాంగ యంత్రాన్ని గురించి కారల్‌మార్క్స్, ఏంగెల్స్‌లు ప్రతిపాదించిన సూత్రీకరణలనే రచయిత పై వ్యాసాల్లో పొందుపరిచాడు. కారల్‌మార్క్స్ కమ్యూనిస్టు సిద్ధాంత మూలపురుషుడు. తన మిత్రుడు సహ రచయిత ఎంగెల్స్‌తో కలిసి, కమ్యూనిస్టు ప్రణాళిక (Communist Manifesto) రాశాక, దాని స్ఫూర్తితో ప్రపంచ చరిత్ర గమనమే మార్పుకు లోనైంది. 1845లో కారల్‌మార్క్స్ రాసిన 'ఫ్యూయర్‌బాక్ థీసిస్'లో ఇలా అన్నాడు. *"Philosophers have only interpreted the world in various ways, the point is to change it"* ఇది శిలాక్షరం లాంటి వాక్యం. మార్క్స్ రచనలు, జీవితం యావత్తూ యీ ఆశయం వైపే – ప్రపంచాన్ని మార్చే దిశలో నడిచింది.

భారతదేశంలో ఆంగ్లపాలన గూర్చి, 1853లో మార్క్స్ రాసిన వ్యాసం అతి ముఖ్యమైనది. భారతదేశ పునరుజ్జీవనానికి ఇంగ్లండ్ అనుకోకుండా (ఉద్దేశించకుండా) దోహదం చేసిందని ఇలా అన్నాడు. *"British rulers objectively, became the agents of a historical process in India - The process which was to change feudal India into the kind of industrialised capitalist state".*

చరిత్రను సమాజంలో శిష్టులు, సామాన్య ప్రజలు కలిసి సంయుక్తంగా నిర్మిస్తారు. మనం ముఖ్యంగా గుర్తుంచు కోవాల్సిన విషయం – భారత జాతీయ విముక్తిని గూర్చిన నిబద్ధతను, భారత జాతీయ కాంగ్రెస్ సంస్థ ఆవిర్భావానికి ఎంతో ముందు, కారల్‌మార్క్స్ చూపారనే వాస్తవం.

1853లో అమెరికన్ వార్తాపత్రిక న్యూయార్క్ ట్రిబ్యూన్‌కు రాసిన లేఖలో మార్క్స్ చేసిన ప్రకటన – ప్రవక్త ప్రవచనం లాంటి ప్రకటన. అది ముందుచూపుతో ప్రవక్త చేసిన బోధన లాగా వుంది.

*"The Indians will not reap the fruits of the new elements of society scattered among them by the British bourgeosie, till in Great Britain itself, the new ruling classes shall have been supplanted by the industrial proletariat, or till the Hindus (Indians) themselves shall have grown strong enough to throw off the English yoke altogether".*

1857 మహత్తర తిరుగుబాటును మార్క్స్, ఎంగెల్స్‌లు యిద్దరూ ఎంతో ఆసక్తితో గమనించి, పూర్తిగా బలపరిచారు. దాన్ని గూర్చి విస్తృతంగా రాశారు కూడ.

1885లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనకు ముందే అంతర్జాతీయ కార్మిక సంఘ కార్యకలాపాల్లో మార్క్స్ క్రియాశీలక, గణనీయ పాత్ర వహించాడు.

ఆ సంఘ సమావేశానికి కలకత్తా నుండి ఒక గుర్తు తెలియని వ్యక్తి (ఈ వ్యక్తి వివరాలు తెలియడం లేదు) అంతర్జాతీయ కార్మిక సంఘం (International Working men's Association) దృష్టికి భారతదేశంలో నెలకొన్న తీవ్ర అవినీతి, దానికి కారణమైన ఆంగ్లపాలన ("the wretched conditions of the workers") గూర్చి తెలియచేశారు. అతడి అభ్యర్థన మేరకు భారతదేశంలో ఒక శాఖ స్థాపించి, ప్రత్యేకించి "the wretched conditions of the workers in India" గూర్చి కలగచేసుకోవాలనీ, International స్థాపించే ఆ సంఘంలో దేశీయులను సభ్యులుగా చేసుకోవాలని తీర్మానం తీసుకోబడింది.

మరొక ఆసక్తికర విషయం : పరోక్షంగా లండన్‌లో వుండి, భారతదేశాన్ని గూర్చి అధ్యయనం చేస్తూ ఆంగ్లపాలనను, దాని ఆర్థిక దోపిడీని తేటతెల్లం చేస్తూ, భారతీయులను సమర్థిస్తున్న దాదాభాయి నౌరోజీతో కూడ మార్క్స్‌కు రచనల ద్వారా పరిచయాలు వుండేవనీ, వారిద్దరూ కలుసుకోక పోయినా, నౌరోజీ కారల్‌మార్క్స్‌లకు భావరీత్యా పరిచయం వున్నట్లు తెలుస్తుంది.

1881లో కారల్‌మార్క్స్ వెలిబుచ్చిన కొన్ని ప్రస్తావనలు, భారతదేశంలో ఇంగ్లండ్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్ల భారతీయ సమాజం తీవ్ర సమస్యల నెదుర్కొంటున్నదని, తీవ్ర దారిద్ర్యానికి గురవుతున్నదని నౌరోజీ పరిశీలన చేసి, నిగ్గు తేల్చిన అంశాలు కారల్‌మార్క్స్ వ్యాసంలో వుండడం గమనించవచ్చు. నౌరోజీ, ఆ తర్వాత తన ప్రఖ్యాత పరిశోధనా గ్రంథాన్ని Poverty and Un British Rule in India ప్రచురించి ఇంగ్లండ్ భారతదేశం నుండి తీసుకెళ్ళే అపార సంపద గూర్చి ఆ గ్రంథంలో లెఖ్ఖలతో సహా వివరించారు. ఇది ఆంగ్ల పాలనలోని ఆర్థిక దుష్ఫలితాలపై వెలువడ్డ ప్రముఖ ఆర్థిక గ్రంథంగా పేర్గాంచి, భారత జాతీయోద్యమానికి దోహదం చేసింది, ఆ తర్వాత నౌరోజి అఖిల భారత కాంగ్రెస్ సంస్థ వ్యవస్థాపనతో చేతులు కలిపి, అధ్యక్షులుగా రెండు సార్లు ఎన్నికయ్యారు.

మరొక ముఖ్యాంశం మీతో చెప్పుకోవాలి. 1904లో నౌరోజి అమ్‌స్టర్‌డామ్ ఇంటర్నేషనల్ కాంగ్రెస్‌లో పాల్గొని ఇంగ్లండ్ శ్రామిక వర్గానికి మద్దతు తెలిపారు. ఇక్కడే, మేడమ్ కామా దేశాంతరాలలో ఉన్న విప్లవ వీరులకు మద్దతుగా ఉంటూ, త్రివర్ణ పతాకాన్ని (red, white and green) ఇంటర్నేషనల్ కాంగ్రెస్ సమావేశంలో ఎగురవేసింది.

లెనిన్ అంతర్జాతీయ శ్రామికవర్గ ఉద్యమాన్ని కారల్‌మార్క్స్ ఊహించిన రీతిలో నిర్వహించాలని దీక్షతో కృషి చేశారు. ఈ సందర్భంలో భారతదేశాన్ని గూర్చి లెనిన్ చేసిన వ్యాఖ్యలు కీలకమైనవి. తిలక్ అరెస్టుకు నిరసనగా, బొంబాయిలో నిర్వహించిన సమ్మెను ప్రస్తావించి, తిలక్‌కు విధించిన ఆరు సంవత్సరాల కారాగార శిక్షను ఖండించారు. ఈ ఘటన ఐరోపా, ఆసియా దేశాల్లో వున్న కామ్రేడ్స్ మధ్య సంఘీభావాన్ని సూచిస్తున్నది. ఇప్పుడు ముగింపులో–

తెలుగు సాహిత్యంపై మార్క్సిజం ప్రభావం గూర్చి ఉన్న ఎన్నో ఉదాహరణల్లో ఒకటి, రెండు ప్రస్తావిస్తాను.

బాలాంతపు నళినీకాంతరావు...

ఆకలిమంటచే మలమలమాడే
అనాధలందరు లేవండోయ్

గరిమెళ్ళ...

అన్యాయకాలంబు దాపురించిదిప్పుడు
అందరము మేలుకొనాలండీ
మాన్యాలు భోగాలు మనుజులందరికబ్బ
మార్గాలు వెదకాలి రారండీ !
కూలి చాలక కుళ్ళడము మనవంత
గాలిమేడలలోను కమ్మతావులతోను
గర్వముగ భోగమింకొకరొంతు

దీనికి, 12 పునర్ముద్రణలు పొందిన ఆచార్య రంగా సంపాదకత్వం వహించిన రైతుభజనావళి ఒక మంచి ఉదాహరణ.

శ్రీశ్రీ గేయాల నిండా మార్క్సిజం ప్రభావం ఉంది.

ఇంతెందుకు – మార్క్సిజం ప్రభావం అని చెప్పను గానీ..

గురజాడ...

ఎల్లలోకము ఒక్కయిల్లై
వర్ణభేధము లెల్ల కల్లై
వేలనెరుగని ప్రేమబంధము
వేడుకలు కురియ
మతములన్నియు మాసిపోవును
జ్ఞానమొక్కటి నిలచి వెలుగును
అంత స్వర్గసుఖంబులన్నవి
అవని విలసిల్లున్.

☞ మిగతా 28వ పేజీలో



# కారా కథలు ఎందువల్ల నిలుస్తాయి?

**ఎన్ వేణుగోపాల్**

వాచ్యంగా చెప్పిన దానికన్న ఎక్కువగా సూచనలు అందించిన కారా కథల గురించి గత నలభై ఏళ్లలో చాలా చర్చ జరిగింది, ఇంకెంతో చర్చ జరగవలసే ఉంది, జరగవచ్చు కూడా. కాగా మరణం తర్వాత కారా గురించి, కారా కథల వర్తమాన అన్వయం గురించి జరుగుతున్న చర్చ మరిన్ని కొత్త అంశాలను ముందుకు తెస్తున్నది. కారా కథల ప్రాసంగికత గురించి కొత్త ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కారాను, ఆ మాటకొస్తే ఏ రచయితనైనా ఎలా అర్థం చేసుకోవాలనే మౌలిక అంశాలు చర్చకు వస్తున్నాయి. కారా కథల్లో చెప్పిన, చెప్పదలచుకున్న విషయాల ద్వారా ఈ చర్చలోకి వెళ్లడం ఆసక్తికరంగా ఉంటుంది.



మొదట ఒక రచన, లేదా ఒక రచయిత ప్రాసంగికత అంటే ఏమిటనే ప్రాథమిక ప్రశ్న దగ్గర ప్రారంభిద్దాం. ప్రాసంగికత అని తెలుగు సాహిత్య విమర్శలో, మరీ ముఖ్యంగా ఇటీవలి మేధా చర్చల్లో చాల తేలికగా వినియోగిస్తున్న మాట నిజానికి చాల లోతయినది. ఒక గత కాలపు భావానికి, రచనకు, దాన్ని వ్యక్తీకరించిన మనిషికి వర్తమాన అన్వయం ఎంత ఉంది అని దీని స్థూల అర్థం. ఒక సాహిత్య రచన అది పుట్టిన కాలం కన్న ఎక్కువ కాలం మనగలుగుతుందా, మనగలిగితే ఏ కారణాల వల్ల ఆ మనుగడ ఉంటుంది, సాహిత్యం స్థలకాల బద్ధమైనదా, లేక స్థలకాలావధులను అధిగమించే అవకాశం ఉందా అనే మౌలిక సమస్యల చర్చకు సంబంధించినది ప్రస్తుత చర్చ. రచయిత తన స్థలకాలాలను కూడా సరిగ్గా పట్టుకోగలిగారా లేదా అనేది కూడ ప్రాసంగికతకు ఒక కోణంగా ఉన్నది.

సాహిత్యాన్ని అనేక సామాజిక చైతన్య రూపాలలో ఒకానొకటిగా చూసినప్పుడు ఆ సాహిత్యం గాని, ఆ స్థల కాలాలలో ఆ సామాజిక చైతన్య రూపపు వాహికలుగా, సాధనాలుగా, ప్రేరకులుగా ఉండే సాహిత్యకారులు గాని ఆ ప్రత్యేక, నిర్దిష్ట సమాజాన్ని మాత్రమే చిత్రించగలరు, ఆ సమాజం మీద మాత్రమే ప్రభావం వేయగలరు. అలా సాహిత్యం స్థలకాల బద్ధమైనదే. సాహిత్యకారులు స్థలకాల బద్ధమైనవారే.

మరి వందల వేల ఏళ్ల కిందటి సాహిత్యం చదవడం, దాని ప్రభావానికి లోను కావడం, దానిలో చిత్రణ పొందిన భావాలు, పాత్రల మనస్తత్వాలు ఇవాళ్టికి కూడా ఎక్కడో ఒకచోట కనబడుతున్నాయని, ఆ సాహిత్యంలో ప్రతిపాదించిన విలువలకు ఇవాళ్టి సమాజంలో కూడా అన్వయశక్తి ఉన్నదని అనుకోవడం ఎందుకు జరుగుతున్నదో ఆలోచించాలి. ఈ దృగ్గోచారాంశం సాహిత్యపు లేదా భావాల స్థల కాలాతీత శక్తికి నిదర్శనమైనా కావచ్చు. లేక ఆ సాహిత్యంలో, ఆ భావాలలో చిత్రణ పొందిన సమాజం ఇవాళ్టికీ మౌలికంగా మారలేదనడానికి చిహ్నమూ కావచ్చు. మారిందని అనుకుంటున్న కాలం నిజంగా మారి ఉండకపోవచ్చు. సమకాలిక సమాజాన్ని చిత్రించిన సాహిత్యానికి ఆ స్థలం, కాలం మారిన తర్వాత కొత్త సమాజం మీద ప్రభావం ఉంటుందా, ఉంటే ఎలా ఉంటుంది, సాహిత్య ప్రయోజనం, ప్రభావం సమకాలీనం మాత్రమేనా, ఆ కాలం గడిచిన తర్వాత కూడా ఉంటాయా అనే ప్రశ్నలు మిగిలే ఉంటాయి.

ఒక రచయితనో, రచనలనో తర్వాతి కాలంలో కూడా గుర్తుంచుకోవడానికి, తలచుకోవడానికి, మళ్ళీ మళ్ళీ మననం చేసుకోవడానికి, అరె ప్రస్తుత సందర్భానికి కూడా పనికొస్తాయే అని ఆశ్చర్యపోవడానికి, ఇది సార్వకాలికం అని భ్రమపడడానికి అవకాశం ఇప్పటికీ ఉన్నట్టే కనిపిస్తున్నది. అలా కనిపించడానికి కారణం ఏమిటో ఆలోచించవలసే ఉంది. రచనకు కూడా ఒక పుట్టుక, ఒక జీవితం ఉన్నట్టుగానే ఒక మరణం కూడా ఉంటుందని అంత సులభంగా సరళ సమీకరణం వేసినట్టు చెప్పగల స్థితి లేదు. ఇతర భాషా సాహిత్యాల చరిత్రలోనూ, మన సాహిత్య చరిత్రలోనూ కూడా దశాబ్దాలూ శతాబ్దాలూ మరుగున పడిన రచనలు, రచయితలు, మళ్లీ ఒక కాలంలో

ప్రాచుర్యంలోకి రావడం, వారి ప్రాసంగికత స్పష్టం కావడం మన కళ్లముందరి ఉదాహరణలెన్నో ఉన్నాయి. ఒక నిర్దిష్టమైన మనిషికి మరణం ఉంటుంది గాని మనిషికి మరణం లేదు అనే తాత్విక సత్యం లాగా ఒక రచయితకు మరణం ఉంటుంది గాని రచనకు మరణం లేదు అనే అవకాశం ఉందేమో. రచన మొత్తంగా సజీవంగా, ప్రాసంగికంగా ఉండకపోయినా, ఆ రచనలోని భావాలు, విలువలు, దృక్పథం మళ్లీ మళ్లీ పునర్జీవనం పొందు తుండవచ్చు. వర్తమానం చాలా సార్లు గతంతో సంభాషించాలని కోరుకుంటుండవచ్చు.

ఇటువంటి అనేక ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు అన్వేషించవలసిన సందర్భం ఇది. ఆ ఓపిక లేని కొందరు తమకు నచ్చిందే సాహిత్యమనీ, పుట్టుక వల్లనో, ప్రాంతం వల్లనో, భాష వల్లనో, కాలం వల్లనో కొందరు రచయితలను తాము కొట్టివేశామనీ, చదవదలచుకోలేదనీ, చదివినా చదవకపోయినా నచ్చలేదని అనాలని నిశ్చయించుకున్నామనీ, అందువల్ల ఆ రచయితలకు, రచనలను కాలం చెల్లిపోయిందని శాసనం చేస్తున్నామనీ అనడానికి పూనుకుంటున్నారు. లేదా ఆ సవాళ్లకు జవాబు ఇవ్వాలనే తొందరలో మరి కొందరు మరొక కొసకు వెళ్లి తమకు నచ్చిన రచనలు సార్వకాలికమైనవని అనవసర నిర్ధారణలు చేస్తున్నారు.

సాహిత్యం సమాజ ప్రవాహపు అల. ప్రవాహ స్వభావం మారితే తప్పనిసరిగా పాత అలలు రద్దయిపోతాయి. ఒక సాహిత్యం ప్రాసంగికం కాదని చర్చించడానికైనా, ప్రాసంగికంగా ఉందని చర్చించడానికైనా భూమిక సమాజం కావాలి. మన ఇష్టాయిష్టాలు, అభిరుచులు, అపోహలు, ఈర్ష్యఅసూయలు, అకారణ, సకారణ ద్వేషాలు కారణం కాగూడదు. తన సమకాలీన సమాజ స్వభావాన్ని, సమాజ గమనాన్ని ఆ ప్రత్యేక రచన సక్రమంగా చిత్రించిందా లేదా, ఆ సమాజ స్వభావం, గమనం మారాయా అనే చర్చ జరగాలి. సమాజ స్వభావం మారి ఉంటే ఆ రచన దానికదే కాలం చెల్లిపోతుంది. మారకపోయి ఉంటే ఎవరు ఎంత అభ్యంతర పెట్టినా ఆ రచనను ప్రాసంగికంగా భావించే వాళ్లుంటారు.

ఒక గతకాలపు భావానికీ, రచనకూ వర్తమానంలో ప్రాసంగికత ఉండడం అనేది అనేక విధాలుగా జరుగుతుంది. ఈ ప్రాసంగికత ఆ భావాల, రచనల వస్తువులోనూ ఉంటుంది, రూపంలోనూ ఉంటుంది. వస్తుగతమైన ప్రాసంగికత కనీసం నాలుగు కారణాల వల్ల ఉండవచ్చు: ఒకటి, కాలం మారినప్పటికీ గతకాలపు భావజాల భారమే సమాజం మీద కొనసాగుతున్నప్పుడు గతకాలపు భావాలు, రచనలు ప్రాసంగికంగా కనబడతాయి. రెండు, గతం నుంచి వర్తమానానికి పరిణామం కేవలం కాలసూచిగా మాత్రమే ఉండి సామాజిక విలువల్లో మౌలికమైన మార్పు లేనప్పుడు గత కాలపు రచనలు ప్రాసంగికంగా కనబడతాయి. మూడు, గతకాలపు యథాస్థితి నుంచి మౌలికమైన విచ్ఛిత్తి (రాడికల్ రప్చర్ అన్నాడు మార్క్స్) జరగకుండా, పైపై మార్పులు, అతుకులు, మాట్లు, పైపై పూతలు మాత్రమే జరిగినప్పుడు గత కాలపు రచనలు ప్రాసంగికంగా కనబడతాయి. నాలుగు, మొత్తం రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక జీవనంలో సారం మారకుండా రూపం మాత్రమే మారినప్పుడు గత కాలపు రచనలు ప్రాసంగికంగా కనబడతాయి. ఇది రాజకీయార్థిక, సామాజిక పునాదికి సంబంధించిన విషయం గనుక ఈ వస్తుగత ప్రాసంగికత మౌలికమైనది.

ఇక ఒక భావంలో, ఒక రచనలో ఉండే నవ్యత, అద్భుతత్వం, ప్రయోగశీలత, ఆకర్షణ కూడా తర్వాతి కాలాల్లో వాటిని ప్రాసంగికంగా ఉంచుతాయి. ఈ రూపంలో, శిల్పంలో ప్రాసంగికత కనీసం మూడు రకాలుగా ఉండే అవకాశం ఉంది. ఒకటి, ఆ రచనలో పాత్రచిత్రణ, సన్నివేశ కల్పన, సంభాషణలు విశ్వసనీయంగా, పునరుక్తి సంభావ్యతతో ఉన్నప్పుడు ఆ గతకాలపు రచనలోని పాత్రలే వర్తమానంలో మళ్లీ మళ్లీ ఎదురుపడుతూ ఆ రచనకు ప్రాసంగికతను కల్పిస్తాయి. రెండు, మౌఖిక, సంభాషణా వ్యవహారంలో తరతరాల సంచితపు సామెతలూ, నుడికారాలూ అనేకం ప్రాసంగికంగా ఉండడం మనందరి అనుభవంలో ఉన్నదే. వందల ఏళ్ల కింద పుట్టిన నుడికారం, సామెత ఇవాళ్టి మన నిత్య జీవిత వ్యవహారానికి పనికి వస్తుంది, ప్రాసంగికంగా ఉంటుంది. ఈ సామెతలు, నుడికారాలు లిఖిత రచనలోకి వచ్చినప్పుడు చాల సహజంగా ఆ తరతరాల జీవన సారాంశపు సత్యాల శక్తి తర్వాతి తరాల పాఠకులకు కూడ అంది, ఆ రచన తమ కాలంలో కూడా ప్రాసంగికమే అనిపిస్తుంది. మూడు, ముఖ్యంగా లిఖిత రచనల విషయంలోకి వస్తే, ఆ రచనా నైపుణ్యం, అందులోని శిల్ప విశిష్టత, వస్తువును సంభావించిన సంవిధానం తర్వాతి తరాల రచయితలకు ఆదర్శాలుగా, పాఠ్యాంశాలుగా, అనుసరణీయాంశాలుగా మారి సాహిత్య వారసత్వం అవుతాయి. ఆ వారసత్వ లక్షణం వల్ల ఆ ప్రత్యేల రచన ప్రాసంగికంగా కనబడుతుంది.

పైన చెప్పిన వస్తుపరమైన ప్రాసంగికత ఇచ్చే అంశాలూ, రూపపరమైన ప్రాసంగికత ఇచ్చే అంశాలూ అన్నీ కాళీపట్నం రచనల్లో ఉండడం ఒక ప్రత్యేకత. సమాజంలో ఏ గత భావజాల

భారం మీద ఆయన తన కథల్లో విమర్శ ఎక్కుపెట్టారో ఆ భారం బహుశా సమాజంలో పెరుగుతున్నవేళ ఆయన కథలకు ప్రాసంగికత ఉంటుంది. ఆయన రాసిన 1950-70ల నుంచి సమాజం 2020ల్లోకి వచ్చిందని కాలసూచిగా చెప్పుకోవలసిందే తప్ప ఆయన చిత్రించిన, విశ్లేషించిన వస్తువుల్లో అత్యధిక భాగం ఇంకా మారలేదు గనుక ఆయన కథలకు ప్రాసంగికత ఉంటుంది. మన సమాజ గమనంలో, సామాజిక విలువల్లో మౌలిక విచ్ఛిత్తి జరగలేదని, చిలవలు పలవల కొనసాగింపు మాత్రమే జరుగుతున్నదని అర్థం చేసుకున్నప్పుడు ఆయన కథల ప్రాసంగికత అర్థమవుతుంది. మన సమాజపు దోపిడీ పీడనల సారం మారలేదనీ, రూపాలు మాత్రమే మారాయనీ చూసినప్పుడు ప్రధానంగా సారం గురించి రాసిన కారా కథలకు ప్రాసంగికత ఇంకా ఉన్నదని అర్థమవుతుంది.

అలాగే పైన చెప్పిన రూపపరమైన అవిచ్ఛిన్నతాంశాలు కూడా కారా కథలకు వర్తమాన అన్వయానికి అవకాశం ఇస్తున్నాయి.

ఒక రచనను, భావాన్ని తర్వాతి తరాల్లో కూడా ప్రాసంగికంగా మార్చే పైన చెప్పిన లక్షణాలు మాత్రమే కాక, కారా కథల్లో కొన్ని ప్రత్యేకమైన అదనపు అంశాలు కూడా వాటికి ప్రాసంగికతను ఇస్తున్నాయి. 1950ల్లో పత్రికల్లో అచ్చయిన నాటి నుంచి, 1960ల నుంచి సంపుటాలలో వెలువడిన నాటి నుంచి కారా కథలు విడివిడిగానూ, సంపుటాలుగానూ గత అరవై సంవత్సరాల్లో ఇరవై సార్లయినా పాఠకులకు అంది ఉంటాయి. ఇదేదో ప్రచురణకర్తలు అచ్చువేసి సమాజంలోకి తోయగా మాత్రమే జరిగిన పని కాదు, గత అరవై సంవత్సరాలలో కనీసం మూడు తరాల కొత్త పాఠకులు చూపిన ఆదరణ ఫలితం అది. కారా కథల ప్రాసంగికతకు అది ఒక నిదర్శనం.

ఆయన కథల మధ్య ఇతర విమర్శకులు చేసిన రెండు మూడు దశల విభజనను అంగీకరిస్తూనే, అన్ని కథల్లోనూ మానవసంబంధాల జీవధార అవిచ్ఛిన్నంగా ప్రవహించడం కనబడుతుందని నేను 1986లో ఒక వ్యాసంలో రాశాను. ఆ విశ్లేషణను ఇంకా విస్తరించవలసి ఉంది. ఆయన కథారచన మూడు దశాబ్దాల్లోనూ మానవ సంబంధాల చిత్రణ మాత్రమే కాదు, మానవసంబంధాల ప్రజాస్వామికీకరణ అన్వేషణ ఉన్నది. ఈ అన్వేషణ మన సమాజంలో 1950ల నుంచి 1970ల దాకా నడిచిన కాలానికి సంబంధించినది మాత్రమే కాదు. ఆ పెనుగులాట అంతకు ముందు వందలాది ఏళ్లుగా సాగుతున్నది, ఈ యాభై ఏళ్లుగా కూడా కొనసాగుతున్నది. మన సమాజ మౌలిక స్వభావం మారేవరకూ ఈ ప్రజాస్వామికీకరణ ప్రయత్నాలు సాగుతుంటాయి. ఆ మానవ సంబంధాల ప్రజాస్వామికీకరణ అన్వేషణ కారా కథల్లో కుటుంబం, గ్రామం, కులం, వర్గం, స్త్రీ పురుష సంబంధాలు, వయోభేదాలు, రాజ్యానికీ ప్రజలకూ మధ్య ఘర్షణ వంటి వేరు రూపాల్లో, వేరు వేరు స్థాయిల్లో వ్యక్తీకరణ పొందవచ్చు, వేరు వేరు పాత్రల స్వరాల్లో పలకవచ్చు, వేరు వేరు సన్నివేశాల్లో దృశ్యమానం కావచ్చు. కాని మౌలికమైనది ఆ ప్రజాస్వామిక అన్వేషణ. ఇవాళ్టికీ కొనసాగుతున్న, ఇవాళ్టికీ పరిష్కారం కాని ఆ అన్వేషణే ఆయన రచనలకు ప్రాసంగికతను సంతరింపజేస్తున్నది.

ఈ మానవ సంబంధాల ప్రజాస్వామికీకరణ అన్వేషణ కారాను సహజంగా, అనివార్యంగా వర్గపోరాటం దగ్గరికి చేర్చింది. ఆయన కథలన్నీ వర్గపోరాటానికి వేరు వేరు వ్యక్తీకరణల చిత్రణలే. అయితే రచయితగా ఆయన విశిష్టత ఏమంటే ఆయన వర్గ పోరాటాన్ని సమాజవ్యాప్తంగా వేరువేరు తలాల్లో జరిగే నిరంతర ప్రయత్నంగా విశాలంగా, లోతుగా, సృజనాత్మకంగా అర్థం చేసుకున్నారు. వర్గపోరాటపు సుదూర, సూక్ష్మ ప్రకంపనలను కూడా ఆయన పట్టుకున్నారు. వర్గపోరాటాన్ని, దాని వ్యక్తీకరణలను నేరుగా, సూటిగా, మొరటుగా చిత్రించడం కాల్పనిక సాహిత్యం పని కాదనీ, అది విశ్వసనీయం కావాలంటే, పాఠకుల ఆలోచనల మీద ప్రభావం వేయాలంటే దాని చిత్రణ విభిన్నంగా, విశిష్టంగా, అపురూపంగా ఉండక తప్పదని ఆయన గుర్తించారు. అందువల్లనే ఆయన ఈ వర్గపోరాట నిత్యజీవిత ప్రతిఫలనాలను మానవ సంబంధాల ద్వారా, సామాజిక చరిత్ర ద్వారా, సాధారణ జీవన సంఘటనల ద్వారా, జీవన పరిణామాల ద్వారా చిత్రించాలని పూనుకున్నారు. అందుకే కారా కథలు చదువుతున్నప్పుడు పైపొరలో ఎవరికైనా కనబడేవి మానవ సంబంధాలు, సామాజిక చరిత్ర, సాధారణ జీవన సంఘటనలు, సాధారణ జీవన పరిణామాలు. అక్కడి నుంచి కింది పొరల్లోకి వెళ్తున్నకొద్దీ వర్గపోరాట అనివార్యత, పీడితవర్గ పక్షపాతం, వ్యవస్థ పరివర్తన ఆవశ్యకత కనబడతాయి. వర్గపోరాటాన్ని అంగీకరించని వాళ్లయినా, గుర్తించని వాళ్లయినా, దాని పట్ల అపోహలు ఉన్న వాళ్లయినా కారా కథలు చదివి ఆకర్షితులయ్యేది వారికి ఈ నాలుగు అంశాల్లో ఏ ఒక్కదాని మీదనైనా ఉండే ఆసక్తి, అభిరుచి వల్లనే. ఆ కథల్లోని నిర్మాణం వల్ల, పొరలు పొరలుగా సూచించిన అనేక అంశాలు మళ్లీ మళ్లీ గుర్తుకొస్తాయి. అంతిమంగా అవి పాఠకుల ఆలోచనా సరళిని ఉన్నతీకరిస్తాయి. పాఠకుల అవగాహనాల ఉన్నతీకరణే కారా రచనలను ప్రాసంగికంగా ఉంచుతుంది. ❑

*(వసంతమేఘం సౌజన్యంతో..)*

# అగ్నిహోత్రుడు అదృష్టదీపక్

కొప్పర్తి వెంకట రమణమూర్తి

'మీ కవిత్వం కన్న మీ అక్షరాలు బావున్నాయ్' నా కవిత్వం చదవమని ఇచ్చినపుడు నలభై మూడేళ్ల క్రితం అదృష్టదీపక్ నాతో అన్న మాటలు. నన్ను ఉద్దేశించి నాతో ఆయన అన్న తొలిమాటలు కూడా అవే. తనంత బాగా కాకపోయినా నేను కూడా అక్షరాలు అందంగానే రాయగల్గడం మమ్మల్ని కలిపిన మొదటి అంశం. దీపక్ అక్షరాలు అచ్చులో మాదిరి గుండ్రంగా ఉండేవి. నావి కొంచెం బాపు కోవలోనివి. దీపక్ అక్షరం రాస్తున్నప్పటికన్నా రాసే క్రమంలో ఆయన కలం ఎక్కువ సున్నాలు చుట్టేది. మొత్తం మీద నాలుగు అక్షరాలు రాసేటప్పటికి గాలిలో అనేక వలయాలు సృష్టించేవాడు. దీపక్ లోని 'దీ' అక్షరం రాస్తే దీపంలా ఉండేది. రాసిన ప్రతి సారీ దాన్ని చిత్రలిపిని చేసేవాడు. అనేకానేక కారణాలతో పాటు అందమైన అక్షరాల్లో కూడా చూసుకోవచ్చుననుకుని కవిత్వం రాసిన ఆ రోజుల్లో దాన్ని అనుకరించకుండా ఉండడం నాకు కష్టమే అయ్యింది.



మా ఇద్దరి మధ్య తొమ్మిదేళ్ల ఎడం ఉన్నా రామచంద్రపురం చరిత్ర పీజీ సెంటర్ లో ఆయన నాకన్నా రెండేళ్లే సీనియర్. గ్రాడ్యుయేషన్ తర్వాత ఆగిపోయిన ఆయన చదువు ఆరేడేళ్ల విరామం తర్వాత మళ్లీ మొదలైంది. ఆయన కోర్సు ముగించుకుని బయటకొచ్చాక నేను సెంటర్‌లో ప్రవేశించాను. వాళ్లది రామచంద్రపురానికి ఆరేడు కిమీ దూరంలో ఉండే సోమేశ్వరం. ప్రొద్దుటే సైకిల్ వేసుకుని వచ్చేస్తే సాయంత్రమే తిరిగి వెళ్లడం. మిత్రుడు గుర్రాజు హోటల్లో మధ్యాహ్న భోజనం. మిగిలిందంతా స్వైర విహారం. చదుకుందామని అడుగుపెట్టిన మమ్మల్ని అక్కడి మనుషులు సరే, పుట్ట గుట్ట, మాను మాకు కూడా 'నీకు దీపక్ తెలుసా?' అని అడుగుతున్నట్టుండేవి. తెలిస్తే నువ్వొక connoisseur.

దీపక్ నాకు చేసిన గొప్ప ఉపకారం రారా విమర్శ ను పరిచయం చెయ్యడం. అవి రారా 'సారస్వత వివేచన' వచ్చిన కొత్త రోజులు. దీపక్ 'ప్రాణం' కవితా సంపుటికి ఆయన ముందు మాట రాసిన కొత్త రోజులు కూడా. రారా సంవేదన వ్యాసాలను దీపక్ తరచూ ప్రస్తావించేవాడు. ముఖ్యంగా చలం, శ్రీశ్రీ, దిగంబర కవుల మీద వ్యాసాలు. కవిత్వం హృదయ సంబంధి అనీ, మేధ, హృదయాల సమకలయిక నుంచే గొప్ప సాహిత్యం పుడుతుందని నాకు అప్పుడే అర్థమైంది. దీపక్ గుర్తొచ్చినపుడల్లా రాంభట్లనూ, గజ్జెల మల్లారెడ్డినీ ఉటంకించే వాడు. రాంభట్ల 'అంగార గంగ'ను వల్లిస్తూ ఊగిపోయేవాడు. తను 'పదపదవే గీతమా పదవే నా ప్రాణమా' అని పాడకపోతే మాకు మఖ్దూం మొహిద్దీన్ పరిచయమయ్యే వాడు కాదు. ఆ గీతం పట్టుకుని 'మఖ్దూం కవిత'ను గంగాధర్ గారి దగ్గర దొరికించుకుని అందులో రాజబహదూర్ గౌడ్ రాసిన దాదాపు ముప్పై పేజీల ముందు మాటను చదివినప్పుడు కదా తెలంగాణా సాయుధ పోరాటం, రజాకార్ల విధ్వంసం, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కవులు చేసిన స్వేచ్ఛాగానం గురించి తలుపులు తెరుచుకున్నదీ!? అప్పుడు కదా ఉద్యమకారుడూ, ట్రేడ్ యూనియనిస్టూ, కమ్యూనిస్టూ అయినవాడు కూడా ప్రేమ కవిత్వం రాస్తాడు అని మఖ్దూం గురించి ఆశ్చర్యపోయిందీ ? రాజబహదూర్ ముందు మాటలోనే కదా కె.ఎ.అబ్బాస్ ఆయన్ని 'జలప్రభా దీప్తి జ్వాల – హిమశీతల తుహినమాల' అనడం చదువుకుని ఆ తర్వాత అది తిలక్‌కి సరిగ్గా సరిపోవడం చూసి అందరికీ చెప్పీ చెప్పీ అరగదీసిందీ!! అప్పుడే కదా మార్క్సిస్టు సాహిత్య విమర్శ మీద తెలుగులో వచ్చిన పుస్తకాల్లో సారస్వత వివేచన కాక కుటుంబరావు గారి 'సాహిత్య ప్రయోజనం' సొదుం రామ్మోహన్ 'సాహిత్యావలోకనం' ముఖ్యమైనవని తెలుసుకుని, ఇంకోటేదో కూడా ఉందట కదా అనుకుని అదేదో తెలీక చివరికి తర్వాతెప్పుడో అది ఆర్వీయార్ గారి 'సాహిత్య తత్వం' అని గుర్తించిందీ !

ఎంత మందికి తెలుసో తెలీదు కానీ దీపక్‌కు కొత్త కరెన్సీ నోట్లు ఇష్టం. పది కొత్త రూపాయి నోట్లకు పదకొండు రూపాయలు ఇవ్వడానికి సిద్ధపడేవాడు. వాటి నుంచి ఇరవై రూపాయల ఆనందం పొందుతున్నపుడు దానివల్ల ఆయనకు నష్టమేముందీ!?

కవిత్వానికి రారా హృదయమూ, మేధ అనే రెండు డైమన్షన్స్ ఇస్తే అది అందంగా అచ్చు కావాలనే మూడవ డైమన్షన్ ఇచ్చే వాడు దీపక్. తన కవిత అందంగా అచ్చయ్యి వచ్చిన రోజు సంతోషం ద్విగుణంగానూ, రాని రోజు కోపం బహుళంగానూ ఉండేది. వివిధ కవుల కవితలున్న సంకలనంలో చివరి కవితగా అచ్చు కావడం గొప్ప గౌరవం అని తూగో జిల్లా అరసం శాఖ వేసిన 'చేతన' కవితాసంకలనం లో తన కవిత ఆఖరున ఉండడం చూపించి చెప్పక పోతే మాకు అంత తొందరగా తెలిసేది కాదు.

దీపక్ 1970 ల నాటి అభ్యుదయ కవిత్వ ప్రతినిధి. ప్రాణం (1978) కవిత్వ సంకలనం వచ్చేనాటికి 'అక్షరాలీవేళ అగ్ని విరజిమ్మాలి – కవిత శితఖడ్గమై కదన మొనరించాలి' వంటి గేయాలతో ప్రసిద్ధుడు. అభ్యుదయ రచయితల సంఘంలోని కవుల్లో కవితాత్మ తెలిసిన కవుల్లో ఒకనిగా ఆయనకు పేరుండేది. తనని తాను నిష్పాక్షికంగా అంచనా వేసుకునేటప్పుడు తాను కూడా ఈ అభిప్రాయానికి రావడం నేను గమనించాను. సామ్యవాదం పట్ల, సామ్యవాద సాధనలో కవి నిర్వర్తించవలసిన పాత్ర పట్ల 1970ల ప్రారంభంలో ఏ అభిప్రాయాలు కలిగి మరణించే వరకు వాటినే అంటిపెట్టుకుని ఉన్నాడో కవిత్వ వ్యక్తీకరణలోనూ 1970ల నాటి సంవిధానాన్నే చివరిదాకా అనుసరించాడు. దీపక్ కవిత్వం స్థూల కవిత్వం. మొత్తం సందర్భాన్ని విహంగ దృష్టితో చూస్తాడు. పరిష్కారం కూడా సామూహికంగానే ఉంటుంది. 'ప్రాణం' తర్వాత సరిగ్గా ముప్పై ఏళ్లకు తెచ్చిన 'అడవి' (2008) లో

*'వెలవెల బోతున్న శిథిల సౌధాన్ని*
*వెలుతురుతో కడిగి శుభ్రం చేస్తున్నాను ....*
*భయంతో అణగారిన స్వరంలో*
*భాస్వరం వెలిగిస్తున్నాను'* అన్నాడు.

*'ఇది కలలు కాలిపోతున్న వేళ*
*తీతువుల వికృత స్వరమేళ'* అని మరో చోట అన్నాడు.

జెండాలోని మూడు రంగుల గురించి

*'కాషాయం కసాయితనం ప్రదర్శిస్తోంది*
*పలాయనం పఠించిన శాంతిని చూసి*
*తెలుపు తెల్లబోతోంది*
*రత్నగర్భలో ఆకలిచావుల దౌర్భాగ్యాన్ని*
*ఆకుపచ్చ వెక్కిరిస్తోంది'* అని రాశాడు.

ఇది దీపక్‌లో ఒకసారి నాటుకుపోయిన భావాలైనా వ్యక్తీకరణ అయినా చెదరకుండా నిలుస్తాయని చెప్పడానికి ఉదాహరణ. అభ్యుదయ దృక్పథంలో కించిత్ అపసవ్యాన్ని కూడా భరించలేని దీపక్, వ్యక్తీకరణలో కూడా మార్పును కోరుకోలేదు. అందుకోసం ప్రయత్నించనూ లేదు. దీపక్ విమర్శలోనూ వామపక్ష భావజాల జార్గాన్‌ను విడవలేదు. పఠాభిని గూర్చి 2019లో రాసినపుడు కూడా అయన శైలి 'సంప్రదాయ వాదుల పీఠాల క్రింద పఠాభి మందుపాతరలు పేల్చాడు. ..హేళనను దట్టించి భావకవిత్వం మీద శతఘ్నులు పేల్చాడు. ఆయన చెళ్లుమని కొట్టిన కొరడా దెబ్బలు ..' అంటూ సాగింది. అయితే అప్పటికే తెలుగు కవిత్వ వ్యక్తీకరణ, విమర్శ దీపక్‌ను దాటుకుని చాలా దూరం పోయాయి.

ఆదిప్రాస అంటే దీపక్‌కు ఇష్టం. పైన ఉటంకించిన పాదాల్లో దాన్ని స్పష్టంగా గమనించవచ్చు. రెండు వరుస పాదాల్లో మొదటి అక్షరంగా ఒకే అక్షరాన్ని ఎంతో అందంగా అర్థవంతంగా వేస్తాడు. సినిమా పాటకు ఉండాల్సిన ముఖ్య లక్షణాల్లో ఇది ఒకటి. దీపక్ సినిమా పాటల విజయరహస్యాల్లో ఇది ఉంది. అందుకే తన తొలి పాటలోనే 'ఎదలు రెండు కలిశాయి – ఏటికెదురు నిలిచాయి' అనేసి సరైన దారి వేసుకున్నాడు. అందరికీ తెలిసిన 'మేడే' గీతం, 'మానవత్వం పరిమళించే' పాటలతో పాటు దీపక్ మరో రెండు మంచి గీతాలు 'దేశంలో దొంగలు పడ్డారు' చిత్రం కోసం రాశాడు. రెండూ జానపదశైలీ గీతాలే. ఒకటి రాయలసీమలో ప్రాచుర్యంలో ఉన్న 'రాజా మానందిరెడ్డి' అనే గీతం వరుసలో

*'నోట అచ్చరమొక్కటైనా*
*నోచుకోని జనంలోన*
*ఓనమాలు దిద్దుతుంటేరో*
*నా కొడకో బంగారుతండ్రీ*
*నువ్ గవినేరు వనుకుంటిరో'* అనేది.

అయితే ఈ రెండోదానికి మూలమేదీ లేదనుకుంటాను.

అది:


*'మూడామడలూ దాటి*
*మువ్వల బండిలో*
*ముద్దుగా తెచ్చాను*
*మురిపాలు చేశాను*
*చిలకా పంచవన్నెల రామ చిలకా*
*ముంచేసి పోయావే మొలకా మొలకా'*

'మ' కారపు ఆది ప్రాస ఎంతబాగా వేశాడో ఈ పాటలో.

ఆదివారం ఇంట్లో మాకు దీపక్ 'పదశోధన' వారం. చాలా మంది ప్రహేళికలు నిర్వహించేవాళ్లు పాఠకులకు తెలియని ప్రశ్నలడగడం గొప్పనుకుంటారు. ప్రహేళిక విజయ రహస్యం శోధకుడు (పాఠకుడు) తనకు తెలియదనుకున్న సమాధానాన్ని తనకే తెలిసేటట్లు చెయ్యడంలో ఉంది. అంటే శోధకుడి

☞ మిగతా 30వ పేజీలో

# కొత్త దారుల వెతుకులాట



**యోగేంద్ర యాదవ్**
స్వరాజ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు

ప్రస్తుత బాధాకర రాజకీయ పరిస్థితుల నుంచి బయట పడేందుకు 'నెహ్రూవియన్' పద్ధతులకు వెళ్ళడం సాధ్యమూ కాదు, వాంఛనీయమూ కాదు. ఆత్మ విశ్వాసపూరిత జాతీయవాదం, ధార్మిక విలువలతో కూడిన లౌకికవాదం, మార్కెట్ సోషలిజం, సామాజిక న్యాయం, పర్యావరణ పరిరక్షణ, భారతీయ ఆధునికత కోసం అన్వేషణ, ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యవాదం పట్ల నిబద్ధతతో కూడిన కొత్త సమతుల్య భావజాలాన్ని మనం అభివృద్ధిపరచుకోవాలి.

వర్తమాన భారతదేశానికి ఒక భావజాల సమతౌల్యత అవసరం. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే అత్యంత నిరాశామయ కాలంలో మనం ఉన్నాం. భవిష్యత్తు మీద పరిపూర్ణ విశ్వాసాన్ని కలిగించే ఒక కొత్త మధ్యే మార్గ భావజాలాన్ని ఆవిష్కరించు కోవలసి ఉంది. మన రాజ్యాంగ విలువల పట్ల ప్రజల మనః స్థితి సంపూర్ణ సానుకూలతతో ఉండేలా ఒక భావజాల ఏకాభిప్రాయాన్ని సృష్టించవలసిన అవసరముంది. ఈ కర్తవ్య నిర్వహణ అంత సులువు కాదు, ఉత్తేజపూరితమూ కాదు. చికాకుపరిచే కార్యమది. అయితే మన ప్రజాస్వామ్యం, లేదా మన గణతంత్ర రాజ్య భవిష్యత్తు అతి, మితవాదాలకు భిన్నమైన ప్రాతిపదికలతో కూడిన భావజాలాన్ని రూపొందించుకుని అనుసరించడంపై ఆధారపడి ఉంది. అత్యవసరంగా పరిష్కరించుకోవల్సిన ప్రస్తుత మేధా, రాజకీయ సమస్యల్లో ఇది ఒకటి.




స్వాతంత్ర్యానంతరం తొలి ఐదు దశాబ్దాల పాటు ఉదారవాద ప్రజాస్వామ్యమే మన భావజాలంగా ఉంది. జాతీయవాదం, సామ్యవాదం, లౌకికవాదం, సామాజిక న్యాయం, ఆధునికతతో సమ్మిళితమైన ఈ ఉదారవాద ప్రజాస్వామ్యం మన భావజాల సమతౌల్యతను నిర్వచించేది. కాలం గడుస్తున్న కొద్దీ ఇది బలహీనపడి క్షీణించిపోయింది. ఉదారవాద ప్రజాస్వామ్యం చౌకబారు జనరంజక రాజకీయాలకు దారితీసింది. జాతీయవాదం శుష్కనినాదంగా మిగిలిపోయింది. సామ్యవాదం లాభాల ప్రైవేటీకరణ, సమస్యల సామాజికీకరణగా పరిణమించింది. లౌకికవాదం రాజకీయ అవకాశవాదమై పోయింది. సామాజిక న్యాయం కులఆధారిత రిజర్వేషన్లకే పరిమితమయింది. ఆధునికత సాంస్కృతిక బానిసత్వానికి ఒక ముసుగు అయింది. మరి ఇటువంటి భావజాలం పట్ల ప్రజలు విముఖులు కావడంలో ఆశ్చర్యమేముంది?

పాతిక సంవత్సరాలుగా ప్రజలు మృదు నిరంకుశాధికార తత్వం, కలహశీల, సంకుచిత జాతీయవాదం, మార్కెట్ ఆరాధన, అధిక సంఖ్యాకవాద ధోరణులు, కుల దురభిమానాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ భావజాల వైఖరులు మన రాజ్యాంగ విలువలకు పూర్తిగా విరుద్ధమైనవి. సామాజిక అంతరాలు, ఆర్థిక అసమానతలు పెచ్చరిల్లిపోయేందుకు దోహదం చేస్తున్న ఈ విషపూరిత భావజాలం గురించి ప్రతి భారతీయుడూ కలవరపడి తీరాలి. సమాజంలో ఎటువంటి సుస్థిరతకు దోహదం చేయని ఈ భావజాలం మన గణతంత్ర రాజ్య నిర్మాతల స్వప్నాలు, ఆశయాలు, సంకల్పాలకు పూర్తిగా భిన్నమైన భారత్‌ను రూపొందిస్తుంది. అదే జరిగిన పక్షంలో దేశంలో సమైక్యత, సమగ్రత కొరవడుతాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

నిజమే, మన ప్రస్తుత రాజకీయ పరిస్థితులు చాలా బాధాకరంగా ఉన్నాయి. అయితే ఈ దుస్థితి నుంచి బయట పడేందుకు మనం తొలినాటి 'నెహ్రూవియన్' భావజాల ఏకాభిప్రాయానికి వెళ్లలేము. వామపక్ష–ఉదారవాద–ప్రగతిశీల రాజకీయాలు నెహ్రూవియన్ పద్ధతులు పోవాలని కోరుతున్నాయి.

అయితే అది సాధ్యమూ కాదు, వాంఛనీయమూ కాదు. ఎందుకంటే పాత భావజాల ఏకాభిప్రాయం భ్రష్టమయింది. పర్యావరణ సమస్యలకు అది ప్రాధాన్యమివ్వలేదు. కులం, జెండర్ అసమానతలను, ప్రజల సాంస్కృతిక, మతపరమైన మనోభావాలను పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో కొత్త భావజాల సమైక్యతను సృష్టించుకోవడం మినహా మనకు మరో ప్రత్యామ్నాయం లేదు. కొత్త భావజాల సమతౌల్యతలో ఉండి తీరాల్సిన ఏడు అంశాల గురించి విశదంగా చూద్దాం.

కొత్త సైద్ధాంతిక సమతౌల్యత నిజమైన, ఆత్మ విశ్వాసపూరితమైన జాతీయవాదం నుంచి ప్రభవించి తీరాలి. ప్రస్తుతం ప్రజల మనస్సులను బలీయంగా ప్రభావితం చేస్తున్న నిస్సార, కర్కశ జాతీయవాదానికి అమూర్త అంతర్జాతీయవాదం, జాతీయవాదానంతర వాదాలు సమాధానాలు కానేకావు. యూరోపియన్ మేధావులలాగా మనం జాతీయవాదాన్ని ఉపేక్షించ లేము. మన మహోన్నత జాతీయోద్యమం, స్వాతంత్ర్య పోరాట సంప్రదాయాలు, విలువల నుంచి ప్రేరణ పొందిన దేశభక్తి ప్రపూరిత జాతీయవాదాన్ని ఇప్పుడు మనం పెంపొందించుకోవాలి. భారత్‌ను గర్వకారణంగా భావిస్తూ ఆ భావనకు వాస్తవిక అర్థాన్ని సమకూర్చాలి. బాహ్యంగా, అంతర్జాతీయ సమాజంలో మనదైన ప్రముఖ స్థానాన్ని సాధించుకోవడం; అంతర్గతంగా, మన సమాజంలోని సకల వైవిధ్యాలను సమాదరించే జాతీయ సమైక్యత ను నిర్మించుకోవడం ద్వారా మాత్రమే అది సాధ్యమవుతుంది.

రెండో అంశం– మన సాంస్కృతిక, ధార్మిక విలువలతో దృఢంగా పెనవేసుకున్న లౌకికవాదాన్ని అభివృద్ధి పరచుకోవలసిన అవసరం ఉంది. ఈ పుణ్యభూమి సంప్రదాయాలలో మూలాలు లేని లౌకికవాదం మత సంకుచితత్వాన్ని ఓడించలేదు. లౌకిక వాదం గురించి పాశ్చాత్య విజ్ఞులు సాగించే చర్చలో, రాజ్యానికి మతానికి ఎటువంటి సంబంధముండకూడదనేది ఒక ప్రధాన అంశం. అయితే మనం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ప్రజల మధ్య మతపరమైన ఘర్షణలు; మత తెగల మధ్య కలహాలు. 'సర్వ ధర్మ సంభవ్' అన్న ఆదర్శాన్ని ఆచరించే రాజ్యవ్యవస్థ మనకు కావాలి. రాజ్యం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ అన్ని మతాలకు సమాన దూరంలో ఉండాలి. ఏ మతసమూహం పట్ల ఎటువంటి వివక్ష చూపకూడదు. అదే సమయంలో ఏ మత సమూహంలోనైనా అణచివేత, అన్యాయాలకు వ్యతిరేకంగా నిష్పాక్షిక చర్యలు చేపట్టాలి. మత సంప్రదాయాలను ఉపేక్షించడం వల్ల లౌకిక రాజ్యవ్యవస్థను నిర్మించలేం. మన మతసంప్రదాయాలు అన్నిటితోనూ సమరీతిలో అనుబంధాన్ని నెలకొల్పుకోవాలి.

మూడో అంశం – అట్టడుగు స్థాయి వ్యక్తి శ్రేయస్సుకు ప్రాధాన్యమిచ్చే మార్కెట్ సోషలిజాన్ని అభివృద్ధి పరచుకునేందుకు మనం కృషి చేయాలి. పెట్టుబడిదారీ వ్యవస్థలోని అసమానతలకు ఉద్యోగిస్వామ్య వ్యవస్థ ఆధ్వర్యంలోని రాజ్య సామ్యవాదం సమాధానం కానేకాదు. మార్కెట్ మన జీవితంలో ఒక అంతర్భాగం అన్న సత్యాన్ని మనం అంగీకరించి తీరాలి. మన అర్థనీతి 'eco-norm-ics' గా పరిణమించాలి. అంటే నైతిక విలువలు, పర్యావరణ సుస్థిరతతో ఆర్థిక హేతుబద్ధతను సమన్వయపరచాలి. సంక్షేమ విధానాల ప్రాధాన్యం మౌలిక అవసరాలయిన ఆహారం, గృహవసతి నుంచి ఉపాధి, విద్య, ఆరోగ్యభద్రతకు మారాలి.

నాలుగో అంశం సామాజిక న్యాయం. ఈ లక్ష్యసాధనకు బహుముఖ దృక్పథాన్ని అనుసరించాలి. దీనివల్ల వర్తమాన రాజకీయాలను అమితంగా ప్రభావితం చేస్తున్న అస్తిత్వ నిరాకరణ, అస్తిత్వ ఆరాట ధోరణులను అధిగమించడం సాధ్యమవుతుంది. అయితే ఇందుకు వర్తమాన భారతదేశంలోని కుల అసమానతలను అంగీకరించి, వాటి నిర్మూలనకు గతంలో కంటే మరింత చిత్తశుద్ధితో కృషిచేయవలసిన అవసరముంది. అలాగే ఇతర సామాజిక అసమానతలను– (జెండర్, లైంగికత, వర్ణం, ప్రాంతం, మతసమూహం, గ్రామీణ– పట్టణ అంతరాలు) గుర్తించి తీరాలి. ఈ సమస్యల పరిష్కారానికి రాజ్యవ్యవస్థ విధానపరంగా ప్రతిస్పందించాలి. సామాజిక న్యాయసాధనకు ప్రధాన ఉపకరణంగా పరిగణిస్తున్న కులఆధారిత రిజర్వేషన్ల విధానంలో స్వల్ప మార్పులు చేయాలి. అలాగే చట్టసభలలోను, రాజకీయ వ్యవస్థలలోనూ మహిళలు, అణగారిన వర్గాల వారికి సముచిత ప్రాతినిధ్యం కల్పించటంపై మరింత శ్రద్ధాసక్తులు చూపాలి.

ఐదో అంశం పర్యావరణ పరిరక్షణ. ప్రతి రాజకీయ ఎజెండాలోనూ దీనికి అగ్రప్రాధాన్యం ఉండి తీరాలి. అభివృద్ధి పేరిట జరుగుతున్న పర్యావరణ విధ్వంసాన్ని, ముఖ్యంగా ఆదివాసీ సమాజాల విచ్ఛిన్నతనూ ఇంకెంత మాత్రం ఉపేక్షించకూడదు. అలాగే వాతావరణ మార్పును నిరాకరించడం అవివేకమే అవుతుంది. జల్–జంగల్–జమీన్ పై ప్రజల నియంత్రణ కోసం జరిగిన ఉద్యమాలే ప్రజా పర్యావరణవాదానికి పునాదులు వేశాయి. వ్యవసాయ విధానాలు, పద్ధతులలో కూడా మార్పులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


☞ మిగతా 15వ పేజీలో

# లాక్ డౌన్ - పేద శ్రామిక ప్రజలు



**ప్రభాత్ పట్నాయక్**

లాక్‌డౌన్ కారణంగా గ్రామీణ ప్రాంతాలలో కన్నా పట్టణ ప్రాంతాలలోనే అర్ధాకలి పస్తులు పెరిగాయన్న సంగతి ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో రేషన్ కార్డులు లేనివారి సంఖ్య ఎక్కువగా ఉండడం మొదటి కారణం. అందువలన వారికి ప్రజా పంపిణీ ద్వారా ఆహార దినుసులు అందుబాటులో లేకుండా పోయాయి. ఈ కరోనా కష్టకాలంలో ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజానీకాన్ని కొంతవరకూ ఆదుకుంది. అటువంటి పథకం ఏదీ పట్టణ ప్రాంతాలకు లేదు. పట్టణ పేదలను ఈ కష్టకాలంలో ఆదుకునే ప్రత్యామ్నాయం ఏదీ లేకుండా పోయింది. ఇది రెండవ కారణం.




2020 మార్చి 24న మరో నాలుగు గంటల్లో దేశమంతటా లాక్‌డౌన్ అమలు జరగనున్నట్లు నరేంద్రమోడీ ప్రకటించారు. ఆ లాక్‌డౌన్ మే నెలాఖరు వరకూ కొనసాగింది. ఆ తర్వాత కూడా స్థానికంగా అక్కడక్కడా లాక్‌డౌన్‌లు కొనసాగినా, దేశం మొత్తం మీద లాక్‌డౌన్ మళ్ళీ విధించలేదు. ఆ లాక్‌డౌన్ పేద శ్రామికులకు ఎక్కడా లేని కష్టాలను తెచ్చిపెట్టింది. వారిలో ముఖ్యంగా వలస కార్మికులు పడిన పాట్లు మొత్తం ప్రపంచం దృష్టిలో సైతం పడ్డాయి. తక్కిన దేశాలలో లాక్‌డౌన్‌కి, మన భారతదేశంలో లాక్‌డౌన్‌కి ఒక తేడా ఉంది. ట్రంప్ హయాంలోని అమెరికాతో సహా తక్కిన దేశాల్లో లాక్‌డౌన్ కారణంగా ఆదాయాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇచ్చారు. మన దేశంలో మాత్రం అటువంటిదేమీ లేదు (ఎక్కడో కొద్ది మంది ఎంపిక చేసుకున్న వారికి చాలా స్వల్పమొత్తాలు ఇచ్చారు. అంతే). లాక్‌డౌన్ కారణంగా ఎంతో మంది పేద శ్రామికులు ఆదాయాలు కోల్పోయి నిరాధారంగా, ఆకలి బాధతో బతకవలసిన స్థితికి నెట్టబడ్డారు. లాక్‌డౌన్ ఎత్తివేసి కొన్ని నెలలు గడిచినా, వారాస్థితి నుండి ఇంకా కోలుకోనేలేదు.

కొన్ని పౌర సంస్థలు కలిసి 'హంగర్ వాచ్' అనే పేర ఒక సర్వే నిర్వహించారు. గత అక్టోబర్ నెలలో ఈ సర్వే జరిగింది. ఈ సర్వేలో కలిసిన వారి నుండి ఆదాయాల, వ్యయాల లెక్కలు, గణాంకాలు సేకరించడం కాకుండా వారికి కలిగిన అభిప్రాయాలను యథాతథంగా సేకరించారు.

సర్వేలో వెల్లడైన విషయాలు చేదు వాస్తవాలను బైట పెట్టాయి. సర్వే చేసిన వారు దాదాపు 4000 మందిని కలిశారు. వారిలో 53.5 శాతం–అంటే సగం కన్నా ఎక్కువ మంది–కుటుంబాలు మార్చి 2020లో వాడిన గోధుమ లేదా బియ్యం కన్నా అక్టోబర్‌లో వాడినది తగ్గింది. ఇక పప్పు ధాన్యాలు, ఆకుకూరలు, గుడ్లు, మాంసం వంటి దినుసుల వినియోగం తగ్గిపోయిన కుటుంబాల శాతం అంతకన్నా ఎక్కువగానే ఉంది. 62 శాతం కుటుంబాల ఆదాయం లాక్‌డౌన్ కన్నా ముందు ఉన్న స్థాయితో పోల్చితే అక్టోబర్ నాటికి తగ్గిపోయింది. లాక్‌డౌన్‌కు పూర్వం పనులకు పోయినవారికన్నా ఆ తర్వాత కాలంలో పనులకు పోతున్న వారి సంఖ్య పెరిగింది. కుటుంబ ఆదాయాలు తగ్గిపోతున్నందున, ఎక్కువమంది పనులకు పోవలసిన అగత్యం ఏర్పడింది.

సర్వే పరిమితంగానే జరిగి వుండొచ్చు. కాని జరిగిన మేరకైనా చూసినప్పుడు లాక్‌డౌన్ కారణంగా కొంతమందికైనా కడుపులు నిండని స్థితి ఏర్పడిందని స్పష్టం అవుతోంది. హంగర్ వాచ్ సర్వే ప్రత్యేకించి బలహీన వర్గాలపైన, తరగతుల పైన కేంద్రీకరించిందన్నది ఇక్కడ గమనంలో ఉండాలి.

గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే పట్టణ ప్రాంతాలలో ఆహార దినుసుల వినియోగం తగ్గిపోయిన కుటుంబాలు (కరోనా పూర్వపు కాలంతో పోల్చినప్పుడు) ఎక్కువశాతం ఉన్నాయని హంగర్ వాచ్ అధ్యయనంలో తేలిన అంశం మరింత ఆశ్చర్యాన్ని గొలుపుతోంది. ఇది ముందు ఊహించినదానికి భిన్నంగా ఉంది. సాధారణంగా అర్ధాకలి పస్తులు, పోషకాహారలేమి వంటివి పట్టణ ప్రాంతాల్లో

కన్నా గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ. పోషకాహారం పొంద గలుగుతున్న వారెందరన్న కొలబద్దతో పేదరికాన్ని అంచనా వేసినప్పుడు గ్రామీణ ప్రాంతాలలోనే పేదరికం ఎక్కువగా ఉందని ప్రతిసారీ మన అధ్యయనాలు వెల్లడి చేస్తున్నాయి. అందుచేత లాక్‌డౌన్ కారణంగా గ్రామీణ ప్రాంతాలలో కన్నా పట్టణ ప్రాంతాలలోనే అర్ధాకలి పస్తులు పెరిగాయన్న సంగతి ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

ఇలా పెరగడానికి రెండు కారణాలు ఉన్నాయని చెప్పవచ్చు. పట్టణ ప్రాంతాల్లో రేషన్ కార్డులు లేనివారి సంఖ్య ఎక్కువగా ఉండడం మొదటి కారణం. అందువలన వారికి ప్రజా పంపిణీ ద్వారా ఆహార దినుసులు అందుబాటులో లేకుండా పోయాయి. ఈ కరోనా కష్టకాలంలో ఉపాధిహామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజానీకాన్ని కొంతవరకూ ఆదుకుంది. అటువంటి పథకం ఏదీ పట్టణ ప్రాంతాలకు లేదు. పట్టణ పేదలను ఈ కష్టకాలంలో ఆదుకునే ప్రత్యామ్నాయం ఏదీ లేకుండా పోయింది. ఇది రెండవ కారణం.

హంగర్ వాచ్ నివేదిక నుండి కొన్ని ముఖ్యమైన నిర్ధారణలకు రావచ్చు. లాక్‌డౌన్ కాలంలో ఎటువంటి తోడ్పాటూ అందక పోవడం కారణంగా పేదరికం, అర్ధాకలి పెరగడం, నిరాధారంగా మిగిలిపోయిన వారు పెరగడం సంభవించింది. ఇది అనివార్యం. ఐతే, ఈ పరిస్థితి అంతే తీవ్రంగా లాక్‌డౌన్ అనంతర కాలంలో కూడా కొనసాగడం కొట్టవచ్చినట్టు కనపడే విషయం. సాధారణంగా లాక్‌డౌన్ కాలంలో ఉత్పత్తి నిలిచిపోతుందని, ఒకసారి లాక్‌డౌన్ ఎత్తివేశాక ఉత్పత్తి యథాతథంగా తిరిగి ప్రారంభమౌతుందని అందరమూ భావిస్తాం. కాని లాక్‌డౌన్ కాలంలో శ్రామిక ప్రజలకు ఇతరత్రా ఆర్థిక తోడ్పాటు అందినట్టయితే ఈ విధంగా జరిగే వీలుంటుంది. అదే, మన దేశంలో మాదిరిగా ఎటువంటి ఆర్థిక తోడ్పాటూ అందకుండా ఉన్నట్లైతే యథాతథ స్థితి మొదలుకాదు.

లాక్‌డౌన్ కాలంలో శ్రామిక ప్రజల ఆదాయాలు పడిపోకుండా నిలబెట్టగలిగితే ఆహార దినుసులను, ఇతర వినిమయ వస్తువులను వారు అదే స్థాయిలో కొనుగోలు చేయగలుగుతారు. అదే విధంగా వారి ఋణ భారం అదనంగా పెరిగిపోదు. ఉత్పత్తి లాక్‌డౌన్ కాలంలో నిలిచిపోతుంది గనుక, శ్రామిక ప్రజల అవసరాలను తీర్చడానికి వ్యాపారులు వారి వద్ద నుండే సరుకుల నిల్వలను కరిగిస్తారు. ఒకసారి లాక్‌డౌన్ ఎత్తివేశాక ఉత్పత్తి తిరిగి ప్రారంభం అవుతుంది. కార్మికులకు ఆదాయాలు రావడం తిరిగి మొదలౌతుంది. వారి వినిమయం మాత్రం యథాతథంగా కొనసాగుతుంది. వ్యాపారులు తమ వద్ద నిల్వలను తిరిగి పెంచుకోవలసి వుంది గనుక మామూలు స్థాయికన్నా ఎక్కువగా ఉత్పత్తిని చేయవలసిన స్థితి వస్తుంది.

అదే లాక్‌డౌన్ కాలంలో శ్రామికులకు ఎటువంటి ఆర్థిక తోడ్పాటూ అందకపోతే వారి ఆదాయం ఏమీ ఉండదు గనుక వారి వినిమయం బాగా తగ్గుతుంది. అలా తగ్గించుకున్నా, అందుకోసం వారు అప్పులు చేయవలసి వస్తుంది. లాక్‌డౌన్ ఎత్తివేసిన తర్వాత ఉత్పత్తి యథాతథంగా పూర్వపు స్థాయిని చేరుకుందనుకున్నా శ్రామిక ప్రజల వినిమయం మాత్రం యథాతథ స్థితికి రాదు. ఎందుకంటే వారు లాక్‌డౌన్ కాలంలో చేసిన అప్పులు తీర్చడానికి తమకు వచ్చిన ఆదాయాల్లో నుండి కొంతభాగం కేటాయించవలసి వుంటుంది. ఆ అప్పులు పూర్తిగా తీరిపోయే వరకూ వారి వినిమయం పూర్వపు స్థాయికి చేరుకోదు.

వినిమయం బట్టి ఉత్పత్తి ఉంటుంది. వినిమయం తగ్గింది గనుక ఉత్పత్తి కూడా పూర్వపు స్థాయికి చేరుకోదు. అంటే ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి, వినిమయం-రెండూ కరోనా పూర్వపు స్థితికి చేరుకోవు. అందుచేత ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం కూడా అరకొరగానే జరుగుతుంది.

అందుచేత ఆర్థిక వ్యవస్థ మామూలు స్థాయికి తిరిగి కోలుకోవాలన్నా, శ్రామిక ప్రజలు దుర్భర దారిద్ర్య పరిస్థితి నుండి బైట పడాలన్నా వారి ఆదాయాల స్థాయి లాక్‌డౌన్ కాలంలో పడిపోకుండా ఆర్థిక తోడ్పాటు అందించడం అవసరం. తెలివిమాలిన మోడీ ప్రభుత్వం ఈ పని చేయలేదు. శ్రామిక ప్రజలలో చాలా మంది ఆదాయాలను దాదాపు సున్నాకి తీసుకొచ్చింది. దీని పర్యవసానాలు ఏవిధంగా ఉంటాయో హంగర్ వాచ్ వెలుగులోకి తెచ్చింది.

మధ్యంతరంగా సగంలో నిలిచిపోయిన మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కేంద్రం ఖర్చు చేయ నున్నదని, దానితో ఆర్థిక వ్యవస్థ కోలుకోడానికి కావలసిన ప్రేరణ లభిస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అందుకోసం ఎంత మోతాదులో ఖర్చు చేయనున్నారన్నది అసలు ప్రశ్న. లాక్‌డౌన్‌కు మునుపు ఏ స్థాయిలో ఖర్చు చేశారో, అదే స్థాయిలో ఇప్పుడూ చేస్తే, శ్రామిక ప్రజల కొనుగోలు శక్తి ఏమీ అదనంగా పెరగదు. లాక్‌డౌన్ కాలంలో చేసిన అప్పులకు వాయిదాలు కట్టడానికి కొంత భాగం పోతే తక్కిన భాగంతోటే వారు ఏ కొనుగోలు అయినా చేయగలుగుతారు. అందువల్ల మొత్తం డిమాండ్ లాక్‌డౌన్ అనంతర కాలంలో కూడా పూర్వపు స్థాయికి తిరిగి చేరుకోదు. అంటే ఆర్థిక వ్యవస్థ మామూలు స్థాయికి తిరిగి కోలుకోవడం జరగదు. అలా కోలుకోవాలంటే మౌలిక

వసతుల కల్పనపై ప్రభుత్వం పెట్టే ఖర్చు లాక్‌డౌన్ పూర్వపు కాలంలో చేసిన ఖర్చు కన్నా చాలా ఎక్కువ మోతాదులో పెంచాలి. పడిపోయిన శ్రామిక ప్రజల కొనుగోలు శక్తి వలన డిమాండ్‌లో ఏర్పడే తరుగుదలను అది భర్తీ చేయగలిగేంతగా ఉండాలి.

ఇలా పరోక్షంగా మౌలిక వసతుల కల్పనపై ఎక్కువ ఖర్చు చేయడం కన్నా నేరుగా ఆ శ్రామిక ప్రజలకు నగదు చెల్లించడం ద్వారా వారి కొనుగోలు శక్తిని నిలబెట్టడమే మెరుగు. లాక్‌డౌన్ అనంతరం కూడా ఆ విధంగా నగదు చెల్లింపులను కొనసాగించవచ్చు. లాక్‌డౌన్ అనంతరం కొంత తగ్గిన ఉత్పత్తి స్థాయి, తగ్గిన ఆదాయాల వలన ఏర్పడిన కొరతను భర్తీ చేయగలిగే మేరకు ఈ నగదు చెల్లింపులు జరగాలి. అప్పుడు మాత్రమే పూర్వపు స్థాయికి వినిమయం పెరుగుతుంది. లాక్‌డౌన్ కాలంలో ఇటువంటి చెల్లింపులేవీ చేయనందున దాని ప్రభావం లాక్‌డౌన్ అనంతర కాలంలో కూడా పడుతోంది. దానివలన ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం కూడా సాధ్యం కావడంలేదు.

నేరుగా శ్రామిక ప్రజలకు నగదు చెల్లింపులు చేస్తే వారి దారిద్ర్యం ఉపశమించడమే గాక, వారు ఆ సొమ్ముతో కొనుగోలు చేసే సరుకులన్నీ దేశీయంగా ఉత్పత్తి చేసినవే ఎక్కువగా ఉంటాయి. దిగుమతి చేసుకోవలసినవి పెద్దగా ఉండవు. అందువలన ప్రభుత్వం చేసే ఖర్చు దేశీయ డిమాండ్ ఎక్కువగా పెరగడానికి తోడ్పడుతుంది. అందువలన దేశంలో ఉపాధి అవకాశాలు మరింత పెరగడానికి దోహదం చేస్తుంది.

శ్రామిక ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసే ఆహార ధాన్యాలను ఇక్కడ ప్రభుత్వం చేసే నగదు చెల్లింపులలో భాగంగా పరిగణించకూడదు. ఉచితంగా ఆహార ధాన్యాలు ఇవ్వడం మంచిది. అవసరం కూడా. కాని దానివలన ఆర్థిక వ్యవస్థ పెరగడానికి ఎటువంటి ప్రేరణా కలగదు. అది కేవలం భారతీయ ఆహార సంస్థ వద్ద పేరుకుపోయిన నిల్వలను కొంత తగ్గించడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. దానితోబాటు నేరుగా నగదు చెల్లింపులు చేసినప్పుడే ఆర్థిక వ్యవస్థ కోలుకోడానికి తగిన ఊపు లభిస్తుంది.

ఇప్పుడు ఉపాధి లేని ప్రతీ కుటుంబానికీ నెలకు రు.6000 కనీసం చెల్లించాలని ప్రధానికి ప్రతిపక్ష నాయకులు లేఖ రాశారు. ఆ విధంగా ప్రతీ ఇంటికీ మూడు నెలలపాటు నగదు చెల్లించినా, అందుకయ్యే ఖర్చు మన జిడిపిలో కేవలం 2 శాతమే. ఆ మాత్రం లోటును తేలికగా సర్దుకోవచ్చు. కాని మోడీ ప్రభుత్వానికి తెలివితక్కువతనంతోబాటు పిరికితనం కూడా ఉంది. అందుకే ప్రజలు ఇంత దుర్భర పేదరికంతో నలిగిపోతున్నా, ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నా ధైర్యం చేయలేకపోతోంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నిర్దేశించిన పరిమితులను దాటుకుని వ్యవహరించలేకపోతోంది. ❑

*(ప్రజాశక్తి సౌజన్యంతో..)*

---

**కొత్తదారుల వెతుకులాట**

**(12వ పేజీ తరువాయి)**

ఆరో అంశం– మన సాంస్కృతిక విధానాలు, రాజకీయాలు భారతీయ ఆధునికతను అన్వేషించాలి. ఆ అన్వేషణే వాటికి స్ఫూర్తి కావాలి. ఆ అన్వేషణ మన స్వాతంత్ర్యోద్యమ విలువలను నిండుగా ప్రతిబింబించి తీరాలి. దీనివల్ల మనం నిస్సారమైన, అనుకరణ ప్రాయమైన ఆధునికతను త్యజించగలుగుతాము. ఇందుకు గాను మనం సమున్నత నాగరికతా వారసత్వాన్ని పునర్నిర్మించుకోవాలి. అదే సమయంలో విశాల దృక్పథంతో ప్రపంచవ్యాప్తంగా ప్రతి సమాజం నుంచి నేర్చుకోవాలి. భారతీయ భాషల సమగ్ర వికాసానికి కృషి చేయాలి. పాఠశాల స్థాయి నుంచే మన జ్ఞాన సంప్రదాయాలను సముచిత రీతిలో గౌరవించే విద్యావిధానాలను రూపొందించుకోవాలి.

ఆఖరి అంశం– ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యవాదానికి మనం నిబద్ధమై తీరాలి. అది ఒక లక్ష్యంగా, ఒక సాధనా మార్గంగా ఉండాలి. ప్రజాస్వామ్యమంటే రాజ్యాంగాన్ని రూపొందించుకోవడం, సంస్థల నిర్మాణం, ఎన్నికల నిర్వహణ మాత్రమే కాదనే వాస్తవాన్ని మనం గుర్తించి తీరాలి. వివేకశీలురైన, సమాన ప్రతిపత్తి గల పౌరులతో కూడిన ఒక రాజకీయ సమాజాన్ని నిర్మించుకోవడమే ప్రజాస్వామ్య పరమార్థం. రాజకీయ అధికారాల వికేంద్రీకరణ, సహజ వనరుల సమలభ్యత, విధాన నిర్ణయాలలో ప్రజలకు ప్రత్యక్ష పాత్ర కల్పించడం ద్వారా ఆ సమున్నత ప్రజాస్వామ్యాన్ని అభివృద్ధిపరచుకోవాలి.

నిజానికి ఇవేవీ కొత్త అంశాలు కావు. అవన్నీ మన రాజ్యాంగంలో ఉన్న విలువలే. వాటిని విశదీకరించాను. ప్రజల జీవితాలతో వాటికి ప్రగాఢ సంబంధం నెలకొల్పేందుకు ప్రయత్నించాను. ఈ దృష్ట్యా ఒక కొత్త భావజాల సమతౌల్యతను సృష్టించడం కేవలం విద్యావిషయిక లేదా మేధా కర్తవ్యం కాదు అందుకు ప్రజాభిప్రాయాన్ని మౌలికంగా మార్చివేయవలసి ఉంది. ఇదొక రాజకీయ సవాల్. ❑



# సంపద పంపిణీతోనే అందరికీ జీవన భద్రత

డి వి వి ఎస్ వర్మ

కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్నది. ఈ ఏడాదిన్నర కాలంలో మన దేశంలో 3 లక్షల మందిని బలి తీసుకుంది. ఇవి ప్రభుత్వ లెక్కలు. ప్రయివేటు సంస్థల లెక్కలు అనేక రెట్లు ఎక్కువగా వున్నాయి. కోవిడ్ తొలిదశ ముగిసింది అనుకున్నాం. మలిదశ మరింత ప్రళయంగా వచ్చింది. ఆసుపత్రులలో మంచాల కొరత, ఆక్సిజన్ కొరత, వెంటిలేటర్ల కొరత, స్మశానాలలో శవాల గుట్టలు, గంగానదిలో తేలుతున్న శవాలు ఇవి కనిపించే దృశ్యాలు ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతున్నాయి.

కరోనా విలయంలో ఇది ఒక వైపు చిత్రం మాత్రమే. మరో పక్క ఈ విలయం కోటాను కోట్ల ప్రజల జీవనాన్ని కకావికలం చేసింది. దాని పరిణామాల మీద తగిన చర్చ లేకుండా పోయింది.

దేశంలో 50 కోట్ల మంది ఉపాధి రంగంలో వుంటే అందులో 45 కోట్ల మంది (90శాతం) అసంఘటిత రంగంలో వున్నారు. రోజువారీ కూలీలుగా వున్నారు. అజీంప్రేమ్‌జీ యూనివర్శిటీతో సహా అనేక ప్రామాణిక సంస్థలు చేసిన సర్వేల ప్రకారం మధ్యతరగతిగా వున్నా 3 కోట్ల మంది గత ఏడాది కాలంలో పేదరికంలోకి దిగజారిన స్థితి ఆందోళన కలిగిస్తున్నది.

అసంఘటిత కార్మికుల సంపాదన తగ్గిపోవడంతో వీరిలో 40 శాతం మంది ఒకపూట భోజనంతో సరిపెట్టుకుంటున్నారు. గతంలో పొదుపు సొమ్ము చిల్లర ఆస్తులు అమ్మేసుకుంటున్నారు. స్థానిక వడ్డీ వ్యాపారుల నుండి అధిక వడ్డీలతో అప్పులు చేస్తున్నారు.

ఇదే పరిస్థితి మరి కొంత కాలం కొనసాగితే ఆకలిచావుల ప్రమాదం పొంచి వుందని, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యలు పెరిగే స్థితి వుందని, పోషకాహార లోపంతో పిల్లలు, పెద్దలు అనారోగ్యంతో మరణాలు వుంటాయని ఇది కరోనా మరణాలకు మించి వుండే ప్రమాదంగా పలువురు పేర్కొంటున్నారు.

కోవిడ్ కల్లోలం ప్రకృతి ప్రసాదితం దానికి చికిత్స అవసరం. అలాగే పేదరికం, అంతరాల అగాధాలు దోపిడీ వ్యవస్థ ప్రసాదితాలు . దానికి తగ్గ శస్త్ర చికిత్స కూడా తక్షణ అవసరం అయింది. లేకపోతే మూకుమ్మడి ఆకలి చావులు, ఆత్మహత్యలు జరిగేలా ఈ పేదరికం కోటాను కోట్ల మందిని నడిపిస్తుంది.

పేదరికం, అంతరాల అగాధాలపై చర్చ గత దశాబ్దకాలంగా ప్రపంచ వ్యాపితంగా మొదలైంది. సంక్షిప్తంగా ఆ నేపథ్యాన్ని పరిశీలించుకుందాం.

1990 దశకంలో సోషలిస్టు దేశాలు పతనం అయ్యాయి. మరోపక్క పెట్టుబడి ప్రపంచీకరణ ఊపు అందుకుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ శాశ్వతం అనీ, దానికి ప్రత్యామ్నాయం లేదనీ, అది సాధించే అభివృద్ధి ఫలితాలు తిరిగి ప్రజలపై వర్షిస్తుందనీ అది అంతరాలను; పేదరికాన్ని తొలగిస్తుందనీ దాని సిద్ధాంతకర్తలు ఊదరగొట్టారు. మార్క్స్ భావజాలానికి కాలం చెల్లిందని ప్రగల్భాలు పలికారు.

2008లో అమెరికాతో సహా పెట్టుబడిదారీ దేశాలు ఆర్థిక మాంద్యంతో సంక్షోభంలో పడ్డాయి. వేతన స్తంభనలూ, సంక్షేమాల కోతల వంటి చిట్కాలు వారిని గట్టెక్కించలేకపోయాయి.

మార్క్స్ భావాలకు కాలం చెల్లిందన్నవాళ్లే యీ సంక్షోభాన్ని అర్థం చేసుకోడానికి "పెట్టుబడి" గ్రంధాన్ని చదవాలని ప్రకటించారు. సంపద కొద్దిమంది చేతుల్లో పేదరికం అత్యధిక సంఖ్యాకుల దగ్గర పేరుకుపోవడాన్ని గుర్తించడం మొదలైంది.

ఈ దశలో పికెట్టీ రాసిన "21వ శతాబ్దపు పెట్టుబడి" పుస్తకం వెలువడింది. పెట్టుబడి సృష్టించిన అంతరాల అగాధాన్ని అది బట్టబయలు చేసింది. మరోపక్క ఆక్స్‌ఫాం సంస్థ ప్రపంచంలో 1 శాతం మంది దగ్గర 70 శాతం సంపద పోగుపడ్డ తీరునీ కోటానుకోట్ల మందిని పేదరికంతో ముంచిన స్థితిని తన నివేదికలలో వెల్లడించింది.

దీంతో పలుదేశాలలో ఈ అంతరాల అగాధాన్ని, పేదరికాన్ని తొలగించే మార్గాలుగా నగదు బదిలీలు, కనీస మౌలికఆదాయాన్ని అందించే ప్రయోగాలు మొదలయ్యాయి. ఈ ప్రయోగాలు సంపద కేంద్రీకరణ మీద దాడి చెయ్యడానికి బదులు "పన్నుల సొమ్ము" పంపిణీ ద్వారా సాధించాలని భావించాయి. అది శిరోభారం కావడంతో ప్రభుత్వాలు ఆ ప్రయోగాలను మధ్యలోనే వదిలిపెట్టాయి. ఈ నేపథ్యంలో భారతదేశంలో సంపద కేంద్రీకరణ పర్యవసానాలను పరిశీలించుకోవాలి.

కరోనా సంక్షోభానికి ముందే సంపద కేంద్రీకరణ మీద, పేదరికం మీద చర్చ ప్రారంభం అయింది. ఆక్స్‌ఫాం నివేదిక

ప్రకారం మన దేశంలో 10 శాతం దగ్గర 77 శాతం దేశ సంపద పోగై వుంది. 2017లో దేశంలో పెరిగిన సంపదలో 1 శాతం దగ్గర 73 శాతం పోగుపడింది. అంతరాల అగాధాలు, పేరుకుపోతున్న పేదరికాన్ని తగ్గించడానికి నగదు బదిలీలు, మౌలిక ఆదాయ కల్పన వంటి అంశాలపై చర్చ మొదలైంది.

### 1. పన్నుల సొమ్ము - సాధ్యం కాని పరిష్కారం

2017 బడ్జెట్‌కి ముందు ప్రవేశపెట్టే ఆర్థిక సర్వే నివేదికలో పేదరికంలో వున్న కుటుంబాలకు నగదు బదిలీ చేసే మౌలిక ఆదాయ కల్పన మీద ఒక అధ్యాయాన్ని కేటాయించి చర్చించారు.

"పన్నుల సొమ్ము"తో మౌలిక ఆదాయ కల్పన సాధ్యం కాదన్నది అంతిమంగా తేలిపోయింది. అందుకే బడ్జెట్‌లో దాని ప్రస్తావనే లేకుండా పోయింది. కేంద్రప్రభుత్వ బడ్జెట్‌లో కొన్ని లక్షల కోట్ల రూపాయలు పేదల మౌలిక ఆదాయకల్పనకు ఖర్చు చేసే స్థితి లేదు. ఎందుకంటే కార్పొరేట్ పన్నుకు వరుసగా రాయితీలు ఇచ్చి దాదాపు 3 లక్షల కోట్ల ఆదాయాన్ని కోల్పోవడం జరిగింది. తగ్గిన ఆదాయాన్ని పూడ్చుకోడానికి అప్పుల మీద, ప్రభుత్వరంగం ఆస్తుల అమ్మకం మీద కొన్ని ఎంపిక చేసిన సంక్షేమ పథకాల కుదింపు మీద ఆధారపడే స్థితి వచ్చింది. పైగా బడ్జెట్‌కు ఒక రాజకీయ లక్ష్యం కూడా వుంది. అది కొన్ని బృందాలకు నగదు బదిలీ ద్వారా "ఓటు బ్యాంకు"లను ఏర్పరచుకోవడం, ఎన్నికల నిధులు సమకూర్చుకోడానికి కార్పొరేట్ శక్తులకు రాయితీలు ప్రకటించడం, బడ్జెట్లు వీటికే పరిమితం అవుతున్నాయి. అంతకుమించి దీర్ఘకాలికమైన మౌలిక ఆదాయ పథకాన్ని నెత్తికెత్తుకునే స్థితి దానికి ఎంతమాత్రమూ లేదు. పైగా దోపిడీదారులు సృష్టించిన అంతరాల అగాధాన్ని, పోగుపడ్డ సంపద పంపిణీతో నిమిత్తం లేని ఏ పరిష్కారమైనా అంతరాలను తొలగించకపోగా దానిని మరింత పెంచుతుంది.

### 2. పారిశ్రామిక లాభాల పంపిణీ

పారిశ్రామికరంగంలో కార్మికులకు బోనస్ అన్న సమస్య మీద దాదాపు 50 సంవత్సరాలు చర్చ జరిగింది. బోనస్ అనేది పరిశ్రమల యజమానులు ఐచ్ఛికంగా, బహుమతిగా ఇచ్చేది అన్న వాదన చివరికి వీగిపోయింది. యజమానుల లాభంలో కార్మికుల అదనపు శ్రమ ఇమిడి వున్నందున్న లాభంలో వాటాగా బోనస్ చెల్లించాలన్న వాదన ఆధారంగా 1965 బోనస్ చట్టం వచ్చింది. కార్మికుల అదనపు శ్రమే యజమాని లాభం అన్న మార్క్స్ విశ్లేషణను ఇది సమర్థించినట్లయింది. చట్టంలో నిర్దేశించిన ప్రకారం లాభంలో ఒక వాటాను వేరు చేసి విధిగా చెల్లించే పద్ధతి స్థిరపడింది. దీనికి తోడు 2013లో కంపెనీల చట్టాన్ని సవరించారు. కార్పొరేట్ లాభాలలో 2 శాతాన్ని "సమాజం కోసం ఖర్చు చెయ్యాలన్నది చట్టబద్ధం అయింది. వస్తువు తయారీలో యజమాని పొందే అదనపు శ్రమ లాభానికి మూలం అయినప్పటికీ ఆ వస్తువును సమాజం కొనుగోలు చేసినప్పుడే అది లాభంగా స్థిర రూపం పొందుతుంది అన్నది మార్క్స్ చేసిన విశ్లేషణే. లాభాలను సమాజానికి కూడా పంపిణీ చేయాలన్నదే ఈ సవరణ సారాంశం.

ఇవి అనేక లోటుపాట్లు వున్న అరకొర చర్యలే. కాని లాభాలకు శ్రమదోపిడీ మూలం అనీ దానిని కార్మికులకు, సమాజానికి హక్కుగా పంపిణీ చెయ్యాలన్న సూత్రాన్ని ఆవిష్కరించాయి. భవిష్యత్తులో సంపద పంపిణీకి ఇది దారులు వేస్తుంది.

### 3. సంపద పంపిణీకి ద్వారాలు తెరవాలి

అదనపు శ్రమ లాభాలకు మూలమైనట్లే "పోగుపడ్డ అదనపు శ్రమే' సంపద అన్నది మార్క్స్ విశ్లేషణ. లాభాలలో వాటా బోనస్‌గా కార్మికులకు, మరో వాటా సమాజం కోసం ఖర్చు చెయ్యడం చట్టబద్ధం అయినట్లే ఇప్పుడు పోగుపడ్డ సంపద పంపిణీని కూడా చట్టబద్ధం చెయ్యాలి.

కరోనా కల్లోలం సృష్టించిన, నిరుద్యోగాన్ని, అర్ధాకలిని, అప్పుల వలయాన్ని అధిగమించడానికి "పన్నుల సొమ్ములు" అరకొరగా లాభాల వాటాలు" సరిపోవు. ఈ పరిస్థితిని ఎదుర్కొనడానికి దీర్ఘకాలికంగా ప్రజలకు జీవించే హక్కును కల్పించడానికి మిగిలిన ఏకైక పరిష్కారం "పోగుపడ్డ సంపదను" పంపిణీ చెయ్యడమే. సంపద పంపిణీ జాతీయ చట్టం కోసం ప్రజాభిప్రాయాన్ని సేకరించే కార్యక్రమాలు తక్షణం ప్రారంభం కావాలి. సంపద పంపిణీ ద్వారా పేదలకు నగదు బదిలీ చేసే మౌలిక ఆదాయ కల్పనతో పాటు మొత్తం సమాజానికి బతుకు భరోసానిచ్చే మంచి ప్రమాణాల ఉచిత విద్య, ఉచిత వైద్య సేవలు, ఉపాధి నైపుణ్యాలు అందించే ఏర్పాటు జరగాలి. ఈ అంశాలు పేదరికంలో వున్న కోట్లాది ప్రజలలో, మౌలిక సదుపాయాలు అందని ప్రజలందరిలో కొత్త ఆకాంక్షను రేకెత్తిస్తుంది. 10 శాతం మంది దగ్గర పోగుపడ్డ సంపదపై 70 శాతం ప్రజలు జరిపే ఉద్యమంగా అది విస్తరిస్తుంది. ఇప్పుడు సంపద పంపిణీకి ద్వారాలు తెరిస్తే అది భవిష్యత్తులో సంపద సమాజపరం కావాలన్న సమసమాజ ఆకాంక్షకు దారి తీస్తుంది. సంపద పంపిణీ ద్వారా జీవించే హక్కును సాధించడం అన్నది తక్షణ ప్రజా ఉద్యమ నినాదం కావాలి. ❑



# ఆంధ్రప్రదేశ్‌కు అస్తిత్వ స్పృహ ఉందా ?

కొప్పర్తి వెంకట రమణమూర్తి

తెలంగాణకు ఉన్నట్లే కోస్తాంధ్రకు కూడా ప్రత్యేక అస్తిత్వం ఉంటుందా? అని ఒక విమర్శక మిత్రుడు ఇటీవల జరిగిన ఒక జూం సమావేశంలో సందేహం లేవనెత్తారు. తప్పకుండా ఉంటుంది అని ప్రధానవక్త నుంచి సమాధానం వచ్చింది. సమైక్యం అనే ఆదర్శంలో పడి వేరొకరి అస్తిత్వంతో తన అస్తిత్వాన్ని కలగలుపుకున్న ఆంధ్ర, ప్రత్యేక తెలంగాణకు అంగీకరించడం ద్వారా తనను విడదీసుకుని తన ప్రత్యేకతను నిర్వచించుకోవాల్సిన అవసరాన్ని తెలంగాణ ఉద్యమ సమయంలో ఆంధ్రజ్యోతిలోనే రాసిన వ్యాసాలలో కోస్తాంధ్రకు చెందిన ఈ వ్యాస రచయిత ప్రస్తావించాడు. కొంత కాలంగా ఉన్న దాన్ని పునరుద్ఘాటించాల్సిన అవసరాన్ని ఈ ప్రశ్న అనివార్యం చేసింది.

ఇతర సంస్కృతులనూ కలిపేసుకుని తన సంస్కృతినీ అందరిదిగా చలామణి చేసిందనే విమర్శ నెదుర్కొన్న ఒకానొక ఆధిపత్య సంస్కృతి నుంచి ఒకటో రెండో సంస్కృతులు విడిపోయినప్పుడు మిగిలేది ఆ సంస్కృతేనా, లేక వేరొకటా ? వేరొక అస్తిత్వాన్ని గుర్తించక తన అస్తిత్వాన్నే ఇతరుల అస్తిత్వంగా మలచిన ఒకానొక అస్తిత్వంలో నుంచి ఇతర అస్తిత్వం వేరైపోయినపుడు మిగిలేది అదే అస్తిత్వమా ? లేక, అది వేరొకటిగా మారుతుందా? అట్లా మారిపోయేటట్లయితే ఒకనాటి దాని అస్తిత్వం ఆధిపత్య అస్తిత్వం అవుతుందా? మారకపోతే ఒక అస్తిత్వాన్ని తన నుంచి కోల్పోయిన ప్రభావం ఏమీ లేనట్లేనా ? అనే ప్రశ్నలకు తెలంగాణ నుంచి విడివడిన ఆంధ్రప్రదేశ్ నిస్సందేహంగా తనదైన కొత్త అస్తిత్వంతో మిగిలింది అనేది జవాబు. అయితే ఆ స్పృహను అది ఎంత మేరకు సంతరించుకుందీ అన్నది ఈ వ్యాస చర్చనీయాంశం.

ప్రాదేశిక అస్తిత్వానికి నిర్వచనం ఒక ప్రదేశంలో ఉంటూ ఒక చరిత్ర, భాష, సంస్కృతులు కలిగి ఉండి తమను ఇతరుల కంటే ప్రత్యేకంగా భావించుకుని ఆ ప్రత్యేకతలను నిలబెట్టుకోవడానికీ అభివృద్ధి పరచుకోవడానికీ ప్రయత్నించడం. ఇందులో ప్రదేశం అత్యంత కీలకం. దానికి ఇతర ప్రాంతాలనుండి విడివడే లక్షణం లేకుంటే మిగిలినవి సాధ్యపడవు. ఉదాహరణకు ఒకే లక్షణాలు కలిగిన ఒక మతానికో కులానికో రంగుకో చెందిన వాళ్లు వేర్వేరు ప్రదేశాల్లో పరచుకుని ఉంటే వారికిది సాధ్యం కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అస్తిత్వాన్ని కోల్పోయినట్టు భావించుకున్న తెలంగాణ ఉద్యమించి వేరైనపుడు ఆంధ్రప్రదేశ్ భిన్నమైన ప్రాదేశిక అస్తిత్వంతో మిగిలింది. కాబట్టి అస్తిత్వ స్పృహ కలగడానికీ పెరగడానికీ కావలసిన మొదటి requirement సమకూరింది. పరిధి చిన్నదై లక్ష్యాలు నిర్దిష్టమయ్యాయి.

అయితే ఆంధ్రప్రదేశ్ అనే పేరు కొనసాగడంతో దానికి రెండు అస్తిత్వాలు ఏర్పడినట్లయింది. ఒకటి తెలంగాణతో కలసి ఉన్నప్పటిదీ, రెండవది విడివడినప్పటిది. అందువల్ల తెలంగాణ విడిపోయిన తర్వాత మిగిలింది ఏ ఆంధ్రప్రదేశ్, పాతదా, కొత్తదా అనే ప్రశ్న ఎదురౌతుంది. పాతది అంటే పేరు పాతది, అస్తిత్వమూ పాతదే అనే భావనలో ఉండడం. కొత్తది అనుకోవడంలో రెండు రకాలుంటాయి. ఒకటి పేరు పాతదైనా అస్తిత్వం కొత్తది అనుకోవడం. రెండవది అస్తిత్వం కొత్తదైనపుడు పేరూ కొత్తదే ఉండాలని కోరుకోవడం. ఆంధ్రప్రదేశ్ తనకు కొత్త పేరు కావాలని కోరుకోకపోవడం వెనుక తన అస్తిత్వం కూడా పాతదే అనే భావన ఉన్నట్లుంది. తెలంగాణ కొత్త అస్తిత్వంతో, ఆ అస్తిత్వంతో అవిభాజ్యమైన పేరుతో ఒక తాజాదనంతో అడుగులు వేస్తుంటే, ఆంధ్రప్రదేశ్ తానొక కొత్త అస్తిత్వాన్ని సంతరించుకున్నానన్న స్పృహని చైతన్యాన్నీ తగినంత పొందలేకపోతోంది. ఆంధ్రప్రదేశ్ కొత్త అస్తిత్వ స్పృహను పొందడానికి బహుశ కొత్త పేరు అవసరం. అయితే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలనుంచి కొత్త రాష్ట్రాలు ఏర్పడినపుడు పాత రాష్ట్రాలు పాతపేర్లతోనే ఉన్నాయనడమూ, భారత్ నుంచి పాకిస్తాన్, దాని నుంచి బంగ్లాదేశ్ విడిపోయినప్పుడూ ఇలానే

జరిగిందనడం ఒకసారి ఒకలా జరిగితే ఎప్పుడూ అలానే జరగాలనడం లాంటిది.

అంత్యము నందు అచ్చు ఉండే అజంతా భాష అయిన తెలుగు మాతృభాషగా కలిగిన రాష్ట్రానికి చివర హల్లు ఉన్న 'ప్రదేశ్' అనే పేరు ఏమిటీ ? ఆంధ్రము వంటి వాడుకలో లేని పదం కంటే 'తెలుగు' అనే మాట ఉత్తమం కదా ! తెలుగు అనే భాషా సూచకానికి చారిత్రక ప్రాధాన్యమున్న 'నాడు' ను కలిపి చేసే 'తెలుగునాడు' అటువంటి ఒక కొత్త పేరు. తెలుగు మాట్లాడే ప్రజలు రెండు రాష్ట్రాలుగా ఏర్పడినప్పుడు ఒక పేరులో తెలుగు, మరొక పేరులో తెలంగు ఉండడంలోని సారూప్యత మౌలికంగా ఉన్న ఏకతకు చిహ్నం కూడా అవుతుంది. అది కాకపోతే ఆంధ్ర అస్తిత్వ ప్రత్యేకతను సూచించే మరో పేరైనా ఎంపిక చేయవచ్చు. ఇప్పటికైనా మించిపోయింది లేదు రాజకీయాల్ని పక్కనబెట్టి కొత్త పేరు కోసం ఆలోచన చేయాలి. ఫలితం కొత్త అస్తిత్వ స్పృహ !

భిన్నమైన చరిత్ర ఉండడం అస్తిత్వ ముఖ్య లక్షణాల్లో ఒకటి. స్వాతంత్ర్యానికి ముందు రెండువందల ఏళ్లలో ఆంధ్ర ప్రాంతం బ్రిటీష్ చేత పరిపాలింపబడితే తాము నిజాం చేత పరిపాలింప బడడం వల్ల వెనుకబడ్డామనే అవగాహనతో మొదలైన తెలంగాణ చరిత్ర అధ్యయనం మొత్తం చరిత్రను వేరుపరుచుకుంటూ కోస్తాంధ్ర రాయలసీమ ప్రజలకన్నా తామెంత భిన్నమైన మూలాలు కలిగి ఉన్నామో చెప్పుకునేంతగా సాగింది. అంతటితో ఆగక నిజాం మంచివాడో చెడ్డవాడో ఎవరైతేనేం తమ వాడు, పీవీ నరసింహారావు ఏ పార్టీ వాడైతేనేం తమ బిడ్డ అని స్వంతం చేసుకునేంతగా వారి అస్తిత్వ స్పృహ పెరిగింది. దాని మంచి చెడ్డలూ, అటువంటి అవగాహనకు ఉండాల్సిన పరిమితులనూ పక్కన పెడితే, తెలంగాణను మినహాయించి ఆంధ్ర దేశం తనదైన చరిత్ర నిర్మాణానికి ఇంతవరకూ పూనుకోనే లేదు. ఆంధ్రదేశంలో చరిత్రకారులకు కొదువ లేదు. ఇక్కడ జరుగుతున్న చరిత్ర పరిశోధన కూడా తక్కువేమీ కాదు. అయితే చరిత్రను వారంతా mega narrative గానే చూస్తున్నారు. చూస్తే చూడవచ్చునేమో గానీ విభజన జరిగి ఒక విభాగంలో అస్తిత్వ స్పృహ పెరిగినపుడు రెండవ విభాగం ఇంకా ఐక్యస్పృహలోనే కొనసాగడం ఆత్మహత్యా సదృశం అవుతుంది. పాఠకులు వాచ్యార్థంలో తీసుకోకపోతే అది ఒక రాజ్యం ఆయుధాల్ని పెంచుకుంటూ పోతున్నపుడు పక్క రాజ్యం నిరాయుధీకరణ పాటించడం లాంటిది. చివరకిది తాబేలూ కుందేలూ కథలా ముగిసే ప్రమాదముంది. ఈ కొత్త పరిశోధనలో ఆంధ్రదేశానికి చెందిన నిర్దిష్టత ఏదో వెలికి రావలసి ఉంది. చరిత్ర పూర్వయుగ సంస్కృతుల దగ్గర మొదలుపెట్టి ఆధునిక యుగం దాకా ఆంధ్రదేశ చరిత్రను తెలంగాణ నుంచి వేరు చెయ్యాలి. ముఖ్యంగా ఆంధ్రదేశం నుంచి తెలంగాణకు సాగిన ఆధునిక యుగ వలసల ఆర్థిక నేపథ్యం, చారిత్రక అనివార్యత, దాని పర్యవసానాల మీద సంశ్లేషణాత్మకమైన పరిశోధన జరగవలసి ఉంది. ఒక ప్రాంతం మీద మరొక ప్రాంతం చేసిన ఆర్థిక పెత్తనం వెనుక ఉన్న వ్యక్తుల్నీ ప్రాంతాన్నీ కాక చరిత్ర చోదక శక్తుల్ని వెలికి తీయవలసి ఉంది. ఆంధ్ర దేశ చరిత్రకారులు అందుకు ఉత్తరాధునికం వంటి సరికొత్త దృక్పథాల్ని సంతరించుకుంటారా లేక పాత పద్ధతుల్లోనే కొత్త దారులు వెతుకుతారా అన్నది ఆసక్తికరం.

తెలంగాణా వాదులు తమ భాష సంస్కృతుల్ని విడదీసుకో గల్గడంతో ఆంధ్ర దేశపు భాష సంస్కృతులు వేరయ్యాయి. ఆధిపత్య భాష సంస్కృతులుగా చలామణీ అయిన వాటికి మళ్లీ అస్తిత్వాన్ని నిలబెట్టుకోవలసిన అవసరం ఉందా అన్నది ప్రశ్న. ఏ భాష సంస్కృతికైన ఏ కాలంలోనైనా అస్తిత్వాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంటుందనేది సమాధానం. అసలు ఆంధ్రదేశ ప్రజలకు తమ భాషా సంస్కృతుల మీద ఎంత గౌరవం ఎంత ఇష్టం ఉన్నాయి? అవి సంప్రదాయాన్ని అభిమానించడంతో పాటు ఎంత ఆధునికతను సంతరించుకుంటున్నాయి ? ఈ ఇష్ట గౌరవాల్లో సారమెంత, నీరమెంత ? అన్నవి చాలా కాలంగా చాలా మంది వేస్తున్న ప్రశ్నలు. ఒకటి మాత్రం నిజం అంధ్రదేశంలో భాషా సంస్కృతుల్ని నిలబెట్టుకోవడం అనేది దాన్ని అధ్యయనం చేసిన, లేదా అభిమానం పెంచుకున్న ప్రత్యేక వర్గానికి చెందినదిగా భావించడం ఉంది. రాజకీయ పార్టీలు, పారిశ్రామిక వర్గాలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావి వర్గాలు అది తమ పని కాదని భావిస్తాయి. వీళ్లల్లోనే కొందరు అది తక్కువస్థాయి కార్యక్రమం అని కూడా అనుకుంటారు. మరి కొందరు వాటిని నిలబెట్టడానికి ఆర్థిక సహాయం చెయ్యడం ద్వారా వాటి పరిరక్షకులుగా ఖ్యాతి పొందజూస్తారు, కానీ పాటించరు. మొత్తం మీద ఈ విషయంలో వాగర్థాలు రెండూ

తక్కువే. దక్షిణ భారత సంస్కృతిలో తమిళ, కన్నడ, మళయాళ, సంస్కృతుల కన్నా ఆంధ్ర సంస్కృతి ఎట్లా భిన్నమైందో జరిగిన పరిశోధనల ఫలితాలూ, ద్రావిడ భాషా కుటుంబంలో తెలుగుకున్న ప్రత్యేకతలూ పండితుల, భాషా శాస్త్రవేత్తల గ్రంథాల్లోంచి ప్రజలకు చేరుకున్న దాఖలాలు లేవు. నీ సంస్కృతీ లక్షణాలు ఏమిటీ అని ఆంధ్రుడెవర్నైనా నిలదీస్తే చెప్పగలిగే వాళ్లు లేరు అనేంత తక్కువ. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక విభాగం దగ్గర అది పరిరక్షించ బూనుకున్న రాష్ట్ర సంస్కృతీ మౌలిక లక్షణాలనదగ్గవి ఏమైనా ఉన్నాయోమో తెలీదు. సదరు వెబ్‌సైట్‌లో అయితే లేవు. సంస్కృతి అంటే గ్రామీణ లేదా గిరిజన కళలు అనే భ్రమ మాత్రం ఉంది. తెలుగు వారి సంప్రదాయాలూ, మర్యాదలు, ఆహారం, వేష ధారణ, అలంకరణ, పండుగలు, భాషా ప్రాంతీయ వైవిధ్యం మొదలైన వాటి సమ్మిశ్రమంగా అనుసరిస్తూ నిలుపుకోదగ్గ లక్షణాలను రూపొందించుకోవడం కదా అస్తిత్వమంటే ? అది ఇంతకు ముందు ఎప్పుడైనా జరిగిందా ?! ఏ ప్రభుత్వమైనా ఆ స్పృహను తను సంతరించుకోవడం ద్వారా ప్రజలకు కలిగించిందా ?

ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ఒకనాడు ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదంతో ముందుకొచ్చింది. ఒక మేరకు జాతీయ రాజకీయాలలో ముద్ర వేయగలిగింది కానీ తెలుగు వారి సాంస్కృతిక అస్తిత్వాన్ని నిలబెట్టడానికి అది చేసిన కృషి ఏమీ లేదు, టాంక్ బండ్ మీద విగ్రహాల్ని నెలకొల్పడం తప్ప. సంబంధిత వ్యవస్థల్ని రద్దుచేసి పునర్వ్యవస్థీకరించుకున్న తెలుగు విశ్వవిద్యాలయం చేసిన కృషి ఏమైనా ఉంటే దాన్ని వ్యవస్థీకరించ లేదు. ఎన్ టి రామారావు కాలంలో వచ్చిన 'తెలుగునాడు' అనే కొత్త పేరు ప్రతిపాదనను కొత్త రాష్ట్రం ఏర్పడినప్పుడు మొదట అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం పునః పరిశీలించలేదు. ఆంధ్ర దేశానికి సాఫ్ట్‌వేర్ ప్రపంచ పటంలో చోటు కల్పించాలని పడిన ఆరాటంలో అది తనదైన అస్తిత్వంతో ఉండాలనే కీలకాంశాన్ని విస్మరించింది. ఫలితంగా ఆంధ్రదేశం సిలికన్ ప్రపంచానికి ఉపగ్రహంగా మారిపోయింది. సాఫ్ట్‌వేర్ సంస్కృతి, దాని అనుబంధ జీవన విధానం వచ్చి చేరి మానవ సంబంధాలే మారిపోయాయి. డిల్లీలో మళయాళీ నర్సుల భాషాభిమానం దాని మీద ఆంక్షల వరకూ దారితీస్తే అమెరికా, ఆస్ట్రేలియాల్లో తెలుగు వాళ్లు తెలుగూ ఇంగ్లీషూ కాదు కదా, కేవలం సాంకేతిక భాష మాట్లాడుకుంటున్నారు.

ఇక ఇప్పుడు అధికారంలో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భాష సంస్కృతుల విధానమేమిటో ఇప్పటివరకు స్పష్టం కాలేదు. వాటి పట్ల ఆసక్తి ఉన్నట్లు తెలియచేసే ఏ సూచనలూ వెలువడలేదు. పైగా ప్రాథమిక స్థాయి నుంచి విద్యలో ఇంగ్లీష్ మాధ్యమం ప్రవేశ పెట్టాలన్న నిర్ణయం వివాదానికి దారితీసింది. రాష్ట్రంలో నిమ్న వర్ణాలూ, పేదవర్గాలూ ఇంగ్లీషు మాధ్యమం తమ ఎదుగుదలకు ఆలంబనగా భావిస్తుంటే ఇతర వర్గాలు ఇది తెలుగు భాష నిర్వీర్యానికి దారితీస్తుందని ఆందోళన చెందుతున్నాయి. అస్తిత్వానికి తెలుగు, అభివృద్ధికి ఇంగ్లీషూ ప్రతీకలైనపుడు వీటి మధ్య తుల్యతను సాధించాల్సి ఉంది. మండలానికో తెలుగు పాఠశాల దీనికి పరిష్కారం కాదు. ఆంగ్ల మాధ్యమమే అంతిమ నిర్ణయమయ్యేటట్టయితే మొత్తం విద్యలో తెలుగు భాషతో పాటు సంస్కృతి సముచిత స్థానం పొందాలి.

మూడు రాజధానుల ప్రస్తావన లేకుండా అస్తిత్వ చర్చ పూర్తి కాదు. ఆంధ్రదేశ అస్తిత్వంలో అంతర్భాగంగా ఉన్న రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలు అనే మూడు అస్తిత్వాల మూలం లోంచి ఈ ఆలోచన వచ్చిందనుకోవడం అహేతుకం కాదు. ఇది మూడు ప్రాంతాల అభివృద్ధి, వాటి మధ్య నిత్య సంబంధాలు లక్ష్యంగా చేసిన వినూత్నమైన సాహసోపేతమైన నిర్ణయం. బహుశ మూడు అస్తిత్వాలను కలిపి ఉంచేందుకు చేసిన పరిపాలన దౌత్యం. దానికి కొనసాగింపుగా మూడు ప్రాంతాల భాష సంస్కృతుల మధ్య హెచ్చు తగ్గుల నిర్మూలనకు కూడా ప్రభుత్వం పూచీ పడితే ఫలశ్రుతిగా రాష్ట్రం ఒకటిగా నిలబడుతుంది. లేకపోతే మరో రెండు అస్తిత్వ ఉద్యమాలు తలలెత్తడం ఎవ్వరూ ఆపలేరు.

ఏ అస్తిత్వ చైతన్యంతో అయితే నాలుగు దశాబ్దాలపాటు పోరాటం చేసి మద్రాసు నుంచి ఆంధ్రదేశం విడివడిందో ఆ చైతన్యమే ఇప్పుడు కూడా కావాలి. ఆంధ్ర దేశానికి రెండు అనుభవాలు ఉన్నాయి. ఒకటి మద్రాసుతో కలిసి ఉన్నప్పటి ద్వితీయస్థాయి అనుభవం. రెండు తెలంగాణతో కలిసి ఉన్నప్పటి ఆధిపత్య అనుభవం. ఆంధ్రదేశం ఈ రెండూ కాదు. దానికొక కేవలత్వం ఉంది. అది కనిపించాలి. వినిపించాలి. ❑

*(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో..)*

# కార్యకారణ సంబంధం వల్లే సృష్టి ఏర్పడింది

డాక్టర్ దేవరాజు మహారాజు
సుప్రసిద్ధ సాహితీవేత్త, సైన్సు ప్రొఫెసర్



బుద్ధిని, ప్రకృతిని, సంఘాన్ని – వాటి మధ్య గల సంబంధాన్నీ మొదట గుర్తించినవాడు బుద్ధుడు. సాధారణ యుగానికి రెండున్నర వేలకు ముందు (బీసీఈ) జీవించిన బుద్ధుడు, కేవలం ప్రకృతి పరిశీలనల వల్ల, నాటి సమాజ స్థితిగతుల వల్ల, తన వివేకం వల్ల, వివేచన వల్ల కొన్ని విషయాలు గ్రహించగలిగాడు. ఆనాటికి ప్రపంచం దృష్టి పెట్టని ఎన్నో అంశాల మీద దృష్టిపెట్టగలిగాడు. కొత్త విషయాలు వెలికి తీయగలిగాడు. అందరు చూస్తున్న విషయాలనే ఒక కవి సృజనాత్మకంగా వర్ణించి చెప్పి, విస్మయ చకితుల్ని చేసినట్టు – బుద్ధుడు మహాకవులకే మహాకవి అయ్యాడు. ఎందుకంటే మానవ జీవితంలోంచి ఎన్నో అంశాల్ని సృజనాత్మకంగా వెలికితీసి కళాత్మకంగా ఆవిష్కరించాడు గనక! కాలానికి ఎదురీది శతాబ్దాలు గడిచినా నిత్యనూతనంగా తన ఆలోచనలతో విరాజిల్లుతున్నాడు గనక! ప్రపంచ మతాలనన్నింటినీ ప్రభావితం చేయగలిగాడు గనక! ప్రభావితం కాకపోతే, ఆయా మతాలు ఆయన బోధనల్లోంచి ఎన్నెన్నో అంశాల్ని ఎందుకు స్వీకరించినట్టూ? పురాణాల్లోని కట్టుకథల్లో లాగా ఏదో శక్తి ప్రత్యక్షమై బుద్ధుడికి జ్ఞానబోధ చేయలేదు. ముక్తిమార్గం చూపలేదు. కేవలం తన అంతఃచేతనతోనే, బుద్ధి బలంతోనే, ఆత్మవిశ్వాసంలోనే ప్రపంచానికి ఓ కొత్తదారిని చూపించగలిగాడు. ఓ కొత్త వెలుగును ప్రసరించగలిగాడు.

మంచి ఎక్కడ ఉన్నా ఏ స్థితిలో ఉన్నా దాన్ని స్వీకరించడం మంచిదే. కానీ, దాని మూల రూపాన్ని మార్చి, అర్థాన్ని మార్చి, పెడర్థాలు రాసుకుని, అది తమదిగా ప్రచారం చేసుకోవడమంటే అది నైతికంగా దిగజారడమే కదా? అన్ని మతాల, అన్ని పవిత్ర గ్రంథాల సారాంశం ఒకసారి గమనించండి. ఎక్కడైనా 'మనిషే ప్రధానం' అని ఉందా? ప్రకృతి ధర్మాన్ని గుర్తించడం ఉందా? ప్రకృతి ధర్మాన్ని స్వీకరించాలని ఉందా? అసలు సృష్టికర్త లేడని, విశ్వంలో జరుగుతున్న పరిణామాలన్నింటికీ కార్యకారణ సంబంధం ఉందని, గతంలోనూ, ఇప్పుడూ ఏ ధర్మ ప్రబోధకుడైనా చెప్పే సాహసం చేయగలిగాడా? చార్వాకులూ, బుద్ధుడు తప్ప, వాస్తవంలోంచి విషయాన్ని వివరించిందెవరూ? ఏ ప్రాణి అయినా సరే మరణించాక లేచి రావడం అంటూ శతాబ్దాల చరిత్రలో ఎప్పుడూ ఎక్కడా జరగలేదు కదా? మరి ఎందుకు ఆ విషయానికి ప్రాముఖ్యమిస్తున్నారూ? అది ఏసుక్రీస్తు విషయమైనా కానీయండి. ఇటీవల మదనపల్లెలో తల్లిదండ్రులు ఇద్దరు కూతుర్లను చంపిన కేసే కానివ్వండి. ఒకవైపు అత్యాధునిక వైజ్ఞానిక యుగంలోకి పోతూ మరోవైపు అవాస్తవాల మీద, గతకాలపు మూఢత్వంలో కూరుకుపోవడం న్యాయమా? ఎవరికి వారు ఆలోచించుకుని, తమను తాము మార్చుకోవాల్సిన అవసరం ఉంది.

ధర్మ చక్కవవత్తనా సుత్తంలో బుద్ధుడు 'సంస్కారం' గురించి ఇలా చెప్పాడు. అజ్ఞానం అంటే సంస్కారం ఎలా ఏర్పడిందో తెలుసుకోలేకపోవడం

* సంస్కారమే స్పృహకు, చేతనకు మూలం.
* స్పృహ,చేతన ఏమిటీ? అంటే, అది... జీవం యొక్క అంకురం.
* జీవం యొక్క అంకురం వల్లనే మనసు – శరీరం ఏర్పడుతున్నాయి.
* శరీరం, దానికో మనసు ఏర్పడినందువల్ల మరో ఆరు ఇంద్రియాలు ఏర్పడుతున్నాయి.
* ఇంద్రియాల వల్లనే స్పర్శ ఏర్పడుతూ ఉంది.
* స్పర్శ వల్లనే సంవేదనలు కలుగుతున్నాయి.
* సంవేదనల వల్ల కోరికలు కలుగుతున్నాయి – అంటే తృష్ణ!
* తృష్ణవల్ల ఆసక్తి (దీన్ని ఉపాదానం అన్నారు)
* ఆ ఆసక్తి (ఉపాదానం) కారణంగా స్థిరత్వం లేకపోవడం. స్థిరత్వం లేకపోవడమే భవం... భవ చక్రం వల్ల జన్మ కలుగుతూ ఉంది.
* జన్మ వల్లనే రుజాగ్రతస్తులవడం (ముసలితనం రావడం) మరణించడం జరుగుతూ ఉంది.
* ముసలితనం – మరణం ఉండడం వల్లనే దుఃఖం–రోగం వంటివి కలుగుతున్నాయి.

భూమి, నీరు, అగ్ని, వాయు, ఆకాశం అనే ఐదు ధాతువుల మిశ్రమం ఈ శరీరం. ఈ శరీరాన్ని రూపస్కందం అని అన్నాడు బుద్ధుడు. దీన్ని మళ్ళీ నాలుగు స్కందాలుగా విభజించాడు. 1. విజ్ఞానం 2. సంజ్ఞ 3. వేదన 4. సంఖారా. ఇందులో చేతన / ప్రాణశక్తి అనేది విజ్ఞానం. దీని ద్వారానే ఆరు ఇంద్రియాలు ఉత్తేజింపబడుతున్నాయి.

బుద్ధి అనేది సంజ్ఞ. ఉత్తేజింపబడిన ఇంద్రియాల నుంచి దీనికి సంకేతాలు అందుతాయి. ఆ సంకేతాల ద్వారానే ఏదైనా బాగున్నదనో-బాగులేదనో తీర్పు వెలువడుతుంది. ఆ తీర్పు వెలువడుతుందీ అంటే - మనిషిలో నిక్షిప్తమైన అతని పాత జ్ఞాపకాల ఆధారంగా ఆ తీర్పు వెలువడుతుంది.

మనిషిలో వేదనా స్కందం అనేది ఒకటుందని ప్రకృతి బుద్ధుడికిచ్చిన ఒక ముఖ్యమైన జ్ఞానం! ఆయన పొందిన జ్ఞాన పరంపరకు ఇదే భూమిక. ఈ వేదనా స్కందం మూడు రకాలుగా ఉంటుంది. 1. సుఖవేదనలు (బాగుంది అని) 2. దుఃఖ వేదనలు (బాగులేదని) సుఖ-దుఃఖ వేదనలు రెండూ కానివి 3. తటస్థ వేదనలు. సుఖ వేదనలు కలిగినప్పుడు - 'ఇంకా కావాలి' అనిపిస్తుంది. దుఃఖ వేదనలు కలిగినప్పుడు - 'ఇక వద్దు' అని అనిపిస్తుంది. ఇలాంటి ప్రతి క్రియల్నే 'సంఖారా' అని అంటారు. ఇలాంటి సంఖారా (ప్రతిక్రియల) వల్లనే మనిషిలో రాగద్వేషాలు ఏర్పడుతున్నాయి.

మనిషి తనలో సంస్కారాలు ఎలా ఏర్పడుతున్నాయో తెలుసుకునే జ్ఞానం స్వయంగా అనుభూతి చెంది, లేదా అనుభవించి తెలుసుకున్నదే - ఇది ఏదో కోర్సు చేసి, చదువు వల్ల సంపాదించే జ్ఞానం కాదు. దానికి భిన్నంగా ఉండి సంపాదించే జ్ఞానం. దీన్నే ప్రజ్ఞ అన్నారు. ప్రజ్ఞ కేవలం ఒక మనిషికి మాత్రమే స్వంతం. యూనివర్సిటీలో చాలా మంది చదివి డిగ్రీలు తీసుకుంటారు. ఈ ప్రజ్ఞ అలాంటిది కాదు. అది కేవలం వ్యక్తిగతం. అంతటి ప్రజ్ఞను ఎవరికి వారే సాధించుకోవాల్సి ఉంటుంది.


బుద్ధుడు చెప్పిన నిర్వాణ స్థితి ఇలాంటిదే! నిర్వాణ స్థితికి ఎవరికి వారే చేరుకోవాల్సి ఉంటుంది. దాన్ని మాటల్లో వర్ణించి ఎవరూ ఎవరికీ చెప్పలేరు. అనుభూతి ఎవరికి వారు పొందాల్సిందే కదా? ఇదీ అలాంటిదే. మీరు జీవితంలో ఎప్పుడూ తినని ఒక విదేశీ ఫలం రుచి చూశారని అనుకుందాం. అది మీకు చాలా చాలా నచ్చింది. ఆ అనుభూతి కేవలం మీకే స్వంతం. దాన్ని ఇతరులకు వ్యక్తీకరించడానికి మీరు మాటలు వెతుక్కుని చెప్పడానికి ప్రయత్నిస్తారు. కానీ, సంపూర్ణంగా వ్యక్తీకరించలేరు. ఇతరులకు కూడా మీరు ఆ అనుభూతిని పంచాలంటే.. మీరు వారికి ఆ ఫలం అందించి తినిపించాల్సిందే! అయితే, వారు పొందే అనుభూతి మీ అనుభూతికన్నా కొంత భిన్నంగా ఉండొచ్చు. అందువల్ల ప్రజ్ఞ / అనుభూతి / నిర్వాణ స్థితి - అన్నీ వ్యక్తిగతమే! 'నిర్వాణ స్థితి' ఎవరికి వారు సాధించుకోవాల్సిందే!

మనిషికి ఆకలి అయ్యింది. అన్నం తిన్నాడు - అని అనుకుందాం. ఇదే మామూలు భాషలో చెప్పుకుంటే మనిషి కర్త. తినడం క్రియ. బుద్ధుని ప్రకారం మనిషి కర్త కాదు. ఆకలి కావడం కర్త. తినడం క్రియ. ఇక్కడ ఆకలి ఎవరికైతే వారు తింటారు. జంతువుకు ఆకలి అయితే జంతువు తింటుంది. మనిషికి ఆకలి అయితే మనిషి తింటాడు. అంటే ఆకలి-కర్త, తినడం-క్రియ. ఇదే సృష్టికి అన్వయించి చెప్పాడు బుద్ధుడు. కార్యకారణ సంబంధం వల్ల సృష్టి ఏర్పడిందే కానీ, ఎవరో ఒక కర్త-ఉండి ఈ విశ్వాన్ని సృష్టించలేదు.

బుద్ధుడు తన ఆలోచనల్ని ఎంతో ఆత్మ విశ్వాసంతో ప్రపంచానికి తెలియజేసినా, తనే ఒక ప్రత్యామ్నాయం లేని శక్తి అని ఎప్పుడూ భావించలేదు. చాలా వినయంగా తన స్థాయి ఎంత సాధారణమైందో తనే వివరించుకున్నాడు. "నాకంటే ముందు ఎంతో మంది బుద్ధులయ్యారు. అలాగే, నా తర్వాత కూడా కొందరు బుద్ధులవుతారు" అని చెప్పాడు. అయితే అందరూ తనలాగే ప్రకృతి నియతిని ఒప్పుకోవాల్సిందేనని అన్నాడు - దాన్ని మార్చడం ఎవరివల్లా కాదని కూడా చెప్పాడు. పాళీ భాషలో బుద్ధుడు వాడిన పదం 'సతి'. దాన్ని మనం తెలుగులో ఎరుక / స్పృహ / మెలకువ అని చెప్పుకోవచ్చు. 'పశ్శన'- అంటే చూడటం. ఈ చూడటం / గమనించడం అనే విషయం మీద బుద్ధుడు అతి సున్నితమైన, సూక్ష్మమైన అంశాలెన్నో చెప్పాడు. కాయాను పశ్శన (శరీరాన్ని గమనించడం) వేదనాను పశ్శన (వేదనల్ని గమనించడం) చిత్తాను పశ్శన (చిత్తాన్ని / మనసును గమించడం) ధమ్మాను పశ్శన (ధర్మం పట్ల అవగాహన కలిగి ఉండటం) గురించి బుద్ధుడు చాలా విషయాలు చెప్పాడు. ధర్మబద్ధమైన జీవితం గడపడానికి ఆయన కొన్ని మార్గాల్ని బోధించాడు. అవి 1. అష్టాంగమార్గం 2. ఏడు బోధి అంగాలు 3. పది పారమితలు - శీలాన్ని వృద్ధి చేసుకుంటే సమాధి సాధ్యమన్నాడు. సమాధి పెరిగితేనే ప్రజ్ఞ సాధ్యమన్నాడు... దేహంలో స్థిరమైనదేమీ లేదు. అంతా మారిపోయేదేనన్నాడు.

బుద్ధుడి కాలం నాటికి ప్రపంచంలో ఎక్కడా వైజ్ఞానిక పరిశోధనలు మొదలు కాలేదు. శరీరంలోని కణాల గురించి గానీ, పనిచేస్తున్న జీవ వ్యవస్థల గురించి గానీ ఎవరికీ ఏమీ తెలియని రోజులవి! అయినా, బుద్ధుడు ప్రకృతి నుంచి ఎన్నో విషయాలు గ్రహించాడు. తన చుట్టూ ఉన్న వారి జీవితాల్లోంచి ఎంతో గ్రహించాడు. దుఃఖానికి కారణమేమిటో కనుక్కున్నాడు. గ్రహించిన విషయాలన్నింటితో ఒక చింతనా పరుడయ్యాడు. అర్థం చేసుకున్న విషయాల్ని సునిశితంగా పరిశీలిస్తే, ఆయనలో ఒక మనోవైజ్ఞానిక నిపుణుడు కనిపిస్తాడు. ఒక పర్యావరణవేత్త కనిపిస్తాడు. ఒక సామాజిక శాస్త్రవేత్త - సంస్కర్త కనిపిస్తాడు. తత్త్వవేత్త సరే సరి! ప్రతి వైజ్ఞానికుడూ తను జీవిస్తున్న కాలం కంటే ముందుంటే గానీ, ఈ ప్రపంచానికి కొత్త విషయాలు చెప్పలేడు. ఆ రకంగా బుద్ధుడు, తన కాలానికంటే వేల ఏళ్ళు ముందున్న విషయం మనం గమనించాల్సిన అవసరం ఉంది. ❑

# అమ్మకపు వస్తువుగా ఆధ్యాత్మికత



జావేద్ అక్తర్

ఇండియా టుడే పత్రిక వారు ఢిల్లీలో నిర్వహించిన జాతీయ సదస్సులో "ఆధ్యాత్మికత" అనే అంశంపై ప్రఖ్యాత హిందీ,ఉర్దూ కవి "జావేద్ అఖ్తర్" గారు చేసిన ప్రసంగంలో కొన్ని భాగాలు....

మహానుభావులు ఎందరో ఉన్న ఈ సభలో నేను ఉన్న స్థానంలోకి రావాలని ఎవరూ కోరుకోరనుకుంటాను. ఎందుకంటే శ్రీశ్రీ రవిశంకర్ లాంటి జనాకర్షణగల మరియు శక్తిమంతులైన ఆధ్యాత్మిక గురువు మాట్లాడిన తర్వాత మాట్లాడబోవడం, అంటే సచిన్ టెండూల్కర్ అద్భుతంగా సెంచరీ చేసిన తర్వాత.... ఆడడానికి నాలాంటి వాడు రావడం లాంటిది.

కానీ, ఏదో ఒక బలహీన క్షణంలో 'ఇండియా టు డే' వారితో నేనిక్కడ మాట్లాడడానికి ఒప్పుకున్నాను.

సరే....

మొట్టమొదటనే నేను స్పష్టం చేయవలసిన కొన్ని విషయాలు ఉన్నాయి.

జావేద్ అఖ్తర్ అనే నా పేరుతో మైమరచిపోకండి. నేనిక్కడ ఏ రహస్యం విప్పబోవడం లేదు.

రచనలోనో, టెలివిజన్ మీదనో బహిరంగంగా నేను అనేకసార్లు చెప్పిన విషయమే మళ్ళీ చెపుతున్నాను......

నేను నాస్తికుడిని. నాకు ఏ మతంలోనూ విశ్వాసం లేదు. అందువల్ల ఎటువంటి రకం ఆధ్యాత్మికతలోనూ నమ్మకం లేదు. ఎటువంటిదైనా సరే.

ఇంకో విషయం కూడా చెప్పాలి. నేనిక్కడ కూచున్న పెద్ద మనిషిని విమర్శించడానికో, విశ్లేషించడానికో, విరుచుకు పడడానికో కూడా నిలబడలేదు.

ఆయనకు, నాకు మధ్య ఆహ్లాదకరమైన, మర్యాదపూర్వకమైన సంబంధం ఉంది. ఆయన ఇతరులతో ఎంత సాదరంగా ఉంటారో చాలా సార్లు గమనించాను. కానీ, నేను మాట్లాడదల్చుకున్నది ఒక భావం గురించి. ఒక వైఖరి గురించి. ఒక మానసిక స్థితి గురించి మాత్రమే. ఒక మనిషి గురించి కాదు.

ఈ సమావేశం ప్రారంభమైనప్పుడు నేనేమన్న పొరపాటు స్థలానికి వచ్చానా అని నాకు ఒక క్షణం అనుమానం వచ్చింది. ఎందుకంటే మనం కృష్ణుడో, గౌతముడో, కబీరో, వివేకానందుడో చెప్పిన తత్వశాస్త్రం గురించి చర్చించడానికి ఇక్కడకి వచ్చినట్టయితే, నాకు మాట్లాడవలసింది ఏమీలేదు. నేనిప్పటికిప్పుడు కూచోవచ్చు.

భారతీయులలో ప్రతి ఒక్కరూ గర్వంగా భావించే ఉజ్వల గతం గురించి చర్చించడానికి నేనిక్కడికి రాలేదు. నేనిక్కడికి మన విషపూరితమైన వర్తమానం గురించి మాట్లాడడానికి వచ్చాను.

నన్నిక్కడ ఆధ్యాత్మికత గురించి మాట్లాడడానికి ఆహ్వానించారు. అయితే ఈ ఆధ్యాత్మికత అనే మాటతో మనం గందరగోళానికి గురి కావద్దు. ఎందుకంటే, ఒకే పేరు గల ఇద్దరు మనుషులూ ఉండవచ్చు. ఆ ఇద్దరూ పూర్తిగా భిన్నమైన మనుషులూ కావచ్చు. రామచరిత మానస్ అనే గ్రంథాన్ని తులసిదాస్ రాశాడు. రామాయణం ఆధారంగా రామానందసాగర్ ఒక టెలివిజన్ చిత్రం తయారు చేశాడు. రెండిటికీ రామాయణమే మూలం. కానీ, తులసిదాస్‌నూ, రామానందసాగర్‌నూ సమానంగా చూడడం అంత ఉచితమని నేను అనుకోను.

రామచరిత మానస్ రాసినప్పుడు తులసిదాస్‌పై సాంఘిక బహిష్కరణ విధించారు. అంత పవిత్రమైన గ్రంథాన్ని అవధీ లాంటి మామూలు ప్రజల భాషలో రాసి అవమానిస్తాడా అని ఆయన మీద విరుచుకుపడ్డారు.

మతఛాందస వాదులు ఏ మాటలు మాట్లాడినా, ఏ రంగులో ఉన్నా, ఏ మతానికి చెందినా, ఏ సమూహానికి చెందినా అంతా ఒక్కలాగే ఉండడం చూసి నాకు ఆశ్చర్యం కలుగుతుంది.

1789లో షా అబ్దుల్ ఖాదర్ అనే ఒక పెద్ద మనిషి ఈ నగరం (ఢిల్లీ)లోనే మొట్టమొదటి సారి ఖురాన్‌ను ఉర్దూలోకి అనువాదం చేశాడు.

ఆ కాలంలో అధికారం చెలాయిస్తున్న ఉలేమాలందరూ ఆయన మీద ఫత్వా విడుదల చేశారు. పవిత్ర గ్రంథాన్ని అలగా జనం భాషలోకి అనువాదం చేయడం దైవ ద్రోహం అన్నారు.

రామచరిత మానస్ రాసి బహిష్కరణకు గురైన తర్వాత తులసీదాస్ నాలుగు పాదాల పద్యం ఒకటి రాశాడు.

"ధుత్ కహో అవధుత్ కహో రాజ్ పుత్ కహో కి జులావా కహు కోహూకి బేటీ సే బేటా నా బియాహబ్ కోహూకి జాత్ బిగాడ్ నా చాహు మాంగ్ కే ఖైబో మహజిద్ మే రైబో లేబేకో ఏక్ నా దేబే కా దోహు"

మరొక వైపు రామాయణ టెలివిజన్ సీరియల్ తయారు చేసి రామానంద్ సాగర్ కోట్ల రూపాయలు ఆర్జించాడు.

నేనేమీ ఆయనను చిన్నబుచ్చడం లేదు. కానీ, ఈ మొత్తంలో ఆయన అట్టడుగు స్థాయిలో ఉన్నాడని మాత్రం చెప్పక తప్పదు.

మరొక ఉదాహరణ చెప్తాను. బహుశా అది మరింత ప్రత్యక్షమైనదీ, మరింత ఉచితమైనదీ కావచ్చు.

గౌతముడు రాజాంతపురాన్ని వదిలి అడవిలోకి వెళ్ళింది సత్యాన్ని అన్వేషించడానికి. కానీ ఇవాళ్టి రోజుల్లో మీరు చూస్తే ఈ ఆధునిక కాలపు గురువులు అడవుల్లో నుంచి బయటకు వచ్చి రాజప్రసాదాలలో చేరిపోతున్నారు. వీళ్ళు పూర్తిగా ప్రతికూల దిశలో నడుస్తున్నారు. కనుక గౌతముడు గురించీ, వీళ్ళ గురించీ ఒకేలాగా మాట్లాడలేం. అందువల్ల భారతీయులందరికీ ప్రియమైన, గౌరవనీయమైన పేర్ల వెనుక దాక్కొన విషయాలు మాట్లాడాలి.

నన్నిక్కడ మాట్లాడమని ఆహ్వానించినపుడు నేను నాస్తికుడిని కదా, ఎటువంటి పరిస్థితుల్లోనైనా హేతుబద్ధంగా ఉండడానికి ప్రయత్నిస్తాను కదా, అందుకే నన్నిక్కడకు పిలిచారా అనుకున్నాను.

కానీ హఠాత్తుగా నాకు ఇంకో విషయం తట్టింది. ఆధునిక కాలపు గురువులకూ, నాకూ ఒక సమాన గుణం ఉంది.

నేను సినిమాల్లో పనిచేస్తాను. వాళ్ళకూ నాకూ ఉమ్మడి అంశం ఏమిటంటే మేమిద్దరమూ కూడా కలలు అమ్ముతాం. ఇద్దరమూ కూడా భ్రమలను సృష్టిస్తాం. ఇద్దరమూ విగ్రహాలను తయారు చేస్తాం. ఒక చిన్న తేడా మాత్రం ఉంది. మూడు గంటలు గడవగానే మా కలలు అమ్మకం ఆపేసి శుభం అని కార్డు వేసి వాస్తవికతలోకి వెళ్ళిపోండి అని జనాన్ని పంపించేస్తాం. అయితే ఈ గురువులు మాత్రం అలా ఎప్పటికీ పంపరు.

కనుక ఇక్కడ ఇవాళ ప్రపంచపు సూపర్ మార్కెట్లో ఒక అమ్మకపు వస్తువుగా మారిపోయిన ఆధ్యాత్మికత గురించి మాట్లాడడానికే నేనిక్కడ నిలబడ్డానని స్పష్టం చేయదలిచాను. ఇవాళ ప్రపంచంలో మూడు పెద్ద భారీ వ్యాపార వస్తువులు ఉన్నాయి. యుద్ధ ఆయుధాలు, మాదకద్రవ్యాలు, ఆధ్యాత్మికత. అయితే ఆయుధాలలోనూ, మాదకద్రవ్యాలలోనూ మీరు ఎంతో కొంత చేయాలి. ఏదో ఒకటి ఇవ్వాలి. తేడా ఏమంటే ఆధ్యాత్మికతలో మాత్రం మీరేమీ ఇవ్వనక్కరలేదు.

ఈ సూపర్ మార్కెట్‌లో మీకు అడిగిన వెంటనే నిర్వాణం దొరుకుతుంది. మెయిల్‌లో మీకు మోక్షం చేరుతుంది. ఆత్మ సాక్షాత్కారంలో క్రాష్ కోర్సు ఉంటుంది. నాలుగు సులభ పాఠాలలో విశ్వచైతన్యం అందుతుంది.

ఈ ఆధ్యాత్మిక గురువుల సూపర్ మార్కెట్‌కు ప్రపంచ వ్యాప్తంగా గొలుసు దుకాణాలు ఉన్నాయి. ఆ దుకాణాలలో అశాంతి నిండిన ఉన్నత వర్గాలూ, సంపన్న వర్గాలూ ఆధ్యాత్మికత ఫాస్ట్ ఫుడ్ కొనుక్కుని తింటూనే ఉంటాయి. నేనిప్పుడు ఈ ఆధ్యాత్మికత గురించి మాట్లాడదలిచాను.

ప్లేటో సంభాషణల్లో ఆయన చాలా విలువైన విషయాలు ఎన్నో చెప్పాడు. వాటిలో ఒకటి ఏమంటే, 'మీరు ఏదైనా చర్చ ప్రారంభించే ముందు మీరు వాడుతున్న పదాలు అర్థం ఏమిటో నిర్ణయించుకోండి' అని.

మరి మనం కూడా ఇప్పుడు ఈ ఆధ్యాత్మికత అనే పదం అర్థం ఏమిటో నిర్ణయించుకుందాం.

ఆ పదానికి అన్ని మతాలనూ, కులాలనూ, మతాలనూ, జాతులనూ అధిగమించి సంపూర్ణంగా మానవజాతి పట్ల ప్రేమ అనే అర్థం ఉంటుందా? అలా ఉంటే నాకేమీ సమస్య లేదు.

కాకపోతే, దాన్ని నేను ఆధ్యాత్మికతా అనే బదులు మానవత అంటాను. లేదా, దానికి అర్థం మొక్కలనూ, చెట్లనూ, కొండలనూ, సముద్రాలనూ, నదులనూ, జంతువులనూ ప్రేమగా చూడడం అనా? అంటే, మానవేతర ప్రపంచం పట్ల దయ కలిగి ఉండడమనా? ఒకవేళ అదయినా నాకేమీ అభ్యంతరం లేదు. కాకపోతే దాన్ని నేను ఆధ్యాత్మికత అనను. పర్యావరణ స్పృహ అంటాను. లేదా, వివాహం, మాతృత్వం, పితృత్వం, లలిత కళలు, న్యాయవ్యవస్థ, భావప్రకటనా స్వేచ్ఛ వంటి సామాజిక సంస్థలను హృదయపూర్వకంగా గౌరవించడమే ఆధ్యాత్మికత అనే మాటకు అర్థమా? అయ్యా, అప్పుడు కూడా నాకేమీ సమస్య లేదు. అసలు నాకు అనంగీకారం తెలిపే అవకాశమే లేదు.

కానీ, నేను దాన్ని పౌర బాధ్యత అంటాను. లేదూ ఆధ్యాత్మికత అంటే మీ లోకంలోకి మీరు వెళ్ళిపోయి, మీ సొంత జీవితపు అర్థం ఏమిటో అన్వేషించే ప్రయత్నం చేయడమా? దానికి ఎవరు అడ్డు చెపుతారు? కానీ దాన్ని నేను ఆత్మపరిశీలన, ఆత్మ పరీక్ష అనుకుంటాను.లేదూ ఆధ్యాత్మికత అంటే యోగం అని అర్థం చెపుతున్నారా? గౌరవనీయుడైన పతంజలి యోగ శాస్త్రానికి మనం కృతజ్ఞతలు చెప్పాలి. ఆయన యోగం, యమ, యతమ, ఆసన, ప్రాణాయామ వంటి వివరాలు ఎన్నో మనకందించాడు.

వాటికి మనం ఇవ్వాళ ఏ పేరైన పెట్టుకోవచ్చు. కానీ ప్రాణాయామం చేస్తే చాలా బాగుంటుంది. దాన్ని నేను ఆరోగ్య పరిరక్షణ, శారీరక దృఢత్వం అంటాను. ఇదంతా పదాల గారడీగా కనిపిస్తుందా?

ఒకవేళ ఇదే ఆధ్యాత్మికత అయితే ఇక చర్చకు అవకాశమేముంది? నేను వాడిన పదాలూ,అర్థాలూ అన్నీ కూడా సంపూర్ణంగా గౌరవించదగినవి. ఆమోదించదగినవి. వాటిలో అమూర్తమైనదేదీ లేదు. మన చూపులకు అందనిదేది లేదు. మరి ఆధ్యాత్మికత అనే మాట పట్టుకుని ఎందుకంతగా వేళ్ళాడుతున్నారు? నేను చెప్పిన మాటలలో వ్యక్తం కాని ఏ భావాన్ని ఈ ఆధ్యాత్మికత అనే మాట సూచిస్తోంది? ఆలోచించండి...

నేను చెప్పినవి కాకుండా ఇంకా ఏమైనా ఉందా? ఉన్నట్టయితే అది ఏమిటి? ఆ మాట వాడినంత మాత్రాన నీకు వచ్చిన సమస్య ఏమిటి అని ఎవరైనా నన్ను ఎదురు ప్రశ్నించవచ్చు. ఆ మాటను మార్చమనీ, ఒదిలేయమనీ, పారేయ్యమనీ, దానికి కాలం చెల్లిందనీ అంటున్నాను. ఎందుకు? నా అభ్యంతరం ఏమిటో చెపుతాను. ఆధ్యాత్మికత అంటే అర్థాలు నేను చెప్పినవే అయితే చర్చకు అవకాశమే లేదు. కానీ నన్ను ఇబ్బంది పెట్టే అంశం మరొకటి ఉంది. ఏ నిఘంటువు అయినా తెరిచి చూడండి. ఆధ్యాత్మికత అనే మాట ఆత్మ అనే మాట నుంచి పుట్టింది.

మానవజాతికి ఈ భూగోళం గుండ్రంగా ఉందా, బల్లపరుపుగా ఉందా తెలియనప్పుడు మనుషులు తమను తాము రెండు అంశాల సమ్మేళనంగా ఊహించుకున్నారు. ఒకటి శరీరం... మరొకటి ఆత్మ. శరీరం అనేది తాత్కాలికమనీ, అది మరణిస్తుందనీ, కానీ ఆత్మ అనేది ఎన్నటికీ నాశనం లేనిదని ఊహించుకున్నారు. మీ శరీరం లోపల మీకొక కాలేయం ఉంది. ఒక గుండె ఉంది. పేగుల చుట్ట ఉంది. ఒక మెదడు ఉంది. ఈ మెదడు అనేది శరీరంలో భాగం కనుక, మనస్సు అనేది మెదడు వల్ల తయారవుతున్నది కనుక, ఇవన్నీ తక్కువ జాతివే అని వాళ్ళనుకున్నారు.

శరీరంతో పాటు చివరికి మెదడు కూడా చచ్చిపోతుందని వాళ్ళు తెలుసుకున్నారు. కానీ, భయం లేదు. మీరు ఎప్పటికీ చచ్చిపోరు. ఎందుకంటే, మీరంటే మీ ఆత్మ. ఆ ఆత్మ ఒక అత్యున్నత చైతన్యంతో ఎల్లకాలానికి నిలిచి ఉంటుంది. మీకు వచ్చే సమస్యలన్నీ మీ మనస్సు చెప్పే మాటలు వినడం వల్ల వస్తున్నాయి. మనస్సు చెప్పే మాటలను వినడం మానెయ్యండి. ఆత్మ చెప్పే మాటలు వినండి. ఆ అత్యున్నత చైతన్యానికి విశ్వ సత్యం అవగాహనలో ఉంటుంది..... ఇదీ కథ.

-------

నిజం చెప్పాలంటే ఆధ్యాత్మిక దృష్టి ఉన్న, మత దృష్టి ఉన్న ప్రజల పట్ల నాకు చాలా గౌరవం ఉంది. వాళ్ళు మంచి వాళ్ళు. ఒక కారణం కూడా చెప్పాలి.

ప్రతి ఉద్వేగానికీ, ప్రతి అనుభూతికీ ఉన్నట్టుగానే దీనికి కూడా ఒక పరిమితి ఉంది. ఎవరైనా ఒక అంశం చూడగలరు.

ఆ తర్వాత చూడలేరు. ఒక అంశం వరకు వినగలరు. ఆ తర్వాత ఏ శబ్దాన్నీ గ్రహించలేరు. ఒకానొక సమయం వరకు దుఃఖించగలరు. క్రమంగా ఆ దుఃఖాన్ని అధిగమిస్తారు. ఒకానొక స్థితి వరకే సంతోషాన్ని అనుభవించగలరు. ఆ తర్వాత సంతోషం కూడా అయిపోతుంది.

సరిగ్గా అట్లాగే, ఎవరికైనా మంచితనానికి కూడా ఒక నిర్మితమైన శక్తే ఉంటుంది. మీరు ఒక స్థాయి వరకే మంచి వాళ్ళుగా ఉండగలరు. మనిషిలో ఈ మంచితనపు సామర్థ్యం సగటున పది యూనిట్లు ఉంటుందనుకుంటే ఆ మంచితనపు సామర్థ్యం మొత్తాన్ని... అటు మసీదుకు వెళ్ళి రోజుకు ఐదు సార్లు ప్రార్థనలు చేసే వారైనా, ఇటు గుడికి వెళ్ళో, లేదా గురువు పాదాల దగ్గరో కూచూనే వాళ్లయినా... పూర్తిగా ఖర్చు పెట్టేస్తున్నారని నాకనిపిస్తుంది. అదంతా కూడా అనుత్పాదమైన పద్ధతిలో ఖర్చు పెడుతున్నారనిపిస్తుంది.

(అంటే మానవుడికి ఉపయోగపడే వాటిని ఉత్పత్తి చేయని వ్యర్థమైన రీతిలో ఖర్చు పెడుతున్నారు)

నేనెక్కడా ప్రార్థనలు చేయను. నేను ఏ గురువు దగ్గరకీ వెళ్లను. మసీదుకో, గుడికో, చర్చికో వెళ్లను. అప్పుడు నా మంచితనపు సామర్థ్యాన్ని నేను ఏం చేస్తాను? బహుశా ఆ మంచితనపు సామర్థ్యంతో నేను మరొకరికి సాయపడతాను. మరొకరికి తిండి పెడతాను. మరొకరికి ఆశ్రయం ఇస్తాను.

మనుషులు తమలో ఉన్న మంచితనపు సామర్థ్యాన్ని.. పూజలో, ప్రార్థనలో, మత విగ్రహాలను ఆరాధించడంలో , ఆధ్యాత్మిక గురువులను కొలవడంలో...ఇలా ఖర్చు పెట్టే బదులు, ఆ మంచితనాన్ని మిగుల్చుకుని దాన్ని మరొకందుకు వాడితే వాళ్ళకు నా అభినందనలు.

(సి.నా.రె గారు అన్నట్లు "పరుల మేలు కొరకు పాటు పడని నరుల బ్రతుకు దేనికని.... మూగ నేలకు నీరందివ్వని వాగు పరుగు దేనికనీ.....)

మతానికి చెందిన మనుషులు పట్ల... ఇటువంటి భావాలు ఉన్నప్పుడు..... నాకు కబీర్ మీదనో, గౌతముడి మీదనో అంత గౌరవం ఎలా ఉందని మీరు అడగవచ్చు. వాళ్ళను నేనెందుకు గౌరవిస్తానో చెపుతాను. వాళ్ళందరూ మానవ నాగరికతా చరిత్రలో మానవత్వం వైపు మనుషుల ఆలోచనలను మల్లించడంలో గొప్ప దోహదం చేసినవాళ్ళు.

చరిత్రలో వేరు వేరు కాలాల్లో, వేరు వేరు పరిస్థితులలో వాళ్ళు జీవించారు. వాళ్ళందరి మధ్య ఒకే ఉమ్మడి సూత్రం ఉంది. వాళ్ళు అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడ్డారు. "వాళ్ళు అట్టడుగు ప్రజల కోసం పోరాడారు. పాలకులు ఎవరైనా వారు చక్రవర్తులైనా, సామ్రాజ్యవాదులైనా వ్యతిరేకంగా పోరాడారు."

కబీర్ ఫిరోజ్ తుగ్లక్ మతోన్మాద రాజ్య ఆధిపత్యాన్ని ఎదుర్కొని పోరాడాడు. నాకు ఆశ్చర్యం కలిగించేదీ, నా అనుమానాలను నిజం చేసేది ఏమంటే "ఇవాళ తమను తాము మతాధిపతులమని చెప్పుకునే వాళ్ళు, విశ్వసత్యం తమకు మాత్రమే గ్రహింపుకు వచ్చిందని అనేవాళ్ళు... ఒక్కరు కూడా అధికారానికి వ్యతిరేకంగా నిలబడడం లేదు.

పాలకవర్గాలకూ, సంపన్న వర్గాలకూ వ్యతిరేకంగా వీళ్లలో ఒక్కరు కూడా గొంతెత్తడం లేదు. వీళ్ళు ధర్మం చేస్తారు. నిజమే. కానీ, అధిపత్యవ్యవస్థ, అధికారంలో ఉన్నవారు అంగీకరించినంత వరకే ఆ ధర్మం సాగుతుంది. ఇవాళ్టికి దళితులకు ప్రవేశం లేని దేవాలయాలలోకి వారిని నడిపించుకు వెళ్ళగలిగిన ఆధ్యాత్మిక గురువులు ఎవరైనా ఉన్నారా... అని నా ప్రశ్న.

"దురాక్రమణదారులకూ, బడా కాంట్రాక్టర్లకూ వ్యతిరేకంగా పోరాడుతున్న ఆదివాసుల హక్కుల కొరకు నిలబడే ఆధ్యాత్మిక గురువులు ఎవరైనా ఉన్నారా" అని నా ప్రశ్న.

"గుజరాత్ మారణకాండకు బలి అయిన వారికోసం మాట్లాడిన, బాధితుల సహాయ శిబిరానికి వెళ్ళిన గురువు ఎవరైనా ఉన్నారా" అని నా ప్రశ్న.

ధనికులకు ఉచ్ఛ్వాసనిశ్వాసలు బోధించినంత మాత్రాన సరిపోదు. అవి కేవలం సంపన్నుల వినోద క్రీడ. ఇది కుటిలవాదుల మేలి ముసుగు. ఇది దుర్మార్గమైన వంచన.

ఈ దుర్మార్గమైన వంచనను మీరు ఏ నిఘంటువులో చూసినా ఆధ్యాత్మికత అని పిలవలేరు. దానికి ఉన్నది ఒకే ఒక్క మాట (పర్యాయపదం) బూటకం.

ఉంటాను. మీకందరికీ నా అభినందనలు మరియు కృతజ్ఞతలు.... ❑

వ్యాసం సేకరణ : **మలసాని శ్రీనివాస్,** కాకినాడ.

# బాలల శ్రమతో బతకాలా?



**కె. శాంతారావు**

బాలకార్మిక వ్యవస్థపై కరోనా పిడుగు పడింది. అసలే పాలకుల విధానాలు బాల కార్మిక వ్యవస్థను కోలుకోలేని విధంగా దెబ్బ తీస్తున్నాయని మనకు తెలుసు. ఇప్పుడు ఈ కరోనా దెబ్బ గోరుచుట్టుపై రోకటిపోటులా పరిణమించింది.

కరోనా కాలంలో ఆర్థిక అంతరాలు తీవ్రంగా పెరుగుతున్నాయని సర్వేలు చెపుతున్నాయి. సంపన్నుల ఆస్తులు మరింతగా పెరుగుతున్నాయే తప్ప తరగడం లేదు. ఫలితంగా కోట్లాది మంది ప్రజలు పేదరికంలోకి వేగంగా జారిపోతున్నారు. మన కండ్లముందే చాలా మంది ఉపాధి లేక పస్తులతో ఆకలి చావులకు గాని, అప్పులతో ఆత్మహత్యలకు గాని పాల్పడటం గమనిస్తున్నాం. ఇదో దుర్భర దశ.

పాలకులు తమ చర్యలతో ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దాలి. బతుకు పట్ల భరోసా ఇవ్వాలి. కానీ ప్రధాని మోడీ పదే పదే చెప్పే ఆత్మనిర్భర్ వంటి మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయని అనుభవం చెపుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా పదహారు కోట్ల మంది బాల కార్మికులున్నారు. మన దేశంలో కోటిమందికి పైగా ఉన్నారు. ఐదేండ్ల నుంచి 14 ఏండ్లలోపు పనిలో ఉండేవారిని బాలకార్మికులు అంటారు. అసలు బడిబయట ఉండి చదువుకోని వారందరూ బాల కార్మికులేనని యునిసెఫ్ వంటి సంస్థలు మొత్తుకుంటాయి. ఈ లెక్కన చూస్తే ఈ కరోనా కాలంలో బాల కార్మికుల సంఖ్య ఎంతగా పెరుగుతున్నదో లెక్కకు అందడం లేదు.

వ్యవసాయం, చేతివృత్తులు, నిర్మాణ రంగం, ఇటుక బట్టీలు వంటి సాధారణ పనులే కాకుండా, గనులు, క్వారీలు, నాపరాళ్ళు, పత్తివిత్తన క్షేత్రాలు, గాజు, రసాయనాలు, ప్రేలుడు పదార్థాల వంటి ప్రమాదభరిత రంగాల్లో సైతం ప్రాణాలు ఫణంగా పెట్టి బాలలు పనిచేస్తున్నారు. అంతే కాకుండా గంజాయి, నల్లమందు, సారా బట్టీలు, అక్రమ రవాణా (లైంగిక వ్యాపారం) వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో కూడా బాలల్ని పెద్దఎత్తున వినియోగిస్తున్నారు. బాలల పట్ల కనీస జాలి, దయ కనికరం లేని దుర్మార్గులే ఇలాంటి ఘాతుక పనులకు ఒడిగడతారు.

మనదేశంలో 37శాతం మంది ప్రజానీకం వలసజీవులే. బతుకుతెరువు కోసమే వారు వలసబాట పడతారు. వారిలో అత్యధికులు పేదలని వేరుగా చెప్పక్కర్లేదు. కరోనా కారణంగా వీరి ఉపాధి నేడు కనుమరుగైపోయింది. కొందరు విధిలేక సొంత ఊర్లకు చేరుకున్నారు. వీరితో పాటు వీరి పిల్లలు... అటు ఉపాధి పోవడం, ఇటు తిరుగు వలస పట్టడం ఏదైతేనేమి బాలలు మాత్రం బడికి దూరమయ్యారు. తాత్కాలికంగా బడులు మూసినా, చాలా మంది బాలలకు బడులు శాశ్వతంగా దూరమయ్యే దుస్థితి ఏర్పడింది.

కరోనా వలన దేశ దేశాల్లో ఆర్థిక వ్యవస్థలు శీఘ్రగతిన పతనం కావడంతో అంతిమంగా ఆ భారం అంతే వేగంగా బాలలపై పడుతున్నది. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థ కొమ్ముకాసే ఆర్థికవేత్తలు అప్పుడే సన్నాయి నొక్కులు నొక్కడం ప్రారంభించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు గతంలో రూపొందించిన చట్టాల పట్టును సడలించాలని, ఆ నిషేధాలను ఎత్తివేయాలని, లేకుంటే ముందుకు పోలేమని వితండ వాదనలు చేస్తున్నారు. అంటే వీరి దృష్టిలో బాలల శ్రమతో ప్రపంచం బతకాలన్నమాట. బాలల హక్కుల్ని గప్‌చిప్‌గా తుంగలో తొక్కేయాలని కోరుకుంటున్నారు. ఇంతకన్నా అమానుషం ఏం ఉంటుంది?

అసలు ఎక్కడైనా, ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా పేదరికం పెరుగుతున్న కొద్దీ ఆ దేశంలో బాలకార్మికులు పెరుగుతారు. మార్క్సిస్టు ఆర్థికవేత్తలే కాదు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కంకణం కట్టుకున్న నోబుల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి వంటి వారు కూడా చెపుతున్న వాస్తవం ఇది. అంతెందుకు ఇంత కరోనా కష్టకాలంలో కూడా అంబానీ, అదానీల ఆస్తులు ఎన్నోరెట్లు పెరిగాయి తప్ప తరగలేదు. అయినా పిల్లలను బాల కార్మికులుగా మార్చేందుకు తప్పుడు సిద్ధాంతాలతో ప్రజల్ని ప్రభావితం చేయాలని ఈ ఆర్థికవేత్తలు తాపత్రయ పడుతున్నారు.

కాగా, కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఈ కరోనా కష్ట కాలంలోనే ఆదరాబాదరగా నూతన జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ) తీసుకొచ్చిన విషయం విదితమే. మొత్తం భారతదేశ విద్యావ్యవస్థను కాషాయికరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ (మూడు సీలు) దిశగా మార్చేందుకు దీనిని తీసుకువచ్చారనే

విమర్శలు వెల్లువెత్తాయి. అందరి కంటే ముందుగా ఈ విద్యా విధానాన్ని ఈ ఏడాది నుంచే అమలు పరిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధమయింది. అంగన్‌వాడీలు రద్దయి ప్రాథమిక విద్యాబోధనతో కలుస్తాయి.

కరోనా కాలంలో అంగన్‌వాడీ పిల్లలు పౌష్టికాహారానికి, బడి పిల్లలు మధ్యాహ్నభోజనానికి దూరమయ్యారు. ఆ కాస్త సదుపాయాలు ఇక ముందుంటాయా? అనేది పెద్ద ప్రశ్నార్థకం. పైగా ప్రాథమిక బడుల దూరభారం పెరిగి డ్రాప్‌అవుట్స్ (మధ్యలో బడి మానేయడం) పెద్ద ఎత్తున పెరిగే అవకాశం ఉంటుంది. ఇది పరోక్షంగా బాలకార్మిక వ్యవస్థను పెంచి పోషించడమే అవుతుంది.

ఇలా ప్రతి రాష్ట్రంలో వేలాది అంగన్‌వాడీలు మూతబడితే పాఠశాల విద్యకు బాలల్ని సన్నద్ధం చేసే ప్రక్రియకు అంతరం ఏర్పడదా..? అందుకే అప్రమత్తంగా లేకపోతే ఒక తరం తరం బాలలు విద్యకు దూరంగా కొట్టుకుపోయే ప్రమాదం ఏర్పడుతుందని విశ్లేషకులు వాపోతున్నారు.

2025నాటికి బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలన్నది ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో ఒకటి. 2021 సంవత్సరాన్ని బాల కార్మిక నిర్మూలనా సంవత్సరంగా అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే ఇంత ఘోరం జరగడం మహావిషాదం. బాల్యం అంటే విరబూసే మానవ వనరుల భావి సంపద. బాల్యంపై ధ్వంస రచనకు పూనుకుంటే మన కాళ్ళు మనం నరుక్కోవడం కాక మరేమిటి? అందుకే పుడమిని, పర్యావరణాన్ని కాపాడు కోవడంతో సమాంతరంగా బాల్యాన్ని కాపాడుకోవాలనే నూతన ప్రజా ఉద్యమాలు పురుడు పోసుకుంటున్నాయి. ❑

## మార్క్సిజం నిలుస్తుంది, గెలుస్తుంది

**(5వ పేజీ తరువాయి)**

గురజాడ 1905లో చనిపోయాడు. కానీ మరి కొన్నాళ్ళు బతికి ఉంటే..? అన్నది ప్రశ్నగానే వుండిపోతుంది.

ఈ ప్రత్యేక సంచికలో మార్క్సిజం విశ్వరూపాన్ని, మార్క్సిస్టు సిద్ధాంతంలో యిమిడి వున్న అన్ని అంశాలను, లబ్ధప్రతిష్టులు రాసిన వ్యాసాల ద్వారా ప్రచురించారు. వారికి అభినందనలు. సంపాదకీయంలో కామ్రేడ్ వర్మ గారు పేర్కొన్నట్లు పెద్ద గ్రంథాలను చదవడం, వాటిలోని భావాలను అర్థం చేసుకోవడం తేలికైన పని కాదు. అటువంటి వారికి యీ సంచిక ఎంతగానో తోడ్పడుతుంది. 'కొండ అద్దమందు కొంచెమై వుండదా' అన్న సూక్తి ఈ సంచికకు పూర్తిగా అన్వయిస్తుంది. వర్మగారితో పాటు వారి సంపాదక సహచరులకు, సంచికలో వ్యాసాలు రాసిన అనుభవజ్ఞులైన రచయితలను నమోవాకాలు. మార్క్సిజం కనుమరుగవుతున్నదన్న వాదనను పూర్వపక్షం చేస్తున్నది ఈ సంచిక.

వకుళాభరణం వంశీ రాసిన Re-reading of Das Capital in 21st Century అనే మోనోగ్రాఫ్ నుంచి ఈ ఉటంకింపుతో నా ప్రసంగాన్ని ముగిస్తాను.

Marx capital is still absolutely relevant, and is infact, indispensable in making sense of the diverse capitalisms that have come about across the world, both in European and non-European societies. To the extent that Marx tried to theorize capitalism in the abstract that transcends the unique features of the English or European context, he offers us various insights and critiques about how to understand and intervene in societies beyond Europe. However, like any text, capital is also a partial account of the social world. This is true in a spatial sense (Europe Vs Non Europe) but also along multiple social dimentions. While the class dimension of societies and the class aspects of non-class dimensions such as gender, race and caste are explored brilliantly in this text, the non-class dimensions themselves need seperate attention both at our analytical and a practical level. Social change or transformation has to be envisioned and executed from a continued dialogue between thinkers focussing on these different dimentions and the ecological one. While a framework that can speak to the social dimensions is desirable, it is not clear to me that it is feasible to develop a single framework that can address on the different nuances of social change. To the extent that capitalist processes are unmistakably part of a vast majority of societies across the world, Marx Capital will speak to them more or less eloquently, limited only by the creativity of the thinkers and activists engaged in the project of social change. ❑

# కవిత్వం ఎప్పుడు ఎలా ఎందుకు ?



హెచ్చార్కె

బహుశా ప్రతి కవికీ చాల మొదట్లోనే వొచ్చే ప్రశ్నలివి. రాకపోతే రావలసిన ప్రశ్నలు. ఈ ప్రశ్నలకు... నాకు నేను ఇచ్చుకున్న జవాబులు మీకూ ఆసక్తి కలిగిస్తాయి.

నా లోనికి నేను చూసుకున్నట్టవుతుంది, మీకూ పనికొస్తుందని.. ఒక రకం సిరీస్ రాస్తానిక్కడ.

నేను ఎక్కువ శ్రమ తీసుకోకుండా మీకూ ఎక్కువ శ్రమ ఇవ్వకుండా చిన్న చిన్న వ్యాసాలుగానే ఈ వివేచన చేస్తాను. వీటి కోసం ముందస్తు ప్రణాళికంటూ ఏమీ లేదు. ఎప్పటికప్పుడు... నాకు ముఖ్యం అనిపించిన సంగతులే ఇక్కడ రాస్తాను. ముందస్తుగా ఏ ప్రణాళిక లేదు కాబట్టి నా ఇష్టాలతో పాటు, మీ ఫీడ్ బ్యాక్ కూడా ఈ రచనను నడిపిస్తుంది. ఒకరకంగా ఇది మనం కలిసి రాస్తున్నట్టు.

ఉదాహరణకు కవిత్వం ఎప్పుడు రాయాలి?

నా మట్టుకు నేను... నా మనసును తొలుస్తున్న దానికి కవిత్వంలో తప్ప మరొక ప్రక్రియ కుదరదు అనుకున్నప్పుడే కవిత్వం రాయాలని అనుకుంటాను.

మనః కల్లోలాన్ని వ్యాసంలో చెప్పగలననుకుంటే వ్యాసం రాయడమే మంచి పని. అంతెందుకు... ఇప్పుడు నేను చేస్తున్న పని కథలో చెయ్యడం కుదరదు, కవిత్వంలోనూ కుదరదు. వ్యాసమే దీనికి బాగా నప్పుతుంది. ఎందుకంటే, ఇందులో ఊహించి చెప్పేవాటి కన్న నాకు బాగా తెలుసు అని నేను అనుకున్నవాటికే... అంటే, నా దృష్టిలోని 'ఫ్యాక్ట్స్'కే ఇందులో ప్రాధాన్యం ఉంటుంది. ఉండాలి. పాఠకుడి ఊహలకు వొదిలేసేవి ఏవీ ఇందులో ఉండవు. స్పష్టంగా చెప్పడం ముఖ్యం. ఇందులోని విషయాలు పాఠకుడి జీవితానుభవాలను పోలి ఉండాల్సిన పని కూడా లేదు. పోలి ఉండకపోతేనే మంచిది. అసలు, ఇవి పాఠకుడికి తెలియని విషయాలైతేనే రచయితగా నాకు మంచిది. ఎందుకంటే పాఠకుడికి తెలిసిన వాటిని అతడు/ఆమె చదవరు కదా?!

కథ అలా కాదు. అవి పాఠకుడికి తెలిసిన అనుభవాలే కావొచ్చు. తెలియనివి చెబితే ఫుట్‌నోట్స్ ఇవ్వాలి. తెలిసిన వాస్తవాల నుంచి కొత్త పాఠాలు తీసేలా చెబితే కథ బాగుంటుంది. అరే, ఇది నేను రోజూ చూస్తున్నదే, నాకు తెలిసిందే ఆ బస్టాండు, బస్టాండులో పిల్ల, పిల్లాడు మాట్లాడుకోడం... కాని, కథలో... వాళ్ల మాటలలోంచి రచయిత తీసే పాఠాలు భలే బాగున్నాయే?! అనిపించినప్పుడు కాస్త గిలిగింత పెడుతుంది. ఆ గిలిగింత కోసమే కదా, పాఠకులు కథ చదువుతారు?! అలాగే కొన్ని అజ్ఞాతాల్ని జ్ఞాతం చేయడం కూడా కథకు బాగుంటుంది. జోసెఫ్ కొన్రాడ్, జాక్ లండన్ కథల్లో... సముద్ర జీవితాలు మనలో చాల మందికి అజ్ఞాతాలే. కాని, చదివే కొద్దీ జ్ఞాతం అవుతాయి. గుహ లోపలకి... లోపలికి... వెళ్లి చూసినట్టు ఉంటుంది. విస్పష్టంగా కాక, అస్పష్టంగానే 'ఏదో' తెలిసినట్లయి కలిగే విచికిత్సాత్మక సంతోషమది.

కవిత్వం మరీ విభిన్నం. పాఠకుడికి తెలియని ఫ్యాక్ట్ చెప్పడం కవిత్వం పని కాదు. అందుకే ఫుట్ నోట్స్ కవిత్వానికి పెద్దగా నప్పవు. జీవితానుభవాల గ్రాఫిక్ వర్ణనా... దరిమిలా అజ్ఞాతం నుంచి జ్ఞాతానికి ప్రయాణం కాదు... కవిత్వం. చీకట్లో అగ్గిపుల్ల గీచినట్టు వావ్ అనిపించడం, మనస్సు ఉన్నట్టుండి విచ్చుకోడం జరగాలి. మనకేం జరుగుతున్నదో తెలీకుండా మనస్సు వెలగాలి. వెలగాలంటే, మనస్సులో అప్పటికే వెలగడానికి వీలయినది, కంబస్టిబుల్ పదార్థం... ఉండి ఉండాలి. ఇది దాదాపు మనుషులందరిలో ఉంటుంది. ఆ లోపలిది ఉన్నట్టుండి వెలిగి... అరే, నేనూ వెలుగుతానే, నేనూ ఒక అగ్గిపుల్లనే.. అని సంభ్రమాశ్చర్యాలు కలగాలి పాఠకుడికి. ఈ పని తాటాకు మంటలా కేవలం కొద్ది లైన్లలో జరగొచ్చు. ఒకసారి అంటుకున్నది చింత మొద్దులా అలా రాత్రంతా కాలుతుండొచ్చు. కాలాలి. రగలాలి. అదీ ముఖ్యం. కాసేపు మన ఆకలి, మన దప్పిక, మన ఇంకేదో నొప్పి మరుపున పడాలి. కవిత్వం కల్పించే ఆకలి, కవిత్వం కల్పించే దప్పికే, కవిత్వం కల్పించే నొప్పే అక్కడ ఉండాలి.

నీ వ్రాతతో నువ్వు పాఠకుడిని ఏం చేయదల్చుకున్నావో ముందుగా నీ అనుభవం/ఊహ నిన్ను ఆ పని చేసి ఉండాలి. అంటే, నీకు చాలా నొప్పి కలిగి, చాలా ఆకలేసి, చాలా దప్పికేసి ఉంటేనే... ఆ లోపలి భావనను మాత్రమే... నువ్వు పాఠకుడికి అందించగలుగుతావు. అలాంటి అనుభవమేదో నీ లోపల ఇంకిపోయి తిరిగి నిద్రలేచి, దాన్ని చూసి నీకే సంభ్రమాశ్చర్యం వేసి, ఆ మాట పక్క మనిషికి చెప్పకుండా ఉండలేక చెబుతావు చూడు... అదీ కవిత్వం. 'ఆం, ఏంటీ, నాకేం అర్థం కాలేదబ్బా,

కొంచెం వివరంగా చెప్పు' అంటే... తిరిగి... దాన్ని మరింకే రూపంలో నువ్వు చెప్పలేకపోతావు చూడు అదీ కవిత్వం. అందుకే, నేను కథను, వ్యాసాన్ని వీలయితే మరొకరికి చూపించి 'ప్రకటించాల'నుకుంటాను గాని, కవిత్వాన్ని అలా చేయలేను. కవిత్వం రాసింది బాగుంటే బాగుంది లేకుంటే లేదు. రిపేర్లు కుదరవు. ఉన్నదాన్ని చించేసి, దాన్ని దాదాపు మరిచిపోయి, ఇంకోటి రాయడమే జరుగుతుంది. తిరుగ రాసిన ప్రతిసారీ జరిగే పని అదే. అలా 'తిరుగ రాయడం' తప్పేం కాదు. కాని, ప్రతిసారీ నువ్వు రాసింది ఇంకో కవితే. మొదటిది కాదు. దేన్ని ఉంచుకుంటావో దేన్ని చించేస్తావో... నీ ఇష్టం. నా మట్టుకు నేను... రాసిన వర్షన్స్‌లో ఏది మెరుగైనదో వెంటనే నిర్ణయం తీసుకోను. పక్కన పడేసి. ఇంకేదో పనిలో లేదా ఇంకేదో వ్రాతలో పడి, తరువాతెప్పుడో, అందులో ఏ వర్షన్ నా వెంట పడుతుందో... దాన్ని మాత్రమే నాది అనుకుంటాను.

ఇలా చెప్పడమంటే... సద్యో గర్భ సంజాతమైనదే గొప్పది, చాల కాగితాల్ని నమిలి మింగినది తక్కువది అని చెప్పడం కాదు. నా వెంట పడినదే గొప్పది, వెంట పడనిది తక్కువది అని కాదు. ఇది మినిమమ్ టెస్ట్ మాత్రమే. నా వెంట పడనిది నా వంటి మరొక వ్యక్తి వెంట పడుతుందని నేను అనుకోలేను కదా?! కవిత మరొకరికి చేరనంతవరకు ఆ మరొకరు నేనే. కాదంటారా? ❑

(roadsgonowhere.blogspot.com సౌజన్యంతో..)

## అగ్నిహోత్రుడు అదృష్టదీపక్

**(10వ పేజీ తరువాయి)**

విజయంలోనే ప్రహేళికుడి విజయం కూడా ఉంటుంది. అతను ఓడిపోతే ఇతనూ ఓడిపోతాడు. పాఠకుడు తన ప్రయత్నాన్ని విరమించుకోకుండా కొనసాగింపచెయ్యడంలో నిర్వాహకుడి సామర్థ్యం ఉంటుంది. అంతిమంగా శోధకుణ్ణి శోధకుడి సామర్థ్యంతోనే తన మీద గెలిపించుకుని, ప్రహేళికుడు తాను గెలవాలి! ఇదంతా దీపక్ పదశోధనను పరిష్కరించుకుంటున్నప్పుడు నాకు కలిగిన అవగాహన. కాదు, దీపక్ పరోక్షంగా కల్పించిన అవగాహన. దీపక్‌కు మనుషులంటే ఎంత ఇష్టమో అక్షరాలూ, పదాలూ, భాష, ప్రయోగాలు అంత ఇష్టం. ఆయన పదాలకు పాలు తాపుతాడంటే ఒక్క రవ్వ కూడా అతిశయోక్తి లేదు. ఆ ప్రేమ ఎంతటిదంటే ఎవ్వరైనా తప్పులు రాశాడా, అపుడాయన పేరు మరొకటీ మరొకటీ కాదు, బారిక రావుడే !

దీపక్‌తో పోల్చదగిన emotional personality ఉండడం కష్టం. ఆయన ఒకొక్కరి దగ్గర ఒకొక్కలా ఉండే మనిషి కాదు. అందరి దగ్గర తనలానే ఉండేవాడు. దీపక్ ఇష్టాయిష్టాలు తారా స్థాయిలో ఉంటాయని అందరికీ తెలిసిందే. తన ప్రేమతో ఎంత ఉక్కిరిబిక్కిరి చేస్తాడో కోపం వస్తే అంతే తీవ్రతతో దాడి చేస్తాడు. రెండిటి మధ్య తేడా ఉండదు. స్నేహితులు, ప్రతిష్టులు, వ్యక్తిగత, సామాజిక జీవితంలో విలువలు పాటించనప్పుడు దీపక్ తీవ్ర అశాంతికి గురి అయ్యేవాడు. వాళ్లు తనకెంత ఇష్టులూ సన్నిహితులూ అయితే ఆ అశాంతి తీవ్రత అంత ఎక్కువగా ఉండడంలోనే దీపక్ వ్యక్తిత్వం ఉంది. ఆయన వాటిని అనేక మందిలా నాకెందుకు అని పట్టించుకోకుండా ఉండలేని ఒక దురదృష్ట దీపక్. అందువల్లనే ఆయన అదృష్టదీపక్.

ఇవన్నీ దీపక్ జీవించి ఉండగా దాచుకుని ఇప్పుడు చెబుతున్న అభిప్రాయాలు కాదు. వేదిక మీద నుంచి సభికులతో పాటు ఆయనతో సరాసరి పంచుకున్న విషయాలే. 'అడవి' సంకలనం 2008లో విజయవాడలో అవిష్కరించబడిప్పుడు దాన్ని సమీక్షించే అవకాశం నాకే ఇచ్చాడు. 2020 లో సప్తతికి తన అనుభవాలనూ ఆలోచనలనూ 'తెరచిన పుస్తకం' గా తెచ్చినపుడు కూడా విజయవాడలోనే సభలో దాన్ని నేనే సమీక్షించాను. ఇవన్నీ అప్పుడు చెప్పినవే. తను ఇష్టంగా స్వీకరించినవే !

2020 ఫిబ్రవరిలో కరోనాకు కొద్దిముందు జరిగిన మా పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్ స్థాపకులూ మా ఆచార్యులూ అయిన డా. రుద్రయ్యచౌదరి ఆఖరి స్మారకోపన్యాస వేళ రామచంద్రపురం లో ఆయన శిష్యులమైన దీపక్, జాన్‌సన్ చోరగుడి, నేనూ కలుసుకోవడమే దీపక్‌ను కలిసిన ఆఖరి సందర్భం అయ్యింది. అప్పుడు మా అందరికీ మరో గురువు, సూత్రధారీ జాస్తి దుర్గాప్రసాద్ గారింట్లో కూచున్నపుడు నా కోరిక మీద అనారోగ్య భారంతో కష్టంగానే అయినా ఇష్టంతో 'పదపదవే గీతమా' పాడాడు. దాన్ని వీడియో తీశాను నేను. అది రామచంద్రపురం. అక్కడ ఆ రోజున రుద్రయ్య చౌదరి ఉన్నారు. దుర్గాప్రసాద్ ఉన్నారు. దీపక్, జాన్‌సన్, కొప్పర్తి ఉన్నారు. వారితో పాటు మా సహాధ్యాయీ, నా సహచరీ, దీపక్‌తో చేసిన ప్రయాణంలో అన్ని పరిణామాలకూ సాక్షి, దీపక్ అమితంగా ఇష్టపడిన సుశీల కూడా ఉంది. కలయిక ఎక్కడ మొదలైందో అక్కడే ముగిసింది.

దీపక్ మరణంతో అభ్యుదయ కవిత్వోద్యమం దీర్ఘకాలం దాన్ని కాపు కాసిన వీరుణ్ణి కోల్పోయింది. నేను మిత్రుణ్ణీ, మార్గదర్శినీ కోల్పోయాను. అన్నిటినీ పుటం పెట్టే అగ్నిహోత్రం ఆరిపోయింది. ❑

# మానవ విజ్ఞాన ఖని "కమ్యూనిస్టు ప్రణాళిక"

రేకా చంద్ర శేఖర రావు



కమ్యూనిష్టు ప్రణాళిక లక్ష ప్రతులు ముద్రించడం చాలా సంతోషం కలిగించింది, తెలుగు ప్రజలలోకి విస్తృతంగా తీసుకుని వెళ్ళిన ఈ కృషికి కారణమైన అందరికీ అభినందనలు.

నేను చదివిన ప్రతిసారి కొత్తగా అనిపించే పుస్తకాలు మూడు.

1. మాక్సింగోర్కీ – అమ్మ
2. శ్రీశ్రీ– మహాప్రస్థానం

ఈ రెండూ చదివిన ప్రతిసారి కొన్ని కొత్త విషయాలు తెలుస్తూ వుంటాయి. అంటే ఆ పుస్తకాలు నిత్య ఉపాధ్యాయుడి పాత్ర నిర్వహిస్తుంటాయి. ఒక్కొక్కసారి చదివినప్పుడు ఈ విషయం నేను ఎందుకు ఇంతకుముందు గమనించలేదు అని అనిపిస్తుంది. మంచి ఉపాధ్యాయుడు పాత పాఠాన్ని కూడా విద్యార్థులకు కొత్తగా చెప్పగలుగుతాడు.

అలాటి గొప్ప ఉపాధ్యాయులు ఆ రెండు పుస్తకాలు. అవి పాఠకులను అలవోకగా ఇముడ్చుకోగలిగినవి, తమ ఆవృతంలోకి మనలను ఈడ్చుకుని వెళతాయి. ఒకటి అద్భుత నవల, రెండోది అద్భుత కవితా కావ్యం.

ఇక మూడోది కష్టమైన సిద్ధాంత పుస్తకం అయినా ఎంతో భావోద్వేగంతో కవితా శైలిని మించినదిగాను, విషయపరంగా మానవ విజ్ఞాన ఖని అనదగిన "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక", దీని రచయితలు ప్రపంచ శ్రామిక వర్గ మహోపాధ్యాయులు కారల్‌మార్క్స్– ఫ్రెడరిక్ ఎంగెల్స్‌లు.

ఈ పుస్తకం చదివిన ప్రతిసారి మన మదిని విశాలవంతం చేస్తూ వుంటుంది. ప్రతి సారి కొన్ని కొత్త విషయాలు మన దృష్టికి వస్తూ వుంటాయి. ఈ సారి పీకాక్ గాంధీగారి అనువాదంతో వచ్చిన ఈ పుస్తకం ఇదివరకటి వాటికంటే చాలా సరళంగా వుంది, అర్థవంతంగా వుంది.

ప్రస్తుత పుస్తకాన్ని నాలుగు భాగాలుగా విభజించవచ్చును.

1. ప్రచురణకర్తలు మరియు రచయిత ముందు మాటలు. (పేజి 3 నుండి 6 పేజి వరకు)
2. ఎంగెల్స్ రాసిన "కమ్యూనిజం మూల సూత్రాలు " (పేజి 7 –పేజి 32)
3. ఎంగెల్స్ రాసిన ముందుమాటలు ఏడు (పేజి 33– పేజి 53)
4. కమ్యూనిష్టు పార్టీ ప్రణాళిక (పేజి 54 – పేజి 96)

ప్రచురణకర్తలు తమ ముందు మాటలో

"మార్క్సిజం అంటే గత అనుభవాల సారం. దాన్ని గ్రహించ గలిగితే ప్రస్తుత సమస్యలను ఎదుర్కోడానికి కావలసిన శిక్షణ మనకు లభిస్తుంది.

ఆ పునాదితో కొత్తగా వచ్చిపడే సమస్యల మూలాలను గ్రహించవచ్చు. ఆ సమస్యలను సృజనాత్మకంగా ఎదుర్కోవచ్చు." అనే మంచి విషయాన్ని– మార్క్సిజం సృజనాత్మకమైనదని, మన సమస్యలను పరిష్కరించగలిగిన శక్తి వుందని చక్కగా చెప్పారు (పేజి –4)

అనువాదకుడు తన ముందు మాటలో "కొత్త పాఠకులకు తెలుగు ప్రణాళిక ఎందుకింత జఠిలంగా ఉంది? దానికి కారణం భావనల్లో వున్న క్లిష్టతా ? అనువాదం తెచ్చి పెట్టిన క్లిష్టతా? రెండోదే ప్రధానం అన్నది నా అవగాహన." (పేజి–5) అని చెప్పిన మాట తనకు వర్తించకూడదని ఈ ప్రణాళిక అనువాదంలో చాలా సరళత్వాన్ని పాటించారు, అందుకు పీకాక్ గాంధీ గారు అభినందనీయులు.

రెండవ భాగంలోని కమ్యూనిజం మూల సూత్రాలు – ఎంగెల్స్ రాసినవి. వీటిని చదవడం నేను ఇదే ప్రథమం. బహుశా ఇది వరకు ఏ కమ్యూనిష్టు ప్రణాళిక ముద్రణలోనూ నేను చూడలేదు.

ఈ రచన నన్ను అమితంగా ఆకర్షించింది. అందులోని భావనలు (concepts) కమ్యూనిష్టు ప్రణాళికకు చిత్తు పాయింట్స్ (Rough points) వంటివి. వాస్తవానికి అవి చిత్తు పాయింట్లు కాదు, చాలా మేలిమి ముత్యాల వంటివి. వాటిలో కొన్ని చూద్దాం!

"శ్రామిక వర్గ విమోచనకు అవసరమైన పరిస్థితుల గురించి తెలియచేసే సిద్ధాంతం కమ్యూనిజం" (పేజి –8)

"కాని శ్రామికుడు మొత్తంగా సొంత ఆస్తి రద్దయితే తప్ప తనని తాను విముక్తి చేసుకోలేడు" (12 పేజి)

"అన్నదమ్ములకీ మిగతా వేలు విడిచిన బంధువులకూ వారసత్వపు హక్కు రద్దు" (పేజి–22)

పై దాని అర్థం ఒకరి ఆస్తి వారి సంతానానికి, సంతానం పిల్లలకు మాత్రమే వస్తుంది. అతడు చనిపోతే భార్యా పిల్లలు లేకపోతే అతడి అన్నదమ్ములకు, అక్క– చెల్లెళ్ళకు, బావ మరదులు

తదితర వేలు విడిచిన బంధువులకు దక్కదు, ఆ ఆస్తి జాతీయం కాబడుతుంది. ఎంతటి చక్కటి భావన.

ఈ ఫ్యూడల్–పెట్టుబడిదారీ సమాజంలో కుళ్ళు, కుతంత్రాలు, కక్షలు , కార్పణ్యాలు ఈ వారసత్వపు ఆస్తి హక్కు వలననే వస్తాయి, దీని రద్దు వలన పై దుర్లక్షణాలు సగం పైగా తగ్గిపోతాయి.

ఇంకో భావన.

"వివాహ సంబంధాల్లో పుట్టిన పిల్లలకు వుండే వారసత్వ హక్కులే వివాహేతర సంబంధాల్లో పుట్టిన పిల్లలకూ వుంటాయి" (పేజి–23).

ఈ మాటలు 172 సంవత్సరాలనాడే మహనీయులు చెప్పారు. ఇటీవలనే మన కోర్టులు ఈ విషయంలో ముందడుగు వేశాయి.

"అక్రమ సంబంధాలు వుంటాయి తప్ప అక్రమ సంతానం వుండదని" మన కోర్టులు చెప్పాయి, అక్రమ సంబంధాలనే మాటను కూడా వివాహేతర సంబంధాలుగా మన కోర్టులు ఇటీవల మార్చాయి . అది మంచి విషయమే! అయినా ఆచరణలో ఆ బిడ్డల రక్షణ జరగడం లేదని అనాథ శిశువులు తగ్గక పోగా పెరుగుతున్న దానిని బట్టి అర్థం అవుతుంది.

కానీ 172 సంవత్సరాల నాడే ఏ రకమైన సంతానమైనా దేశ భావి సంపదగా పరిగణించిన మహనీయుల దార్శనికతకు జేజేలు !

సొంత ఆస్తికి వ్యతిరేకంగా తీసుకోవలసిన 12 అంశాల కార్యక్రమంగా ఎంగెల్స్ చెప్పిన విషయాలను కమ్యూనిస్టు ప్రణాళికలో దాదాపుగా కొద్ది మార్పులతో తీసుకోవడం జరిగింది.

ఇంకా 24 వ పేజీలో ఎంగెల్స్ ఇలా చెబుతున్నాడు.

"మొత్తం పెట్టుబడి, మొత్తం వుత్పత్తి , మొత్తం మార్పిడి అంతా జాతి చేతికి వస్తే సొంత ఆస్తి దానంతటదే మాయం అవుతుంది"

అలాగే గ్రామాలకు, పట్టణాలకు మధ్య వైరుధ్యాన్ని, పరిశ్రమలకు– వ్యవసాయానికి మధ్య వుండే వ్యత్యాసాలను తగ్గించడం గురించి 27 వ పేజీలో వివరించాడు. ఇలా ఇంకా అనేక విశేషాలతో నిండి వున్నది ఎంగెల్స్ రచన.

ఎంగెల్స్ రాసిన ఈ విషయాలను ఈ పుస్తకంలో చేర్చి అనువాదకుడు, ప్రచురణకర్తలు చాలా మంచి పని చేశారు. వారికి ప్రత్యేక అభినందనలు.

## రెండవ భాగం

పుస్తకంలోని మూడవ భాగం అంటే ఎంగెల్స్ ముందు మాటలు చాలా విలువయినవి వున్నాయి, అయినా చాలా క్లిష్టత ముందు మాటలలో వుంది, ఇదే విషయం అనువాదకుడు గాంధీ గారు చెబుతూ కమ్యూనిష్టు ప్రణాళిక కంటే దాని ముందు మాట చాలా క్లిష్టమని చెప్పి వున్నాడు.

అందుకని కొత్త పాఠకుడు అంటే కమ్యూనిష్టు ప్రణాళిక మొదటి సారి చదివేవారు ఎంగెల్స్ ముందు మాటలను ప్రణాళిక చదివిన తర్వాత చదివితే ఉపయోగం వుంటుంది. రెండో సారి చదివే వారు వరుసలోనే చదివినా ఉపయోగమే!

పుస్తకంలోని నాలుగవ భాగం అసలయినది కమ్యూనిష్టు ప్రణాళిక భాగం. 40 పేజీలలో రాయబడిన అద్భుత రచన.

ఇది సిద్ధాంత గ్రంథమైనప్పటికీ దీని శైలి కావ్య శైలి, నూతన యవ్వనంతో, వడిగా, సమరశీలతతో, వేగవంతమైన ప్రవాహధార అందులో కనపడుతుంది.

ఏ ఇతర మార్క్స్– ఎంగెల్సుల రచనలలో కనపడని ప్రత్యేక శైలి ఈ చారిత్రాత్మక డాక్యుమెంటుకు వుంది.

ఒకటవ పేజి ముందు మాట అయిపోగానే ప్రారంభంలోనే "ఇంతవరకు సాగిన సమాజ చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రే" (పేజి–55) అనే ఈ ప్రకటన (statement) లోనే ఎంతో విషయం వుంది. ఒక పెద్ద గ్రంథం రాయదగినంత విషయాన్ని ఒక్క వాక్యంలో చెప్పడం మార్క్స్– ఎంగెల్సులకు మాత్రమే సాధ్యం అయింది.

58 వ పేజీలో

"ఆధునిక రాజ్యంలో ప్రభుత్వం అనేది మొత్తం బూర్జువా వర్గపు సమష్టి వ్యవహారాలు చక్కబెట్టే కమిటీ మాత్రమే. బూర్జువా వర్గం చారిత్రకంగా అత్యంత విప్లవకర పాత్ర పోషించింది" అని చెబుతూనే వర్తమానంలో దీని దుర్మార్గాలను ఎండగడతారు.

అదే పేజీలో

"మనిషికీ మనిషికీ మధ్య స్వలాభం తప్ప, డబ్బు చెల్లింపులు తప్ప ఇక ఏ సంబంధాన్ని అది మిగల్చలేదు" అని అంటారు.

61వ పేజీలో

"బూర్జువా వర్గ పాలన మొదలై ఇంకా వందేళ్ళయినా పూర్తి కాలేదు. కాని ఇంతకు ముందు తరాలన్నీ కలిసి సృష్టించిన ఉత్పత్తి శక్తుల కంటే విస్తారమైన, బ్రహ్మాండమైన ఉత్పాదక శక్తులను అది తన పాలనలో సృష్టించింది."

67వ పేజీలో

"బూర్జువా వర్గానికి ఎదురు నిలబడిన వర్గాలన్నిటిలోకి శ్రామిక వర్గం ఒక్కటే నిజమైన విప్లవకర వర్గం.......శ్రామికవర్గం ఆధునిక పరిశ్రమ ప్రత్యేక సృష్టి. అది దాని అతి ముఖ్య సృష్టి."

73వ పేజీలో

"పెట్టుబడి అనేది సమష్టి ఉత్పాదితం. అనేక మంది ఐక్యంగా కృషి చేస్తేనే అది సచేతనంగా వుంటుంది. అంతిమంగా

చెప్పాలంటే , మొత్తం సమాజ సభ్యులందరి సమైక్య చర్యల వల్లనే అది సాధ్యమవుతుంది."

80వ పేజీలో

కమ్యూనిష్టులు చేయవలసిన 10 కర్తవ్యాలను ఇందులో తెలపడం జరిగింది. వాటిలో భూములు, పరిశ్రమలు, బ్యాంకులు, వార్తా సాధనాలు, రవాణా సాధనాలు జాతీయం చేయడం; వారసత్వపు హక్కు రద్దు, ఎక్కువ ఆదాయం పెరిగితే ఎక్కువ పన్నులు, అందరికీ పని, వ్యవసాయం- పరిశ్రమలను కలపడం, గ్రామాలు- పట్టణాల మధ్య అంతరాలు తొలగించడం, ఉచిత విద్య , విద్యను పరిశ్రమల ఉత్పత్తితో మేళవించడం మొదలయినవి వున్నాయి, స్థలాభావం రీత్యా క్లుప్తంగా రాశాను.

పై కర్తవ్యాలు మన దేశం వంటి దేశాలలో అమలు జరగకుండా మిగిలే వున్నాయి, వాటిని సాధించుకోవలసే వుంది. ఆ కారణం రీత్యా మన దేశానికి కమ్యూనిస్టు ప్రణాళిక చాలా ప్రాసంగికత కలిగి వుంది.

95 వ పేజీలో

"ప్రతి చోటా అప్పుడున్న సామాజిక రాజకీయ వ్యవస్థలకి వ్యతిరేకంగా జరిగే ప్రతి విప్లవోద్యమాన్నీ కమ్యూనిష్టులు బలపరుస్తారు... అంతిమంగా అన్ని దేశాల ప్రజాతంత్ర పార్టీల ఐక్యత కోసమూ వాటి మధ్య అంగీకారం కోసమూ వారు కృషి చేస్తారు."

## చివరగా ముగింపు మాటలు

"శ్రామికులకు పోయేదేమీ లేదు, సంకెళ్ళు తప్ప. వారు గెలుచుకోడానికి ఓ ప్రపంచం వుంది. ప్రపంచ కార్మికులారా ఏకంకండి!" అనే ఉత్తేజకర అంతర్జాతీయ నినాదంతో పుస్తకం ముగుస్తుంది.

ప్రారంభం ఎలానో ముగింపు కూడా అలాగే గొప్పగా వుంటుంది. అద్భుతమైన ఈ రచనా శైలి ప్రభావం ప్రపంచ వ్యాపితంగా కమ్యూనిస్టు శ్రేణుల మీద పడి అనేక చారిత్రక పత్రాలు ఆ వరవడిలో రూపుదిద్దుకున్నాయి, ఎన్ని అలాటి పత్రాలు రూపొందినప్పటికీ మార్క్స్- ఎంగెల్సుల కమ్యూనిష్టు ప్రణాళిక మకుటాయమానంగా ప్రకాశిస్తూనే వుంటుంది.

## మూడవ భాగం

ఇప్పుడు కమ్యూనిస్ట్ ప్రణాళిక ప్రాసంగికత గురించి చెప్పుకుందాం. దానికి ముందు ముఖ్యమైన సూచన.

మన దేశంలో ఇంకా కోట్లాది మంది కమ్యూనిష్టు ప్రణాళిక చదివి అర్థం చేసుకోవలసే వుంది. పాలక వర్గాలు భయపెట్టిన ఫలితంగాను, మన వారి రచనా శైలిలోని క్లిష్టత వలననూ కమ్యూనిస్టు సాహిత్యం పరిచయం లేని వారు, మరియు కొత్త తరం చదవాలంటే భయపడుతున్న పరిస్థితి వుంది. స్కూలులో పిల్లలకు భాషలు నేర్పేటప్పుడు అర్థాలు ముందుగా నేర్పుతారు. అలాగే ఇలాటి చారిత్రక పత్రాలు చదివే వారికి కొన్ని పదజాలాల వివరణ మొదటలోనే 3 లేక 4 పేజీలలో ఇవ్వాలి, తెలిసిన వారు వాటిని తిప్పేస్తారు, తెలియని వారు వాటిని ముందుగా చదివి అర్థం చేసుకుని అసలు రచనలోకి వెళతారు. దాని వలన వారికి విషయం లోతుగా అర్థం అవుతుంది.

అలాటి పారిభాషిక పదాలు బూర్జువా, పెట్టీబూర్జువా, పెట్టుబడి, శ్రామికుడు, రాజ్యాంగ యంత్రం , సామ్రాజ్యవాదము, అగ్రరాజ్యాలు, వేతన బానిసత్వము, ఆదిమ కమ్యూనిజం, బానిస వ్యవస్థ, ఫ్యూడల్ వ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థ, సామ్యవాదము, సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, ఉదారవాదం ఇంకా అలాటి పదజాలాల స్థూల అర్థ వివరణ ఇవ్వాలి.

ఇలా ఇవ్వడం వలన కమ్యూనిష్టు పదజాలాలు తెలియని కొత్తగా చదివే వారికి చాలా వుపయోగంగా వుంటుంది.

## కమ్యూనిష్టు ప్రణాళిక ప్రాసంగికత - అన్వయింపు

కమ్యూనిష్టు ప్రణాళికలోని ఏ లక్ష్యాలు మన దేశంలో నెరవేరని రీత్యా, వున్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను కూడా పాలకులు ప్రైవేటీకరణ చేస్తున్న రీత్యా కమ్యూనిస్టు ప్రణాళిక ఆవశ్యకత నేడు ఎంతో పెరిగింది.

ఈ కమ్యూనిష్టు ప్రణాళిక మార్క్స్- ఎంగెల్స్‌లు అభివృద్ధి చెందిన - చెందుతున్న పారిశ్రామిక కార్మిక వర్గాన్ని దృష్టిలో పెట్టుకుని చెప్పినప్పటికీ కమ్యూనిస్టు ప్రణాళిక సమస్త వేతన బానిసత్వానికి, సమస్త దోపిడీకి వ్యతిరేకంగా పోరాడే కరదీపిక, వెలుగు దివిటీ.

మార్క్స్- ఎంగెల్స్‌లు ఇద్దరూ వున్న కాలంలోనే పారిస్ కమ్యూన్ తిరుగుబాటు జరిగి, 70 రోజులు కార్మిక వర్గ ప్రభుత్వం అధికారంలో వుండి , పెట్టుబడిదారీ పాలకుల క్రూర అణచివేత ఫలితంగా కూలిపోయింది. ఈ అనుభవాల నుండి గుణపాఠాలను ప్రపంచానికి ఆ ఇద్దరు మహనీయులు అందించారు.

ఆ గుణపాఠాలను బాగా అధ్యయనం చేసిన లెనిన్ మహనీయుడు రష్యా వంటి వెనకబడిన దేశంలో విప్లవాన్ని విజయవంతం చేశాడు.

ప్రధాన పారిశ్రామిక దేశాలలోనే విప్లవాలు మొదటగా వస్తాయని భావించారు మార్క్స్- ఎంగెల్సులు. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెంది సామ్రాజ్యవాదంగా మారిందని సూత్రీకరించాడు లెనిన్. మార్క్సిజాన్ని మారిన పరిస్థితులకు అన్వయించి సామ్రాజ్యవాద వ్యవస్థలోని బలహీనమైన లింకు రష్యా అని తెలుసుకుని ఆ లింకుని విప్లవం ద్వారా తెగగొట్టాడు, విజయం సాధించాడు.

ఇంకా మార్క్స్ - ఎంగెల్స్‌ల తర్వాత చెల్లాచెదరయిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ని పునరుద్ధరించి వెనకబడిన వలస, అర్ధవలస, ఫ్యూడల్, అర్ధ ఫ్యూడల్ దేశాలకు మార్క్సిజాన్ని అన్వయించడానికి కావలసిన గైడెన్స్ లెనిన్ ఇచ్చారు.

ఆ గైడెన్స్‌ని అందిపుచ్చుకుని చైనా, వియత్నాం, కొరియా, క్యూబా తదితర దేశాలలో కమ్యూనిస్టులు విజయం సాధించారు.

ప్రపంచ జనాభాలో అగ్రస్థానంలో వున్న చైనా పరిస్థితులకు మార్క్సిజాన్ని అన్వయించి మావో సేటుంగ్ విప్లవాన్ని విజయవంతం చేశారు. రష్యా, చైనా, వియత్నాం, కొరియా, క్యూబా ప్రజల విప్లవ పోరాటాలు చరిత్ర గతినే మార్చాయి.

స్టాలిన్ నాయకత్వంలో ఫాసిజానికి వ్యతిరేక పోరాటంలో, రెండవ ప్రపంచ యుద్ధంలో కోట్లాది రష్యా ప్రజలు తమ ప్రాణాలను త్యాగం చేసి ప్రపంచాన్ని కాపాడారు.

రెండవ ప్రపంచ యుద్ధ ఫలితంగా పొందిన నష్టాన్ని పూడ్చుకోవడమే గాకుండా ఎంతో అభివృద్ధి చెందిన అమెరికాకి పోటీ ఇవ్వగలిగిన శక్తిని సోవియట్ రష్యాకు కలిగించింది ఆ మార్క్సిస్టు సిద్ధాంతమే!

మార్క్స్- ఎంగెల్సులు చెప్పినట్లుగానే అభివృద్ధి క్రమం అనేక ఎగుడు దిగుడులలో, జిగ్‌జాగ్‌గా వుంటుందని చెప్పిన పరిస్థితి నేడు చూస్తూ వున్నాము. సోషలిస్టు- కమ్యూనిస్టు దేశాల వెనక పట్టు, కమ్యూనిస్టు శక్తుల వెనుక పట్టు చూస్తున్నాము, ఇది తాత్కాలికమే, ఇది ఒక ఎగుడు దిగుడు మాత్రమే అని మనం కమ్యూనిస్టు ప్రణాళిక అధ్యయనం ద్వారా తెలుసు కోగలుగుతాం!

మార్క్సిజం అనేది సైన్స్ అంతే కాదు, అది సోషల్ సైన్స్- సామాజిక శాస్త్రం. మామూలు సైన్స్ physics, chemistry, mathsలు కొన్ని సూత్రాల మీద ఆధారపడతాయి.

3+7=10., $H_2O$= నీరు, గురుత్వాకర్షణ సిద్ధాంతాలు మొదలయినవి. అవి అన్నీ అలాగే అన్ని చోట్ల వర్తింప గలుగుతాయి, కానీ సామాజిక శాస్త్రం అయిన మార్క్సిజం నిర్దిష్ట పరిస్థితులను, నిర్దిష్ట ప్రాంతాలను బట్టి అన్వయింపు వుంటుంది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో లాగా వెనకబడిన అర్ధ వలస అర్ధ ఫ్యూడల్ దేశాలలో వుండదు.

ప్రత్యేకించి అర్ధ ఫ్యూడల్ వ్యవస్థగా వున్న మన దేశంలో ఏ దేశంలో లేని కుల - మత వ్యవస్థ, మనువాద బ్రాహ్మణీయ వ్యవస్థ వుంది. అది ప్రజల వృత్తుల మీద, జీవనం మీద, ప్రజల సంపద మీద అత్యంత శక్తివంతమైన పాత్ర నిర్వహిస్తున్నది. ఉత్పత్తి సంబంధాలతో, ఉత్పత్తితో ముడిపడిన విడదీయరాని అంశంగా వుంది. అందుకే కులం ఉపరితల అంశం మాత్రమే కాదు ఇది పునాది అంశం కూడా!

రెండిటిలో ముడిపడిన సంక్లిష్ట అంశం కులం. అందుకే మన దేశంలో వర్గ పోరాటంతో పాటు కుల నిర్మూలనా పోరాటం కూడా జమిలిగా సాగవలసి వుంటుంది.

ఆఫ్రికా ఖండంలోని కమ్యూనిస్టులు శ్వేత జాతి దురహంకారానికి వ్యతిరేక పోరాటాన్ని వర్గపోరాటంతో మిళితం చేసి పోరాడుతున్నారు, అలాగే లాటిన్ అమెరికా ప్రజలు కూడా!

విశ్వవ్యాప్త సిద్ధాంతం మార్క్సిజం అది ప్రపంచంలోని దోపిడీ, పేదరికం, పీడనలు వున్నంతవరకూ పోరాడుతూనే వుంటుంది. భారతదేశంలో ఆదివాసీ, దళిత, మైనారిటీ, నిమ్న వర్గాలను, అన్ని రకాల శ్రమ జీవులను సమస్త బహుజనులను పీడిస్తున్న మనువాద కులవ్యవస్థకు వ్యతిరేక పోరాటం వర్గ పోరాటంలో భాగమే!

మన దేశంలో వర్గపోరాట మరియు కుల నిర్మూలనా పోరాట శక్తులను ఐక్యపరచవలసిన కర్తవ్యం మార్క్సిస్టుల భుజ స్కంధాల పైననే వుంది. కుల నిర్మూలనా పోరాటాన్ని ప్రధాన ఆయుధంగా చేసుకున్న అంబేద్కర్ మహనీయుడు ఆయన ఆలోచనలు, ఆయన వారసులు కమ్యూనిష్టులకు సహజ మిత్రులు. అలాగే అంబేద్కర్ వాదులకు కమ్యూనిష్టులు సహజ మిత్రులు.

ప్రజాతంత్ర మిత్రులతో కలసి పోరాడవలసిన కర్తవ్యాన్ని కమ్యూనిస్టు ప్రణాళికలో కూడా మహనీయులు చెప్పి వున్నారు.

ఆ వాక్యాలు ఇవి,

95 వ పేజీలో

"అంతిమంగా అన్ని దేశాల ప్రజాతంత్ర పార్టీల ఐక్యత కోసమూ వాటి మధ్య అంగీకారం కోసమూ వారు కృషి చేస్తారు"

నేడు భారత దేశంలో కమ్యూనిష్టులు వర్గపోరాటంతో పాటు కులనిర్మూలనా పోరాటం చేపట్టడంతో పాటు, కుల నిర్మూలన వాదులతో దీర్ఘకాలిక ఐక్యతను, ఐక్యసంఘటనను ఏర్పరచు కోవాలి!

తక్షణ కర్తవ్యాలలో భాగంగా NPR/CAA/NRC లకు వ్యతిరేకంగా విశాలమైన ఐక్య కార్యాచరణ వేదికలను అన్ని రకాల ప్రగతిశీల శక్తులతో కలసి ఏర్పాటు చేసుకోవాలి!

ప్రజాపీడక ఫాసిస్టు పాలకులకు వ్యతిరేకంగా అగ్రగామి దళం పాత్ర కమ్యూనిస్టులు నిర్వహించాలి!

లాల్ - నీల్ శక్తుల ఐక్యత వర్ధిల్లాలి!

కమ్యూనిష్టు ప్రణాళిక అజేయం!

కమ్యూనిష్టు ప్రణాళికకు జేజేలు పలుకుదాం! ❑